ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 486 డిసెంబర్ 2025 వెల : రూ.20/-

## నాలుగు లేబర్ కోడ్‌ల అమలు వద్దు

## ఆధునిక బానిసత్వం వద్దు వద్దు




జనసాహితి ప్రచురణ

కవిత

# అమెరికా ఒక పిరికిపంద!

నేపాలీ : **మనోజ్ బోగాటి** ఇంగ్లీషు : **రాజా పునియాని** తెలుగు : **కొత్తపల్లి రవిబాబు**

**భయం** గుప్పిట్లో వుంది అమెరికా!
వెదురు అడవులలోని దావానలం చూసి
భయభ్రాంతమౌతోంది.
ఆకాశాన్ని చీలుస్తూ పండగల్లో ఎగిరే
బాణాసంచా వెలుగులకి భీతి కుడుస్తోంది.
చిటికెడు చీకటికే వణికి చస్తోంది.
శ్రామికుడు తన డబ్బా తెరచి
మాడిపోయిన రొట్టె బయటకు తీస్తుంటే
భయంతో అమెరికా అంతిమశ్వాస విడుస్తోంది.
అదే పనిగా అడుగుతుంది వెర్రి అమెరికా
ఆ రొట్టె నల్లగా, గుండ్రంగా ఎందుకుందని!
బడికి వెళ్ళే పిల్లల సంచులను అది తనిఖీ చేస్తుంది,
ప్రతి పేజీ పరిశీలించి, పిల్లలు దిద్దుతున్న వంకర టింకర
అక్షరాలను కళ్ళార్పకుండా చూస్తుంది.
తన భార్యకు ఈ మెయిల్ పంపి అప్పుడే
బయటకు వచ్చిన యువకుడు పంపిన
సందేశపు భాషను వెంటాడుతుంది.
'ఏమి రాశాడో?' అని ఆచూకీ తీస్తుంది.
ఎక్కడో గట్టిగా కుక్క మొరిగినా అమెరికా నిద్ర పోలేదు
అంతా ప్రశాంతంగా వున్నా కూడా అమెరికా నిద్ర పోలేదు
భయం గుప్పిట్లో బందీ అవుతుంది అమెరికా.
అమెరికా భయంతో గజగజ వణికిపోతున్నది
బెదిరిపోయినప్పుడల్లా కొత్త ఆలోచనలమీద
నిఘా పెడుతుంది
జనం పాటలను వేటాడుతుంది
కవితలలోని లోలోతుల అర్థాన్ని లాగి
గంటలకొలది దిగులు చెందుతుంది.
బెదిరిన అమెరికా వల్ల ఏదో ఒక ఇంటిలో
ప్రశాంతత అదృశ్యమౌతుంది.
బెదిరిన అమెరికా వల్ల చీకటిలో వీచే గాలి
విరక్తికి లోనవుతుంది.
బెదిరిన అమెరికా తన కూతురుమీద తానే దాడి చేస్తుంది.
పొయ్యిలోని నిప్పు శబ్దం చేస్తే అమెరికా మెదడు
మండిపోతుంది.
వరండాలో ఎండ గమనం మందగిస్తే అమెరికా దుస్తులు
కోపగించుకుంటాయి.
ఎక్కడో దూరంగా ఒక శిశువు గొంతెత్తి
బిగ్గరగా విలపిస్తుంటే
పిస్టల్ వుందో లేదో అని జేబు తడుముకుంటుంది
ఆ చిత్రకారుడి చిత్రంలో ఎందుకంత
ఎరుపు రంగు వుంది?
ఆ కవయిత్రి కవిత చదువుతూ ఎందుకు
పిడికిలి బిగించింది?
ఆ గాయకుని పాటలో ఎందుకు అంత కర్కశత్వం వుంది?
భార్య జుట్టులో పెట్టుకున్న క్లిప్ కెమేరాలా వుందే?
కూతురి ప్రియుడి చేతిలోని లైటర్ పై కంపెనీ పేరు
ఎందుకు లేదు?
ఇలా అన్నీ భయాలే అమెరికాకు.
అది భయపడినప్పుడు భూగోళపు నీడ చెరిగిపోతుంది
పిరికిపంద అమెరికా! కొత్త భావాలంటే భయపడి చస్తుంది!
దానికి చావంటే భయం. బతుకంటే కూడానా?
అమెరికా భయపడుతోంది అన్నది మాత్రం నిజం!

ప్రసిద్ధ కవి మనోజ్ బొగాటి నేపాలీ భాషలో రాసిన కవిత 'Kaafarey America' ('Coward America'). ఆయన ఇప్పటికీ ఐదు కవితాసంపుటాలు ప్రచురించారు. 2012లో కేంద్ర సాహిత్య అకాడెమీ యువ సాహిత్య పురస్కారం అందుకున్నారు. జర్నలిస్టుగా వృత్తిరీత్యా కాలింపాంగ్‌లో వుంటున్నారు. కథారచయితగా కూడా ప్రసిద్ధులు. (డార్జిలింగ్ టైమ్స్.కామ్ సౌజన్యంతో)

49వ ఏట ప్రవేశించి నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

జనసాహితి ప్రచురణ

# ప్రజాసాహితి

486

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 49

సంచిక : 05

డిసెంబర్ 2025

*website :* **www.prajaasaahithi.com**

## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : నాలుగు లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ.... – కార్టూన్ (అంతర్జాలం నుండి) | | .....01 |
| ❑ రెండవ అట్ట | : అమెరికా ఒక పిరికిపంద (కవిత) | – అనువాదం : కొత్తపల్లి రవిబాబు | .....02 |
| ❑ మూడవ అట్ట | : పద్మవ్యూహం (కవిత) | – పి.ఎస్. నాగరాజు | .....35 |
| ❑ నాల్గవ అట్ట | : ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా.... కార్టూన్ (అంతర్జాలం నుండి) | | .....36 |
| ❑ సంపాదకీయం | : ప్రజాసాహిత్య సంస్థలు – సంఘటిత కృషి | | .....05 |
| ❑ కథ | : మార్పు కోసం.... | – పి. రాజ్యలక్ష్మి | .....07 |
| ❑ పాట | : మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు | – ప్రజాకవి అందెశ్రీ | .....13 |
| ❑ వ్యాసాలు | : కాళోజీ విశిష్ట వ్యక్తిత్వం | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....11 |
| | స్వయం గౌరవ ఉద్యమానికి వందేళ్ళు | – అరుణ | .....20 |
| ❑ జ్ఞాపకాలు | : ప్రజాసాహిత్య, సాంస్కృతికోద్యమంలో ఒక మైలురాయి జనసాహితి వర్క్‌షాప్ | | .....14 |
| | : పోటొస్తే, నది అయినా వెనక్కి తగ్గక తప్పదు! | – రాఘవ | .....16 |
| ❑ కవితలు | : దాసరి రామచంద్రరావు (19); పసిడిమొగ్గ మోహనరావు (28); సహచరి (32) | | |
| ❑ కరపత్రం | : మద్యం, మాదకద్రవ్యాల వ్యసనాలపై జనసాహితి కరపత్రం | | .....23 |
| ❑ సినిమా సమీక్ష | : 31వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం | – బాలాజీ (కోల్‌కతా) | .....25 |
| ❑ తీర్మానాలు | : జనసాహితి కార్యవర్గ తీర్మానాలు | | .....29 |
| ❑ వివిధ | : ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (04); చిత్రకళాసంత ప్రకటన (10); కృతజ్ఞతలు (22); చైతన్యవాహిని (32); ఈ పుస్తకాలు అందాయి (33), వార్తాసాహితి : అందెశ్రీ, పెంచలయ్య (34) | | |


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు, రచనలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

*సంపాదకుని చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
0680101004936
IFSC No. CNRB0000680
UPI 9490196890

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 25,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 20,000 |
| లోపలి అరపేజి | రు. 10,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు
తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు,
సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప)
ప్రకటనలు సేకరించి
పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# ముప్పై ఏళ్ళ క్రితం "ప్రజాసాహితి"

**సంచిక : 5 సంపుటి : 19 డిసెంబర్ 1995**




**చిత్రకారుడు** పి.డి.యస్. కుమార్ గీచిన కెన్ సారో వివా ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండవ కవరు పేజీలో నిర్మలానంద అనువాదం చేసిన కెన్ సారో వివా రాసిన "ఒగోనీ! ఒగోనీ!" కవితనూ, మూడో కవరుపేజీలో కెన్ సారో వివా తదితరుల ఉరితీతపై జనసాహితి ప్రధానకార్యదర్శి ఖండన ప్రకటన, నాల్గవ కవరుపేజీలో సుబ్బారావు పాణిగ్రాహి రాసిన 'ఎర్రజెండా పట్టి, ఎర్రచీరా గట్టి' పాటను ప్రచురించారు.

'కెన్ సారో వివా అమరత్వం' అనే సంపాదకీయంలో దక్షిణ నైజీరియాలో రాయల్ డచ్ షెల్ అనే ఆంగ్లో డచ్ బహుళజాతి ఆయిల్ కంపెనీ అక్కడి పర్యావరణాన్ని సైనిక ప్రభుత్వం అండదండలతో కలుషితం చేస్తూ, ఒగోనీ జాతి ప్రజల మానవ హక్కులను హరించివేస్తుందని తెలియచేశారు. దానికి నిరసనగా సాగుతున్న ఉద్యమంలో నైజీరియా నాటక రచయిత కెన్‌సారోవివా ప్రముఖపాత్ర వహించారన్నారు. ఆయనను అరెస్టు చేసి, 17 నెలలు జైల్లో నిర్బంధించి చివరికి అక్కడి ప్రభుత్వం ఉరిశిక్ష విధించి చంపివేసిందన్నారు.

వెనుకబడిన దేశాలపై 'న్యూ వరల్డ్ ఆర్డర్' పేరుతో సామ్రాజ్యవాద దేశాలు, వాటి జేబు సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, గాట్ మరియు బహుళజాతి సంస్థలు సహజవనరులను కొల్లగొడుతూ, సాంస్కృతికంగానూ, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని ప్రపంచ ప్రజలందరూ వీటిని ఎదిరించటమే కెన్‌సారోవివాకు ఇచ్చే నిజమైన నివాళి అని రాశారు.

ఎ. అప్పల్నాయుడు రాసిన "బంధాలు–అనుబంధాలు" కథనూ; ధారావాహికగా 'చెదిరిన సమాజం' చినువా అచ్‌బే రాసిన నవలను, 26 డిసెంబరు సుబ్బారావు పాణిగ్రాహి తదితర శ్రీకాకుళం అమరవీరుల వర్ధంతి సందర్భంగా వినయ్ రాసిన 'వెలుగుదారి' కథనాన్ని, పి. చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహిస్తున్న 'పిల్లల ప్రపంచం' శీర్షికలో డా॥ కలెవరపు వెంకట్రామయ్య రాసిన "గురజాడ బాల్యం"ను, కెన్ సారో వివాకు నివాళులర్పిస్తూ "ఇదేమీ అల్ప విషయం కాదు" – జేసన్ గార్నర్ రాసిన వ్యాసాన్నీ, కెన్ సారో వివా కోర్టుకు సమర్పించిన ప్రకటనలో కొన్ని భాగాలను, "ఆంక్షలు–నిషేధాలు" శీర్షికలో 'నైజీరియాలో పత్రికలపై, జర్నలిస్టులపై నిర్బంధాలు – నిషేధాలు' వ్యాసాన్ని ప్రచురించారు. 'ఉత్తరాలు' శీర్షికలో " 'ప్రజాసాహితి' జాషువా శతజయంతి సంచిక – శ్రీ ఎన్. అంజయ్య జవాబుపై ఒక అభిప్రాయాన్ని" టి. రవిచంద్ రాశారు. 'కవితలు' శీర్షికలో రంగు సత్యనారాయణ రాసిన "రాత్రి పన్నెండు దగ్గరే....", అల రాసిన 'అద్దం', కెన్ సారో వివా రాయగా అఫ్సర్ అనువాదం చేసిన "నేనొక తుపాను", ఛాయరాజ్ రాసిన "కవీ! కెన్ సారో వివా", పి.ఎస్.నాగరాజు రాసిన "నైజీరియా! నేడు నువ్వొక తుపాను", వేల్పుల రవీందర్ రాసిన 'నేలకొరిగిన రవితేజం', నిశితాసి రాసిన "కవీ! రవీ! సారోవివా" రాసిన కవితలున్నాయి. రాజశేఖర్ రాసిన 'కెన్ సారో ఒకరు కాదు' అనే జనంపాటను, 'స్వీకారం', 'చైతన్యవాహిని' శీర్షికలను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 72 పుటలు; వెల : రూ. 6/–

## సంపాదకీయం

# ప్రజాసాహిత్య సంస్థలు - సంఘటిత కృషి

**ప్రజల** జీవితం సాహిత్య సృజనకు తరగని గని. జీవన సంఘర్షణ నిరంతరంగా సాగుతూనే వుంటుంది. సహజమైన ఈ సంఘర్షణే మార్పుకు మూలం. ఈ సంఘర్షణ విస్తృతంగా జరిగితే సామాజిక మార్పులు సంభవిస్తాయి. అసమానతలను పెంచి పోషిస్తున్న సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రగతిశీలశక్తుల నాయకత్వాన జీవన సంఘర్షణను ప్రజాఉద్యమంగా మలచటం అత్యంత కీలకమైనది. తమ సాహిత్య కళారూపాల ద్వారా అందుకు దోహదపడటం రచయితల, కళాకారుల ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమాల కర్తవ్యం.

రచయితలు సాహిత్యం ద్వారా జీవితం గురించి తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తారు. అంటే సాహిత్యం జీవిత వాస్తవికతకు ప్రతిబింబం. జీవితపు లోతుల్ని విమర్శనాత్మకంగా తెలిపే పరికరంగా సాహిత్యం ఉండాలి. జీవితంలోని సౌందర్యాత్మకతను ఆవిష్కరించే సాహిత్యం పాఠకుడి సాంఘిక సంస్కారాన్ని పెంచుతుంది. సమాజంలో సాహిత్యాభిలాష తగ్గితే అది ఆ భాష, జాతి అనారోగ్యానికి చిహ్నం. రచయితలలో సామాజిక దృష్టి కొరవడితే అది సాహిత్యపు లక్ష్యానికి నష్టం. విమర్శకులలో శాస్త్రీయ దృక్పథం పలచనైతే రచనల విశిష్టతను పాఠకులు, రచయితలు సరిగా అర్థం చేసుకోలేరు. రచయితలలో కెరీరిజం పెరిగితే అది ప్రజలకు, ప్రజాసాహిత్యానికి ద్రోహం చేస్తుంది.

ప్రజలు ఎదుర్కొనే సమస్యలను, వాటికి గల సామాజిక కారణాలను, వివిధ రకాల పరిష్కార మార్గాలను, వారి జీవితాలలో నుంచి సాహిత్యంలోకి కళలలోకి తేవడం ప్రజారచయితల బాధ్యత. ఆ సాహిత్యాన్ని, కళలను ప్రజల వద్దకు చేర్చడం అనే సంఘటిత కృషి లక్ష్యంగా నిర్మాణాత్మకంగా పని సాగించడం సాహిత్యోద్యమ సంఘాల ధ్యేయం. ఈ కృషిని కొనసాగించడంలో వ్యక్తులుగా వుండి, సామాజిక దూరదృష్టితో సంఘాలతో కలసి కృషి చేసేవారికి, సంఘాలలో వుండి కృషిచేసే వ్యక్తులకు మధ్య కృత్రిమమైన పోటీ పెట్టడం పాలకవర్గ ప్రయోజనాల కోసమే. సామాజిక సంపదకు మూలాలైన భూమి, పరిశ్రమలు, సాంకేతిక పరికరాలపై గుప్పెడు మంది దోపిడీ వర్గాల పెత్తనాన్ని అర్థ వలస – అర్థ ఫ్యూడల్ వ్యవస్థ, అది నిర్దేశించే ఉత్పత్తి సంబంధాలు అనుమతిస్తున్నాయి. వర్గము, కులము, ప్రాంతము, జెండరు తదితర అసమానతలకి మూల కారణం కూడా ఇదే. ఈ ఆర్థిక, సాంఘిక సంబంధాలూ, వాటిని కాపాడే రాజకీయ వ్యవస్థ కలగలిసి సృష్టించి ప్రజలపై రుద్దేవే భూస్వామ్య – సామ్రాజ్యవాద సంస్కృతులు. చెప్పుకోవడానికి పై రెండు విడివిడివే కానీ జీవితంలో అవి మిళితమైపోయి ఉంటాయి.

సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులకు ఊడిగంజేస్తూ, భారతీయులలో పరాధీన బానిస సంస్కృతిని పాలకులు వ్యాప్తి చేస్తున్నారు. దీనికి ఉదాహరణే హస్తలాఘవ విద్యతో ప్రజలను భూస్వామిక మౌఢ్యాలలో ముంచిన పుట్టపర్తి బాబా శతజయంతి కార్యక్రమాలను పాలకులు నిర్వహించటం. భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులు ఎలా కలగలిసి పనిచేస్తున్నాయో దీనివల్ల అర్థమౌతుంది.

దోపిడీ పాలకవర్గాలు సంఘటితశక్తితో నిర్మాణయుతంగా ఉన్నారు. తమ రాజ్యాధికారంతో తమ దోపిడీ వ్యవస్థను కాపాడు కుంటున్నారు. అందులో భాగంగా రచయితలకు, కళాకారులకు పలు విధాలైన పురస్కారాలను అందించే సంస్థలను, అంటే తమ సాంస్కృతిక సైన్యాన్ని సంఘటితంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. పాలకుల దళారీతత్వాన్ని, దోపిడీ అణచివేతల స్వభావాన్ని సాహిత్య కళారూపాల ద్వారా విమర్శకు గురికానివ్వకుండా జాగ్రత్త పడుతున్నారు.

పాలకులను విమర్శకు సాధ్యమైనంత అతీతులుగా చేయటం, సాహిత్య, కళాకారుల పురస్కారాల అర్హతలకు ఒక అప్రకటిత మార్గదర్శక మవుతుంది. పాలకవర్గాలకు స్పష్టంగా తమ సాంస్కృతిక సైన్యపు నిర్మాణం ఉంది, సాధించదల్చుకున్న లక్ష్యమూ వారికి ఉంది. ప్రజావ్యతిరేక శక్తుల నిర్మాణ రంగాలలో, పాలకవర్గ లక్ష్యాల ప్రయోజనాలలో ఇమిడిపోయే రచయితలు, కళాకారులు ఉంటూనే ఉన్నారు.

దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలలో భాగమైన ప్రజావ్యతిరేక సంస్కృతిని ఖండిస్తూ, సూక్ష్మరూపాలలో సాగే ప్రజల జీవన సంఘర్షణను చిత్రించే రచయితల, విశాల సామాజిక సంఘర్షణ వైపుగా ఉద్యమించే ప్రజల, తిలకించే ప్రేక్షకుల, సాహిత్యం చదివే పాఠకుల ఆలోచనలను పదునెక్కేలా చేయటం ప్రజా సాంస్కృతికోద్యమ మౌలిక కర్తవ్యాలలో, బాధ్యతలలో ఒకటి.

ఇలాంటి సామాజిక సందర్భంలో ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాల్సిన సాహిత్య సాంస్కృతిక శక్తులు సంఘటిత శక్తిగా, నిర్మాణయుత శక్తిగా రూపొందాలి. వ్యక్తులు ఎవరికి వారుగా కృషి చేస్తే సరిపోతుందనే ధోరణి, ప్రజాసాహిత్యకారులను, ప్రజాతంత్ర సాంస్కృతిక శక్తులను బలహీనపరచడమే అవుతుంది.

వ్యక్తిగత ఆస్తుల సమాజం, దాని బూర్జువా తాత్వికత, ప్రతి కృషినీ విజయాన్నీ కేవలం వ్యక్తిగతమైనదిగా మాత్రమే పరిగణిస్తుంది. అది వ్యక్తి వెనుక వున్న సమష్టినీ, సమష్టిలోని వ్యక్తినీ గుర్తించలేదు. సమష్టి శ్రమ జనితమైన సంపదంతా వ్యక్తులపరం గావించటం దోపిడీ వ్యవస్థ లక్షణం. కనుక అది వ్యక్తులను మాత్రమే కీర్తిస్తుంది, ఆకాశాని

కెత్తుతుంది. వ్యక్తిగత ఆస్తి పట్ల వ్యామోహాన్ని పెంచినట్టే, వ్యక్తిగత కీర్తిని వ్యామోహ స్థాయికి పెంపొందిస్తుంది. ఆ విధంగా వ్యక్తిని సమష్టి నుండి, ప్రజాఉద్యమ నిర్మాణాలనుండి విడగొట్టి కెరీరిస్టు దృష్టిపథంలోకి గుంజుకుపోయే ప్రయత్నం ప్రపంచీకరణ కాలం నుండి తీవ్రతరమైంది.

ప్రపంచ, దేశీయ శ్రామికోద్యమాలు వెనుకపట్టు బట్టడం సాంస్కృతిక సామ్రాజ్యవాద దాడికి సానుకులాంశంగా పని చేసింది. సిద్ధాంత దృక్పథంతో నిలబడుతున్న శక్తులు బలహీన స్థితిలో వుండటం వల్ల అస్తిత్వవాదంలోని "వ్యక్తి స్వేచ్ఛా" సుగుణం దాని పరిమితులలో మిగలకుండా వ్యక్తితత్త్వ ధోరణిలోకి మరలి చివరకు వ్యక్తివాదంలోకి దిగజారింది. సామాజిక దోపిడీకి, అణచివేతకు గురవుతున్న వివిధ ఉద్యమాలను తునకలు గావించే లక్ష్యంతో ప్రవేశించిన ఈ పోస్టు మోడర్నిస్టు సిద్ధాంతం, వినిర్మాణ వాదాన్ని (సంస్థలలో, నిర్మాణాలలో, సమష్టి బాధ్యతలలో వుండకూడదు అనే వాదం) కూడా వ్యాప్తి చేసింది. తరతరాల మానవీయ సమష్టి అనుభవాల వైజ్ఞానిక సారాల్ని అనుభవిస్తూనే దాన్ని వ్యక్తిగత ఔన్నత్యతత్త్వంగా కీర్తించింది. ఉద్యమాల నుండి వ్యక్తులను వేరుచేసే విశ్లేషణలు గుప్పించింది. ఒక రాజకీయ నిర్మాణశక్తి మూలంగా అభివృద్ధియిన ఉద్యమాలను ఒకరో ఇద్దరో వ్యక్తుల ప్రయోజకత్వంగా చూపిస్తున్నది.

సంస్థాగతమైన బాధ్యతలను స్వీకరించడానికి, కొనసాగించటానికి సంసిద్ధతలు లేనివారు కొందరు సంస్థాగత కృషి తమ వ్యక్తిగత అభివృద్ధికి అడ్డం వస్తుంది అని సిద్ధాంతీకరిస్తారు. వ్యక్తిగత ఆస్తుల సమాజం, అందునా స్పష్టమైన వర్గ విభజన రేఖలను చూపించే పెట్టుబడిదారీ ధనస్వామ్య సమాజం, కోట్లమంది వ్యక్తులను అణచివేస్తూ కొద్దిమంది వ్యక్తులను బులిపిస్తుందన్న సంగతి మనందరికీ తెలుసు. వ్యక్తివాద సంస్కృతికి పాలకులు రకరకాల పురస్కారాలనూ, పదవులనూ గుర్తింపుల కీర్తి కిరీటాలను తొడుగుతున్నారు. అలాంటివి పొందినవారు ప్రతిభావంతులు అవునా కాదా అనేది చర్చ కాదు. పాలక దౌష్ట్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను, చూసీ చూడనట్టు పోయే వారిని పెంచుకోవడమే పాలకుల లక్ష్యం.

సంస్థలలో లేకపోయినా సామాజిక జీవితం పట్ల నిబద్ధత కలిగిన అనేకమంది ప్రజానుకూలమైన ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించారు. వారినీ, వారి కృషిని సంస్థలు గుర్తించి గౌరవించిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. తమ తమ కారణాలతో వారు సంస్థలలో లేకపోయినా సంస్థలు సాగించే కృషి పట్ల వారిలో ఎక్కువమంది సానుకూల దృష్టితోనే ఉన్నారు, ఉంటున్నారు.

'ప్రజాసాహితి' 200వ సంచికను కడపలో ఆవిష్కరించినప్పుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు "పెద్దగా వనరులు లేని సంస్థ ఒక సాహిత్య మాసపత్రికను 200 సంచికలు వెలువరించడం చాలా చారిత్రాత్మకమైన విశేషం"గా ప్రశంసించారు. "200 ఏమిటి 400 తెస్తాం!" అని అదే వేదిక నుండి నిర్మలానంద ఢంకా భజాయించారు. కామ్రేడ్ నిర్మలానంద గారు 416వ సంచికను తన చేతులలో పట్టుకుని కన్నుమూశారు. నిర్మలానంద జనసాహితి సంస్థలో చేరకముందు నుండీ ఆయన వ్యక్తిగతంగానూ, మిత్ర బృందాలతోనూ సాహిత్య కృషి చేశారు. జనసాహితి ఆశయాలనూ, లక్ష్యాలను స్వీకరించి, ప్రజాసాహిత్యోద్యమంలో భాగమైన తరువాత ఆయన ప్రజానుకూల పరిశీలనతో ప్రజాతంత్ర సాహిత్య సృజనను ముమ్మరం చేశారు. తన తోటి కార్యకర్తలను, రచయితలను, కవులను కూడా దానిలో భాగస్వామ్యం చేశారు.

సంస్థలలో ఏదో ఒక స్థాయిలో కొంతకాలం పనిచేసి ఆ తర్వాత వాటి నుండి బయటకు వెళ్లిన కొద్దిమంది మాత్రమే ఇటువంటి వ్యక్తివాద ధోరణితో ఉంటున్నారు. ఇది ప్రజా సాంస్కృతిక ఉద్యమ కృషిని, సంస్థలు సంఘటితంగా చేసే కృషిని కించపరిచే ధోరణి. దీని పట్ల ఉద్యమ సంస్థలే కాక ప్రజానుకూల శక్తులు కూడా అప్రమత్తంగా ఉండాలి.

అక్టోబర్ 18న హైదరాబాదులో జరిగిన 'నిర్మలానందం' సభలో మాట్లాడిన ఒకరిద్దరు నిర్మలానంద జనసాహితిలో చేసిన కృషి గురించీ, 'ప్రజాసాహితి' పత్రిక నిర్వహణ బాధ్యత గురించీ కనీస ప్రస్తావన కూడా చేయని ధోరణి ఆశ్చర్యపరిచింది. అయినప్పటికీ ఆయనను సంస్థ నుండి, పత్రిక నుండి విడగొట్టి చూపాలనే వీరి ప్రయత్నాన్ని పట్టించుకోకుండా ఆనాటి ఉపన్యాసకులలో మిగిలినవారందరూ మాట్లాడటమే ఆ ధోరణికి ఇచ్చిన సరైన జవాబు.

నిర్మలానంద 35 సంవత్సరాలకు పైగా దీక్షా దక్షతలతో నిర్వహించిన సాహిత్యోద్యమ కృషిని ప్రస్తావించకుండా, పరామర్శించకుండా... ఆయనే గానీ సంస్థల వెలపల ఉండి ఉంటే... ఇంకా చాలా పేరు సంపాదించేవారు అనీ, సామాజిక ఆశయం, లక్ష్యం సాధించడానికి ఒక సిద్ధాంత, రాజకీయ మార్గదర్శకత్వంలో వుండటం ఆయన చేసిన పొరపాటని, తమకు లభించిన తరహా పురస్కారాలను, పదవులను కోల్పోయాడని ఉపన్యాసకులలో ఒకరైన భూమన్ నిర్మలానంద పట్ల జాలి చూపిస్తున్నారు. కానీ నిర్మలానంద ఈ కుత్సితపు జాలి మాటలకు అందనంత ఎత్తుకెదిగారు.

అయితే 44 సంవత్సరాల క్రితం సంస్థ నుంచి విడిపోతున్నవారిపై కామ్రేడ్ నిర్మలానంద ఆగ్రహంతో చూసిన చూపులో వ్యక్తిగతం ఎంత మాత్రం లేదు. ప్రజాసాహిత్య ఉద్యమానికి జరిగే అత్యల్ప నష్టాన్ని కూడా సహించలేని తీవ్ర ఆవేదన అది. అది ఈనాటికీ భూమన్‌ను వెంటాడుతోందంటే అందులో ఎంత బలం ఉందో అర్థమవుతుంది. అది సంస్థలను వీడి కెరీరిజాన్ని ఆశ్రయించే వారందరినీ వెంటాడే చూపు!

'ప్రజాసాహితి' 300 వ సంచిక సంపాదకీయం నుండి ఉల్లేఖనతో దీన్ని ముగిద్దాం.

"ఈ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విసిరిన పోస్టు మోడర్నిస్టు వలలోకి చిక్కుకోనందుకు కాలం చెల్లిన, సాంప్రదాయక వాదులమనే నిందలు భరిస్తూ, "తుప్పు పట్టిన" వర్గపోరాట సిద్ధాంతాలను వదలలేని వారిగా, కొత్తదనాన్ని స్వీకరించలేనివారిగా ముద్రలు వేయించుకుంటూ, తీవ్రమైన సైద్ధాంతిక దాడుల వత్తిడిని తట్టుకుంటూ కూడా జనసాహితి కృషి చేసింది. నిజానికి ఈ సంఘర్షణ సంస్థను మరింత పదునుదేల్చింది. సునిశిత పరిచింది. నిబ్బరాన్ని పెంచింది. నిలకడనిచ్చింది." ✣

# మార్పు కోసం....

పి. రాజ్యలక్ష్మి

**తెల్లవారుజామున** నాలుగు గంటల సమయంలో కాలింగు బెల్ శబ్దంతో మెలకువ వచ్చింది. ఎవరయి ఉంటారోనని నిద్ర కళ్ళతో కిటికీ అద్దంలోంచి చూశాను.

సంజయ్ నిలబడి వున్నాడు. వాడిని చూడగానే నిద్రమత్తు ఎగిరిపోయింది. ఏదో జరిగే ఉంటుందని సందేహిస్తూ తలుపు తీసాను.

లోపలికి వచ్చినవాడు అటూ ఇటూ దిక్కులు చూస్తూ, గస పెడుతున్నాడు.. పరిగెత్తుకుంటూ వచ్చినట్లున్నాడు.

ఈ టైమ్‌లో వాడు ఇంటికి వచ్చాడంటేనే ఏదో జరిగే ఉంటుందన్న అనుభవము ఉన్న నాకు, వాడి తటపటాయింపు చూసి విషయం పెద్దదే అయి ఉంటుందనిపించింది.

"ఏంటిరా, ఈ సమయంలో వచ్చావ్, హైరానా పడుతున్నావ్, రా, స్తిమితముగా కూర్చో" పైకి అన్నానే గాని, నాకూ లోపల టెన్షన్‌గానే వుంది.

వాడు కాస్త తేరుకొని, "పవన్, అశోక్‌లు కనబడటం లేదు" అని అన్నాడు.

వినగానే నాకు గుండెల్లో రాయి పడింది. వాళ్లిద్దరూ పారిపోవటానికి కారణమే లేదు. ఎందుకిలా జరిగింది.... అనుకుంటూనే

"అన్ని చోట్ల వెతికేరా?,

"అన్ని చోట్లూ వెతికాము".

"ఏదయినా గొడవ జరిగిందా?,

"అలాంటిది ఏమీ జరగలేదు.. వాళ్లిద్దరి దగ్గర రెండు సెల్ఫోన్లూ చూసి" ఎక్కడివి?, అని అడిగితే స్కూలులో ఫ్రెండ్స్ ఇచ్చారని చెప్పారు".

"ఇద్దరు వేరు వేరు స్కూళ్ళు కదా! ఇద్దరికీ ఒకేసారి ఎలా ఫోన్లు వచ్చాయి?" అని ఆలోచిస్తూ పైకి అనేశాను.

"వాళ్ళు ఎక్కడో పట్టుకొచ్చారని నా డౌట్. ఎలా వచ్చాయని ఎంత సేపు అడిగినా ఏవేవో చెబుతున్నారు. వాళ్ళతో మాట్లాడి లాభం లేదని ఫోన్లు తీసుకున్నాను."

"ఇదంతా అందరి పిల్లలముందే జరిగిందా?"

"అందరికీ తెలుసు. వాళ్ళ దగ్గర వారం నుండి ఫోన్లు ఉన్నాయట. ఎవరైనా అమ్మకు చెబితే వాళ్ళని ఖతం చేస్తానని" అశోక్ బెదిరించాడట.

"సరే నువ్వు వెళ్లి పిల్లలతో మాట్లాడు. నిబ్బరంగా వుండు. ఎవరికో ఒకరికి అసలు విషయం తెలిసే ఉంటుంది. వాళ్ళతో మాట్లాడదాం. ఈ లోపు నేను ఫ్రెష్ అయ్యి వస్తాను" అని వాడిని పంపాను.

సంజయ్ ఆశ్రమంలో అందరికన్నా పెద్దవాడు. బాధ్యతగా ఉంటాడు.

★ ★ ★ ★ ★

ఆశ్రమంలోని పిల్లలందరూ నన్ను అమ్మ అని పిలుస్తారు. ఆశ్రమానికి వచ్చిన మొదటి పిల్లవాడు అమ్మ అని పిలిచేవాడు. చనిపోయిన వాడి అమ్మ పేరు కూడా నా పేరేనని కనెక్ట్ అయ్యాడు.. అందరికీ అలానే అలవాటు అయ్యింది. కొందరు పిల్లలు నాతో చాలా చనువుగా, ఇష్టంగా, అరమరికలు లేకుండా ఉంటారు. ఇదే తమ ఇల్లనుకుంటారు. కొద్దిమంది, ఇళ్ళు అంటే తెలియనివారు ఇంకొకరితో పంచుకోవటం తెలియని పిల్లలు నన్ను రాక్షసిలా చూస్తారు. ఇక్కడ బందీగా ఉన్నామని భావిస్తారు.

అనాథలని అనవచ్చో లేదో, సమాజంలో నిరాశ్రయులు అయిన పిల్లల కోసం ఆశ్రమం పెట్టాలన్న ఆలోచనను దగ్గరవాళ్ళతో పంచుకున్నప్పుడు, పిచ్చిపని చేస్తున్నానని ఎగతాళి చేశారు. ఇది చాలా రిస్కు అనీ, సమాజ సేవ చేయాలంటే చాలా మార్గాలు ఉన్నాయని సలహా కూడా ఇచ్చారు. అయినా నా ఆలోచనలో మార్పు రాలేదు.

ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రం – నేను తప్పు చేస్తున్నానా అనే సందేహం వస్తూంటుంది.

ఆశ్రమంలో ఉండే పిల్లలంటే చాలామందికి చులకన. కానీ వాళ్ళు మట్టిలో మాణిక్యాలు. వాళ్ళ దగ్గర చాలా టాలెంట్ ఉంటుంది. వాళ్ళలోని శక్తిని బయటకు తీయటానికి కొంచెం ఓపిక పట్టాలి, అంతే.

పోయిన పిల్లల గురించి ఆలోచనలు వదలట్లేదు. ఎక్కడకి వెళ్ళుంటారో.... వాళ్ళు ఎక్కడికి పోయినా క్షేమంగా ఉంటే అంతే చాలు. వాళ్ళకి ఏదేని హాని జరిగితే....

ఈ ఆలోచన రాగానే వణికిపోయాను. ముందు పిల్లలేమయ్యారో బెంగకన్నా పరిస్థితులు ఎంత గందరగోళంగా ఉంటాయో వూహించుకుంటేనే భయమేస్తూంది.

★ ★ ★ ★ ★

ఆశ్రమానికి వెళ్లిన నన్ను పిల్లలు ఒరకంటితో గమనిస్తున్నారు. రోజూ నేను వెళ్ళగానే నా చుట్టూ చేరుతారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అందరూ గుంభనంగా ఎవరి పనుల్లో వాళ్ళు ఉంటుంటారు.

నేను సీరియస్‌గా, అసహనంగా వెళ్లి కుర్చీలో కూర్చున్నాను. అందరికన్నా చిన్నోడు ఆరేళ్ల నాని నా దగ్గరకు వచ్చి తల వంచమని సైగ చేసాడు. వాడి చేష్టలకి నేను మామూలు మూడ్‌లోకి వచ్చి తల కిందికి దించాను. నా చెవి దగ్గరకు వచ్చి నోటికి ఒక పక్కగా చేయి అడ్డంపెట్టుకొని చిన్నగా, "అమ్మా, అమ్మా, నీకు

తెలుసా?. రాత్రి అశోక్ అన్న, పవన్ అన్న పారిపోయారు. వాళ్ళను పోలీసులకు పట్టించి, జైలులో వేయిద్దామా?" అని కిసుక్కున నవ్వి బయటకు పరుగు తీశాడు.

వాడి మాటలకు నవ్వు వచ్చింది. ఎలాగూ చేయవలసింది అదే. పిల్లలు విషయాలను త్వరగా గ్రహిస్తారు.

పిల్లలందరూ స్కూళ్లకు వెళ్ళగానే, పారిపోయినవాళ్ళ ఆధార్ కార్డులు తీసుకొని పోలీస్‌స్టేషన్‌కి బయలుదేరాను గానీ, మనస్సులో పోలీసులు అడిగే సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పటం ఎంత కష్టమో అనుభవము ఉన్న నాకు గుండె బరువెక్కినట్లు ఫీల్ అయ్యాను.

స్టేషన్‌లోకి అడుగు పెట్టాలంటే బాధగానే ఉంటుంది. సాధారణంగా ఇలాంటప్పుడు పోలీసులు మేమే తప్పు చేసినట్లు చూస్తారు. మూడు గంటలు వెయిట్ చేసిన తరువాత ఎస్.ఐ గారి పిలుపు వచ్చింది. ఉదయం కాఫీ మాత్రమే తాగాను. నీరసంగా ఉంది.

ఆయన చాలా హడావిడిగా ఉన్నారు.

నా గురించి పరిచయం చేసుకొని జరిగిన విషయం చెప్పాను.

అసలే కుర్రాడు. ఎన్ని ప్రశ్నలు వేస్తాడోనని భయం, సందేహం. నా కొడుకు వయసు ఉండొచ్చు. ఆ అబ్బాయి ముందు నేను తల వంచుకొని నిలబడటం బాధగా అనిపించింది. అయినా తప్పదు కదా. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు ఏరుకోవటం ఎందుకు?.

ఆయనకు ఫోన్లు వస్తూనే ఉన్నాయి. వాటికి ఆన్సర్ చేస్తూ ఏమి జరిగింది అని నన్ను అడుగుతున్నారు.

చెప్పిందంతా విని,

"ప్రస్తుతానికి ఒక పని చేయండి. జరిగిన విషయం పేపర్ మీద రాసి ఇవ్వండి. ఇద్దరికి ఎవ్వరూ లేరన్నారు కదా ఎక్కడికి వెళతారు. రెండు రోజులు గడిస్తే వాళ్ళే తిరిగి రావచ్చు. అప్పటికి రాకపోతే ఎఫ్.ఐ.ఆర్ బుక్ చేద్దాము" అని నాలుగు ముక్కలు చెప్పి గబగబా వెళ్ళిపోయారు.

హమ్మయ్య, బ్రతుకు జీవుడా, ప్రశ్నల పరంపర లేకుండా బయట పడ్డాను. వాళ్లకు సమాచారం ఇచ్చాను. భారాన్ని పంచుకున్న ట్లయింది. తిరుగు ముఖం పట్టాను.

ఆశ్రమానికి వచ్చేటప్పటికి సాయంత్రం నాలుగు దాటింది. ఆశ్రమంలో పనులన్నీ బాధ్యతగా చూసే రాములమ్మ కాఫీ తెచ్చి చేతికి ఇవ్వగానే ప్రాణం లేచి వచ్చింది.

"ఎందుకమ్మా టెన్షన్ పడతావు. నువ్వు వాళ్ళను సొంత పిల్లలు లెక్క చూస్తున్నావు. వాళ్ళు అలా అనుకోవటంలేదు. కడుపున పుట్టినవాళ్ళే సరిగా లేరు. వీళ్ళు మంచిగా ఉంటారని అనుకోవటం పొరపాటు" అంటూ ఖాళీ కప్పు తీసుకుని వెళ్ళింది.

★ ★ ★ ★ ★

అప్పుడే రెండు రోజులు గడిచిపోయాయి. వాళ్ళింకా ఆశ్రమానికి రాలేదు. ఆలోచనలతో చాలా నీరసంగా ఉంది. నాలుగు మెతుకులు కడుపులో పడితేగానీ మామూలు మనిషిని కాలేననిపించి కంచంలో అన్నం పెట్టుకొని, నోట్లో ముద్ద పెట్టుకుంటుంటే పవన్ గుర్తుకు వచ్చాడు.

వాడు ఆకలికి ఉండలేడు. తెల్లవారే టప్పటికి ఏదో ఒకటి నోట్లో పడాలి. రాత్రిపూటే ఏదో ఒకటి తినటానికి తీసి పెట్టుకుంటాడు. నేను చూసేటప్పుడు బ్రష్ చేసుకుని తింటాడు. లేకపోతే పాచి నోటితోనే తింటాడని తోటి పిల్లలు వాడి మీద కంప్లైంట్.

చాలా అమాయకుడు, భయస్తుడు. వాడికి తమ్ముడు కూడా ఉన్నాడు. వాడి పేరు ప్రసాద్. ఇద్దరు ఒకరిని ఒకరు వదిలి ఉండలేరు. ఇరవై నాలుగు గంటలు టామ్ అండ్ జెర్రీ లా కొట్టుకుంటారు. చిన్నోడు చాలా అసాధ్యుడు. పెద్దోడిని చితక కొడతాడు. వాడు ఎంత కొట్టినా పెద్దోడు వాడిని వదిలి ఒక్క క్షణం ఉండడు. అలాంటిది వొదిలి ఎలా వెళ్ళాడో….

వాళ్ళ అమ్మ, నాన్న చిత్తు కాగితాలు ఏరుకుంటూ ఇల్లు వాకిలి లేకుండా సంచార జీవితం గడుపుతూ ఉండేవారంట. వాళ్లకు ఉన్న ఏకైక అస్తి చెక్క బండి. నాన్న వేరే ఆమెతో వెళ్ళిపోయాక వాళ్ళ అమ్మ పిల్లలను తీసుకుని తల్లి దగ్గరకు చేరింది. వాళ్ళ అమ్మమ్మ తండాలో ఉంటుంది. అక్కడ పది ఇండ్లే ఉండేవి. మూడో కాన్పు కాలేక చచ్చిపోయింది. చేసేదిలేక వీళ్లిద్దరిని అమ్మమ్మే చూసుకుంటూ ఉండేది.

అమ్మమ్మకు కూడా రెండు కళ్ళు సరిగా కనబడటం లేదు. పనులకు వెళ్ళలేక పోతుండటంతో పిల్లలిద్దరికి తిండి పెట్టడం ఆమెకు కష్టమైపోయింది. ఇద్దరినీ పెంచలేక అవస్థ పడుతుంటే ఎవరో ఇచ్చిన సలహాతో చిన్నోడిని యాభై వేలకు అమ్మింది.

ప్రసాద్ తీసుకెళ్లినవాళ్ళ దగ్గరుండలేక పోయాడు. వాళ్ళు వీడిని భరించలేక వెనక్కి ఇచ్చేశారు.

ముసలావిడ ఆ డబ్బులను, పిల్లలని వాళ్ళ బాబాయి చేతుల్లో పెట్టింది.

అతను నాలుగు రోజులు ఇంట్లో పెట్టుకున్నాడు. అతనికీ కష్టమే. ఒకడి జీతం, తన పిల్లలూ ఈ పిల్లలు కలసి అయిదుగురయ్యారు. పనుల్లో పెట్టే వయసూ కాదు.

బాబాయి కూడా వాళ్ళని వదిలించు కోవాలనుకున్నాడు. ఇద్దరినీ ఆ ఊరి రైల్వేస్టేషన్లో వదిలేసి వచ్చాడు.

రెండు రోజులు వాళ్లకు ఏమీ అర్థం కాలేదంట. ఆకలి…. తిండి కావాలి. ఏమి చెయ్యాలో తెలియక కనబడినవాళ్ళను అడిగి కడుపు నింపుకున్నారంట.

వారం రోజుల తరువాత స్టేషన్లో ఎస్.ఐ ఇద్దరినీ చూసాడు. ఇద్దరు ఒకరి చేతులు ఒకరు పట్టుకొని అటూఇటూ తిరుగుతున్నారు. చేతిలో ప్లాస్టిక్ కవరు, దానిలో మిగిలిన అన్నం.

వాళ్ల గురించి ఏమి అడిగినా ఏమి చెప్పలేకపోతున్నారు. ఎస్. ఐ. జాలిపడి వాళ్ళను ఇంటికి తీసుకొని వెళ్ళాడు. వాళ్ళని వీళ్ళని కనుక్కొని, ఇక్కడకు తీసుకువచ్చారు.

వచ్చిన మరుసటిరోజు ఉదయాన్నే ఇద్దరూ కనబడలేదు. వెతకటానికి రోడ్డు ఎక్కాము. వీధిలో టిఫిన్ బండిదగ్గర చేతిలో కవరు పట్టుకొని నిలబడి ఉన్నారు.

వాళ్ళు బయటకు వెళ్ళకుండా చాలా రోజులు కాపలా కాయవలసి వచ్చింది. చేతిలో కవరు లేకుండా ఉండేవాళ్ళు కాదు. కవరు తీస్తే, అది ఇచ్చిందాక గోల చేసేవాళ్ళు.

ప్రసాద్ సాయంత్రం అయితే గుక్క తిప్పుకోకుండా ఏడ్చేవాడు. కొత్తలో తెలియలేదు.

ఒకసారి భుజాన వేసుకొని అటుఇటు తిప్పితే ఏడుపు ఆపి నిద్రపోయాడు. అప్పుడు తెలిసింది వాడికి అమ్మ స్పర్శ కావాలి అని.

అలా ఆరు నెలలు వాడిని భుజం మీద వేసుకొని నిద్ర పుచ్చాము.

పవన్‌కు ఎప్పుడూ ఆరోగ్యం బాగుండదు. రెండు ఏళ్ళు వాడిని హాస్పిటల్ చుట్టూ తిప్పితే గానీ నయం కాలేదు.

వాళ్ళు ఇక్కడ అలవాటు పడటానికి రెండేళ్ళు పైనే పట్టింది.

పడుకున్నానే గానీ కళ్ళు మూతలు పడటంలేదు. చలి కాలం, బాగా మంచు కురుస్తుంది. ఒంటిమీదున్న బట్టలతోనే వెళ్ళారు. కప్పుకోవటానికి దుప్పట్లు కూడా లేవు. ఎలా ఉన్నారో ఏమో.....

★ ★ ★ ★ ★

యథాప్రకారం ఆశ్రమానికి వెళ్ళాను. అందరి అటెండెన్స్ తీసుకొన్నాను.

బయట గేటు శబ్ధం వచ్చినప్పుడల్లా వాళ్ళేమోనని చూస్తున్నాను.

ఎర్రబడిన కళ్ళతో దిగులుగా గంగ నా దగ్గరకు వచ్చింది.. ఆ అమ్మాయి ఎందుకు వచ్చిందో నాకు తెలుసు. గంగ అశోక్ చెల్లెలు. వాడంటే దానికి చాలా ఇష్టం. వాడికి ఈ అమ్మాయంటేనే ఇష్టం ఉండదు. వాడికి చెల్లెలు ఉందన్న ధ్యాసే ఉండదు.

అశోక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సరిగా చదవడు. వాడి కళ్ళు అందరి కళ్ళలాగా ఉండవు. నిప్పులు కక్కుతున్నట్లు ఉంటాయి. అడిగినదానికి సమాధానం చెప్పటానికి పది నిమిషాల టైము తీసుకుంటాడు. వాడు నవ్వటం నేను ఇంతవరకు చూడలేదు. క్రాఫ్ చేయించుకోవటం, చేతి గోళ్ళు తీసుకోవటం ఇష్టం ఉండదు. నోరు తెరిస్తే పచ్చి బూతులు. చేరి మూడేళ్ళవుతున్నా వాడిలో ఎంత మార్పు వచ్చిందో అర్థంగావటంలేదు.

ఫ్లైఓవర్ కింద ఉంటూ అశోక్ తల్లిదండ్రులు అడుక్కునేవారంట. వాడికి నాలుగు ఏళ్లప్పుడు తల్లి చనిపోయింది. తండ్రి వేరే ఆమెతో ఉంటున్నాడు. వాళ్లకు ఒక అబ్బాయి పుట్టాడు. ఇద్దరూ ఇరవై నాలుగు గంటలు మందు కొడతారు. ఎవరి బ్రతుకులు వాళ్ళవే. అయినా ఈ పిల్లలు వాళ్లకు భారం అనుకున్నారు.

మందుకు, మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డ తల్లిదండ్రులు – ఈ ఇద్దరి పిల్లల్ని భారంగా భావించి గంజాయి తాపించి – మగతలో వున్న ఇద్దరినీ చెరొక గోనె సంచిలో మూట కట్టి రైల్ సీట్ కింద వదిలేశారు.

వాళ్లకు ఎప్పుడో మెలుకువ వచ్చి అటూ ఇటూ కదులుతుంటే తోటి పాసింజర్లు చూసి పోలీసులకు తెలియ పరిచారు. అలా వాళ్ళు ఇక్కడకు చేరారు.

అశోక్ చాలా మొండిగా, లెక్కలేనితనంగా ఉంటాడు. ఎవర్నీ గౌరవించడు, లెక్కచేయడు. వాడికసలు ప్రేమ, ఆప్యాయతలు తెలియవేమో అన్పిస్తుంది.

ఆలోచనల్లో వున్న నన్ను "మా అన్న వస్తాడా" అని గంగ నన్ను అడిగింది. ఏమి చెప్పాలి? "వస్తాడమ్మా, తప్పకుండా".... అన్నాను.

★ ★ ★ ★ ★

మూడవరోజు సాయంత్రం ఆరు గంటలకు ఇద్దరు బయట కూర్చొని ఉన్నారు. నాకు కనబడకుండ నక్కి నక్కి చూస్తున్నారు. నేను పిల్లలం కలిసి తోటపనిలో ఉన్నాము. నేను చూసి చూడనట్లు నటించాను. నా పని అయిపోయి ఆఫీసు రూంలో కూర్చున్నాను.

పీక్కుపోయిన ముఖాలతో ఎదురుగా నిలబడ్డారు.

అశోక్ తల వంచుకుని నేల చూపులు చూస్తున్నాడు.

పవన్ జేబులో నుండి ఫోను తీసి నా టేబుల్ మీద పెట్టి

"అమ్మా, సారీ ఇక ఎప్పుడు తప్పు చేయను" అని అన్నాడు.

అశోక్ ముఖంలో ఏ ఫీలింగ్స్ లేవు.

పవన్ వైపు చూసాను.

"నాకు ఏమి తెలియదు. వాడే అంతా చేశాడు. నేను వాడితో రానని చెప్పినా ఏమి కాదు అని లాక్కుపోయాడు"

అశోక్ గంభీరంగా, "అన్ని అబద్ధాలే వాడే నా వెంటపడి వచ్చాడు" అని ఎప్పటిలానే ఏ భావం లేకుండా చెప్పాడు.

వాడి సమాధానానికి కోపం వచ్చింది.

ఇద్దరినీ వెళ్ళి ఫ్రెష్ అయి, ఏమైనా తినేసి రమ్మన్నాను.

వెనుదిరుగుతూ నావైపే చూస్తున్న పవన్‌ను పిలిచి "జరిగిన విషయం చెప్పరా" అని అడిగాను.

"వారం కిందట అశోక్ నాతో బయటకు వెళదామని అడిగాడు. రానని చెప్పాను. నీకు ఫోనంటే ఇష్టం కదా ఇప్పిస్తానని" చెప్పాడు.

"రాత్రి పది గంటలకు ఇద్దరం గేటు దూకి రిమ్స్ హాస్పిటల్‌కు వెళ్ళాము. అక్కడ ఛార్జింగ్ పెట్టుకొని చాలామంది నిద్రపోతున్నారు. అక్కడ కొట్టేసాము."

మీకు ఫోనుతో అవసరం ఏంటిరా, నాకు చెప్పొచ్చుగా" అన్నాను.

"మా స్కూలులో చాలామంది ఫోన్లు తెచ్చుకుంటారు. బ్రేక్‌లో ఏవేవో చూస్తారు. వాళ్ళలాగా నాకు చూడాలని ఉంది."

"నువ్వు చదివేది కేంద్రీయవిద్యాలయంలో అక్కడ ఫోన్లు తెస్తే ఒప్పుకోరు కదా. మీ టీచర్లు ఏమి చేస్తున్నారు వాళ్ళకు తెలియదా" అంటే

"టీచర్లకు తెలుసు. ఎందుకు తెచ్చారు" అని అడుగుతారు.

"టీచర్ నిన్న మీరు వాట్సప్‌లో పెట్టిన హోమ్ వర్కు చేయటానికి తెచ్చాము" అని చెబుతాము.. అప్పుడు ఏమి అనరు, "ఓకే ఓకే గుడ్ త్వరగా వర్క్ చేయండి" అని అంటారు.

కిటికీలో నుండి బయటకి చూస్తుంటే అశోక్ కనపడ్డాడు. వాడు 'పుష్ప' సినిమా హీరో మేనరిజమ్స్ చేసి పక్క పిల్లలకు చూపిస్తున్నాడు. పవన్‌ను బయటకు పంపి అశోక్‌ని పిలిచాను.

నన్ను ఎందుకు పిలిచారు అన్నట్లున్నాయి వాడి చూపులు.

"ఫోన్లు ఎక్కడ నుండి వచ్చాయి" అని అడిగా,

"పవన్ గాడు చెప్పాడు కదా" అని నాకే ఎదురు ప్రశ్న.

"మాకు సినిమాలు చూపిస్తున్నారా?" అని అడిగాడు.

"మంచి సినిమాలు వారం వారం చూస్తున్నారు" కదా

"మాకు నచ్చినవి వేస్తున్నారా?. మా స్కూలులో కొత్త సినిమా వస్తే మొదటిరోజు మొదటి ఆట చూసి అందరూ కలిసి సినిమా ముచ్చట్లు చెప్పుకుంటారు. నేను వాళ్ళ మధ్యలో ఏమి మాట్లాడలేను. వాళ్ళు నన్ను "నువ్వు అనాథ ఆశ్రమంలో కదా ఉండేది, మిమ్మల్ని సినిమాలకి పంపరు కదా అని ఎగతాళి చేస్తారు. ఇక్కడ ఎలాగూ సినిమాలకు పంపరు. ఫోను ఉంటే దాంట్లో చూడొచ్చు."

వాడు చదివేది ప్రభుత్వ బడిలో. అక్కడ కూడా ఈ జాడ్యం ఉందా అని అనిపించింది. "అయితే దొంగతనం చేస్తావా?" అంటే, ఉలుకు పలుకు లేదు. నాకు ఇంక ఏమి అడగాలో అర్థం కాలేదు.

"సరే వెళ్లి ముందు అన్నం తిని పడుకోండి రేపు మాట్లాడతాను" అని చెప్పి పంపాను.

వాళ్లిద్దరూ చేసిన పనిలో తప్పొప్పులను ఎలా నిర్ణయించాలి? ఫోన్‌లు సమాచారం కోసమేగాక ఆటవిడుపులుగా, పెద్దవాళ్ళ ఆలోచనలనే నియంత్రిస్తూన్న సందర్భంలో ఏది తప్పు, ఏది ఒప్పు. అనాథ ఆశ్రమాలంటేనే ఒక చులకన, చిన్నచూపు. కానీ అందర్నీ అనాథులుగా మారుస్తున్న సామాజిక పరిస్థితులను ఎవరూ పట్టించుకోరు. పిల్లల్ని ఇలాంటి అరాచక సంస్కృతికి బలిచేస్తూన్న పరిస్థితులు ఎన్నటికి మారుతాయో.... ఎందుకు చేశారో నిజాయితీగా చెప్పారు కదా అనుకున్నాను.

★ ★ ★ ★ ★

తెల్లవారి ఆశ్రమానికి వెళ్ళేటప్పటికి ఆఫీసులో ఇద్దరు కొత్త వ్యక్తులు నా కోసం ఎదురు చూస్తున్నారు.

నన్ను చూసి నిలబడి నమస్కారం చేశారు.

'నా పేరు రాము మేడం, ఈమె నా భార్య' అని పరిచయం చేశాడు.

ఆమెను చూస్తే చాలా దిగులుగా ఉన్నట్లు అనిపించింది.

'మాది రాజస్థాన్ మేడం. ఇక్కడ గ్రానైట్ పనికి వచ్చాను. మాకు పెళ్లయిన పదేళ్లకు పిల్లాడు పుట్టాడు. ఆమెకు ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదు. గర్భ సంచి తీసేశారు. వాడికి లివర్ జబ్బు చేస్తే ఇక్కడే రిమ్స్ హాస్పిటల్లో చేర్చాను. బాగానే ఉంది పరవాలేదు అనుకుంటే ఉన్నట్లుండి అర్ధరాత్రి ఫిట్స్ వచ్చాయి. డాక్టర్లు మందులు బయట తీసుకుని రమ్మన్నారు.

'మందులు కొనటానికి ఫోను కోసం చూస్తే కనబడలేదు. అంతటా వెతికాను. ఎవడో కొట్టేశాడు. ఇప్పుడు అన్నీ ఫోన్లలోనే కదా నడిచేది. చేతిలో ఖర్చులకని కొంచెం ఉంచుకున్నాను. అయితే అవి సరిపోలా అప్పటికప్పుడు మా వాళ్ళని అడగాలన్నా వాళ్ళ ఫోను నంబర్లు కూడా లేవు. ఎవరిని అడిగితే ఎవరు ఇస్తారు. మా వాళ్ళ దగ్గరికి పరిగెత్తాను.

'నేను వచ్చేటప్పటికి పిల్లగాడు ప్రాణాలతో లేడు. ఎలాగూ వాడిని బతికించుకోలేకపోయాను. వాడి పేరు మీద ఇలాంటి పిల్లలకు ఒక పూట అన్నం పెడితే వాడి ఆత్మ శాంతిస్తుందని వచ్చాను'.

వాళ్ళు చెబుతున్నది వింటుంటే భయం వేసింది. చిన్నగా తేరుకొని, నా మనస్సులో వీళ్ళు దొంగతనం చేసిన ఫోను ఇతనిదే అయ్యుంటుందేమోనని అనుమానం కూడా వచ్చింది.

"మీరు ఏ కంపెనీ ఫోన్ వాడుతున్నారో తెలుసుకోవచ్చా" అన్నాను. సంబంధంలేని ప్రశ్న వేసినట్టుగా వాళ్ళు నావైపొకసారి చూశారు.

"ఏ కంపెనీ అయితేనేం మేడం. ఈ ఫోన్లే లేకపోతే, నలుగురం కలసి హాస్పిటల్‌కి వెళ్ళేవాళ్ళం. ఒకరికొకరు తోడుగా ఉండేవారం. ఫోన్లు ఏం మంచి చేస్తున్నాయో, ఎవరికి మంచి చేస్తున్నాయో తెలియదుగానీ, నా బిడ్డ ప్రాణం పోయింది. నా బిడ్డ ప్రాణాన్ని నిలిపే ప్రభుత్వ ఆసుపత్రులూ లేకపోయినాయ్" అంటూ దుఃఖాన్ని అదిమి పెడుతూ "కంపెనీ వాళ్ళు జీతాలు ఆన్లైన్‌లో వేస్తామని అంటే సెకండ్ హ్యాండ్లో రియల్ మి కంపెనీ ఫోను కొన్నాను మేడం" అని చెప్పారు.

అతను వెళ్ళగానే నేను ఆతృతతో వణుకుతున్న చేతులతో బీరువాలోని ఫోన్లు తీసి చూస్తే వాళ్ళు కొట్టేసిన రెండు ఫోన్లలో ఒకటి రియల్ మి ఉంది. అది అవునో కాదో తెలియదు గానీ ఘోరం జరిగిపోయింది. సమాజంలో వ్యాప్తి అవుతున్న విషసాంస్కృతిక విధానాలలో మనుషులు పావులయ్యారు. ఉన్మాద సంస్కృతి యధేచ్ఛగా విస్తరిస్తూంది. మనుషులు శవాలవుతున్నారు.

ఎంత సమాజసేవ చేసినా అందవలసిన వాళ్ళకి అందటంలేదు. మనుషుల్లో మానవత్వాన్ని నెలకొల్పాలి. అందరికీ వైద్యం అందాలి. అసమానతలు ఉండకూడదు. అటువంటి మార్పుకోసం పని మొదలెట్టాల్సిందేననే నిర్ణయానికి వచ్చాను. ✣

## విజయవాడలో నాల్గవ చిత్రకళా సంత

**'అందరికీ చిత్రకళ'** అనే నినాదంతో కర్నాటక చిత్రకళా పరిషత్తు ఈ చిత్రకళా సంతను 22 ఏళ్ళ క్రితం ప్రారంభించింది. ఈ సంత బెంగళూరులోని పరిషత్తు ప్రాంగణంలోనూ, కుమార కృపా రోడ్డులోనూ నిర్వహిస్తుంటారు. ఈ సంత జరిగే రోజుల్లో ఆ రోడ్డును ప్రయాణీకులకు మూసివేస్తారు.

విజయవాడలో మొదటి చిత్రకళా సంతను ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య 2015 ఫిబ్రవరిలో లయోల కళాశాల ప్రాంగణంలో నిర్వహించింది. ఆ తర్వాత 2016, 2018లలో కూడా అక్కడే నిర్వహించారు. ఈ డిసెంబర్ 14వ తేదీన నాల్గవ సంత విజయవాడలోని టి.టి.డి. కళ్యాణ మండపం రోడ్డులో నిర్వహిస్తున్నారు. ఆ రోజు సాధారణ ప్రయాణికులను ఈ రోడ్డులో అనుమతించరు.

బెంగళూరులో లాగానే, విజయవాడలో కూడా చిత్రకళా ప్రదర్శనకు ఒక వీధిని కేటాయించడం ఆనందదాయకం. ✣

వ్యాసం

కాళోజీ 23వ వర్ధంతి (నవంబరు 13)సందర్భంగా :

# కాళోజీ విశిష్ట వ్యక్తిత్వం

ఐ.టీ.ఆర్.వి. శివాజీరావు

**పుటుక నీది,** చావు నీది
బతుకంతా, దేశానిది

అని జయప్రకాశ్ నారాయణ గురించి కాళోజీ రాసాడు. అయితే పై మాటలు సరిగ్గా కాళోజీకి కూడా వర్తిస్తాయి.

కాళోజీ జీవితాన్ని ఎటువంటి శషభిషలు లేకుండా గడిపాడు. జీవితంలో ఎటువంటి ఒడిదుడుకులెదురైనా, అతను వాటి సోయి లేకుండానే బ్రతికాడు. హంసతూలికాతల్పాల మీద నిద్రించిన సుఖానికి మైమరచిపోనూలేదు, కటిక నేలమీద పండినా ఆ కాఠిన్యానికి బెదరిపోనూ లేదు. జీవితంలో కష్ట సుఖాలను ఒకేలా తీసుకున్నాడు. అందుకే ఒకచోట 'ఊహించని ఎత్తులకు ఎగబ్రాకాను, అఖాత లోతులకు దిగజారాను' అనే అర్థంలో రాసుకున్నాడు.

కాళోజీ ఏ చట్రంలోనూ ఇమడని, ఒక సిద్ధాంతానికి కట్టుబడని ప్రజాపక్షపాతి. ఆయన కాంగ్రెస్‌వాదిగా ఉన్నా అవసరమైన చోట సిద్ధాంత రాద్ధాంతాలేమీ లేకుండానే బాధితులతో మమేకం అయ్యాడు, వారి పోరాటాలకు మద్దతు తెలిపాడు. అవతలివాళ్ళు ఆర్య సామాజికులైనా, న్యాయం వాళ్ళ పక్షాన ఉన్నదని అనిపిస్తే వాళ్ళు చేసే పోరాటాలకు మద్దతు తెలుపుతాడు. బాధితులు ముస్లింలయితే, వాళ్ళ పక్షాన కూర్చుంటాడు. నక్సలైట్‌లు బూటకపు ఎన్కౌంటర్‌లో చనిపోతే, మానవ హక్కుల సంఘాల తరపున నిలబడి, రాజ్యాన్ని తీవ్రంగా ఖండిస్తాడు. ఒకే సిద్ధాంతానికి కట్టుబడి ఉండడాన్ని 'పార్టీవ్రత్యం' అని హేళన చేశాడు.

అయితే వట్టికోట ఆళ్వారుస్వామిని, కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైనప్పటికీ, బాగా ఇష్టపడ్డాడు. వట్టికోట కాళోజీ 'నా గొడవ' పుస్తకాన్ని తన దేశోద్ధారక గ్రంథమాల తరుపున మొదటగా అచ్చేశాడు. వట్టికోటలో కాళోజీకి నచ్చిన విషయం ఏమంటే ఆయన కమ్యూనిస్టు అయినప్పటికీ పార్టీవ్రత్యం పాటించడు, మడికట్టుకు కూర్చోడు. అదేవిధంగా పార్టీపనిని ఎంతో శ్రద్ధతో చేస్తాడు. ఆయనలో కాళోజీకి నచ్చిన మరో ముఖ్యవిషయం ఏమిటంటే పార్టీ కార్యక్రమాల్లో అతని భార్యను కూడా ఇన్వాల్వ్ చెయ్యడం. తనకు తెలిసిన వారెవరూ, తనతో సహా ఈ పని చెయ్యలేదని స్వీయ విమర్శ చేసుకున్నాడు. అయితే దీనికి వివరణ కూడా ఆయనే ఇచ్చాడు. తనకే సంపాదన లేక తన అన్నగారి మీద ఆధారపడి ఉండడం వల్ల భార్యని కూడా తన వెంట కార్యక్రమాలకు తీసుకుపోతే అన్నయ్య ఏమైనా అనుకుంటాడని తీసుకు వెళ్లలేదన్నాడు.

కాళోజీ తెలంగాణావాదిగా అనిపిస్తాడు కానీ ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజలందరినీ ప్రేమించాడు. అయితే ఆంధ్రలోని శిష్టవర్గం తమ పలుకుబడిని, తమ వెనుకబాటుతనాన్ని విమర్శిస్తున్నప్పుడు మాత్రం ప్రత్యేక తెలంగాణా తప్పదేమో అంటాడు. అయితే కాళోజీ ఇప్పుడు వుంటే 'సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఎవని పాలయ్యిందో' అని వాపోయేవాడేమో! తెలంగాణా సమస్యకి విడిపోవడం పరిష్కారం కాదనీ చాలామంది తెలంగాణావాదులకు గత టీఆర్ఎస్ పరిపాలనలోనూ, నేటి కాంగ్రెస్ పరిపాలనలోనూ స్పష్టంగా అర్థమయ్యింది. దేశంలో ఎక్కడికక్కడ ఇలా చెలరేగే విభజన వాదాల మూలం నిజానికి ఆయా ప్రాంతాల వెనుకబాటుతనంతో ముడిపడి వుంటుంది. ఈ ప్రాంతీయ వెనుకబాటుతనానికి కారణాలు అక్కడ తిష్ట వేసుకొని కూర్చున్న భూస్వామ్య వ్యవస్థలోనూ ఆ భూస్వామ్య వ్యవస్థ ప్రాపకంతో అక్కడికి ప్రవేశించి ఇంత చోటు సంపాదించి అక్కడి ప్రజలను పీల్చిపిప్పిచేస్తోన పెట్టుబడిదారీ కార్పొరేట్ వ్యవస్థలోనూ ఉంటాయి. ఆ వ్యవస్థలను నిర్మూలించకుండా వెనుకబాటుతనాన్ని నిర్మూలించడం సాధ్యంకాదు.

కాళోజీ తన జీవిత చరిత్రను 'ఇదీ నా గొడవ' అనే మకుటంతో ప్రకటించాడు. ఆయన దాన్ని తన గొడవగా చెప్పుకున్నప్పటికీ అది ఆయన గొడవ కాదు, ఆయన అందులో చర్చించిందంతా ఆయన ఉన్నప్పటి హైదరాబాద్ సాంఘిక, రాజకీయ చరిత్ర. తను జీవించిన నాటి ప్రజల సుఖదుఃఖాలను ఆయన గమనించాడు. వాటిని తన గొడవగా రికార్డు చేశాడు.ఆ ప్రజల జీవితాలకు బాసటగా నిలబడే క్రమంలో వారికెదురొచ్చిన ఎవరితోనైనా ఘర్షణ పడ్డాడు. అది నిజాం పాలనలో దుర్మార్గులైన రజాకార్లు కావచ్చు లేక ప్రజలతో ఎన్నికైన ప్రభుత్వాలు కావచ్చు లేక గూండాలు, దొంగలు కావచ్చు. ఈ ఘర్షణలోనే కాళోజీ ఒక చారిత్రాత్మకమైన వ్యక్తిగా, సామాజికశక్తిగా, కవిగా, రచయితగా నిలిచిపోయాడు.

అతనిది ప్రధానంగా పెద్ద మనిషితత్త్వం. అతని సామాజిక జీవితమే అందుకు దోహదపడింది. ఆ పెద్ద మనిషిత్వంతోనే ఇటు

రజాకారు గూండాలను మొదలుకొని, పదవుల్లో ఉన్న ముఖ్యమంత్రులను, మంత్రులను, పోలీసు అధికారులను ఇంకెవరినైనా అదిలించగలిగే అధికారం, చనువు అతనికి సొంతమయ్యాయి. ఎవరూ కట్టబెట్టకుండా సాధించిన ఈ ధిషణతోనే బాధితులవైపు నిలబడి పాలకవర్గాలను అధికారులను గద్దించేవాడు. అతను వకీలాయే! అందులోనూ ప్రజాదరణ కలిగిన కవి, రచయిత కావడంతో పాలకవర్గాలకు అతని మాట వినక తప్పేది కాదు. దానితో బాధితులకు ఎంతో కొంత న్యాయం జరిగేది. ఈరోజు అటువంటి పెద్దమనుషుల లోటు కొట్టొచ్చినట్టు సమాజానికి కనబడుతున్నది. అందుకే ప్రజావ్యతిరేక శక్తులు అమాయకులమీదకి, నోరు లేనివాళ్ళ మీదకి తెగబడుతున్నాయి.

కాళోజీ అనేక పార్శ్వాలు ఉన్న మనిషి. ఆయన ఇటు ఆధ్యాత్మికవాది, అటు అభ్యుదయవాది కూడా! అందుకే విశ్వనాథ మొదలుకొని, శ్రీశ్రీ వరకూ అందరి రచయితలతో సంబంధ బాంధవ్యాలు నెరిపేవాడు. ఆయన చాలా నిర్మొహమాటి. ఎవరిలోనైనా ద్వంద్వ వైఖరి గమనిస్తే మొహమ్మీద కొట్టినట్టు అడగాల్సిందే! 'మీజాన్' పత్రికాసంపాదకుడిగా అడివి బాపిరాజు నిజాం అనుకూలంగా సంపాదకీయాలు రాస్తే ఆయన్ని కాళోజీ నిలదీశాడు. మరో సందర్భంలో తన 'ఆంధ్ర ప్రశస్తి'ని మల్లంపల్లి సోమశేఖర శర్మకు అంకితమిచ్చిన విశ్వనాథ పేరు తెచ్చుకునేందుకు చరిత్ర పరిశోధనలు మొదలెట్టాడని మల్లంపల్లిని విమర్శిస్తుంటే విశ్వనాథను "ఇదేమిటీ పద్ధతి" అని గట్టిగా అడిగితే విశ్వనాథ "మీకు అలా అర్థమైందా, అదేమీ లేదు" అని సర్దుకున్నాడు.

ఒకసారి నిజాం వ్యతిరేక ప్రచారంలో పాల్గొన్నందుకు కాళోజీని జైల్లో పెట్టారు. ఆ జైలు గదిలో ఒక దొంగతనం చేసి శిక్ష పడిన ఒకతను ఉన్నాడు. కాళోజీకి ఒక దొంగ ఉన్న గదిలో తనని కూడా పెట్టినందుకు చాలా అవమానం అనిపించిందట. ఆ దొంగ చాలా బీదగా చినిగిపోయిన బట్టలతో ఉన్నాడు. కాళోజీని ప్రశ్నలతో సతాయిస్తూ ఉన్నాడు. అతనికి రాజకీయాలు చెబితే రాజకీయ కారణాలు చెబితే ఏమర్థమవుతాయిలే అని కాళోజీ మిన్నకున్నాడట. చివరికి అతను "నైజాంకు గాంధీకి లడాయి అవుతుందట కదా! అందులో వచ్చినవా నువ్వు" అని అడిగేసరికి కాళోజీ ఆశ్చర్యంలో మునిగిపోయాడట. ప్రజలకు అతి దగ్గరగా ఉండాలి, వారిని మనం ఎడ్యుకేట్ చెయ్యాలి. వారి నుంచి వినాలి అన్న గాంధీ మాటను కాళోజీ తల్చుకున్నాడు. అతనితో జరిగిన ఈ సంభాషణ తనకు జరిగిన గర్వభంగం అని కాళోజీ చెబుతాడు.

మరో సందర్భంలో జైలు శిక్ష పడిన కాళోజీని జైలు గదిలో బంధిస్తారు. ఆ గదిలోకి నిజాంకు వ్యతిరేకంగా పోరాడే మంగళ సింగ్ అనే టెర్రరిస్ట్,కాళోజీకి దోసె పంపించి ఎంతో గౌరవంగా సంబోధిస్తూ ఒక చీటీ పంపించాడు. అతను పది సంవత్సరాల జైలు శిక్ష పడినవాడు. తనది కేవలం రెండు మూడు మాసాల జైలు శిక్ష లాంటిది. 10 సంవత్సరాలు జైలు శిక్ష పడిన మంగళ సింగ్ తనను గౌరవించడం కాళోజీకి ఆశ్చర్యం కలిగించింది. ఈ సందర్భంగా మంగళ సింగ్‌ది కూడా మార్గం వేరైనప్పటికీ లక్ష్యం ఒకటే అని అర్థం చేసుకున్నాననంటాడు.

ఒక నిర్మాణాన్ని, ఒక సిద్ధాంతాన్ని ఇష్టపడని కాళోజీ నిజానికి ఒక గొప్ప ఆర్గనైజర్. తను పాఠశాల చదివే వయసులోనే వినాయక చతుర్థికి ముస్లిం ప్రభువులు సెలవు ప్రకటించకపోవడంతో తన పాఠశాలలోని 1000 మంది విద్యార్థులతో మధ్యాహ్నానికల్లా సెలవు చీటీ రాయించి హెడ్మాస్టర్‌కి ఇప్పిస్తాడు. అదేవిధంగా సారస్వత సభలకు, రాజకీయ సభలకు జనాలని సమీకరించేవాడు.

రజాకార్ల దుర్మార్గాలను స్వయంగా చూసిన కాళోజీ ఒక దశలో హిందూ మహాసభ వైపు మొగ్గు చూపినట్టు కనబడుతుంది. 'నా గొడవ'లో అనేకసార్లు హిందూ మహాసభ ముస్లింలను ఎదుర్కోవడాన్ని సమర్థిస్తాడు కాళోజీ. ఆ సమయంలో తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని దగ్గరగా పరిశీలించినట్టుగానీ, మద్దతు ఇచ్చినట్టుగానీ కనిపించదు.

కాళోజీ ఒకే ఇంటికి పరిమితమైన వ్యక్తి కూడా కాదు. ఆయన విశ్వమానవుడు. ఉదయం ఒకరి ఇంట భోజనమైతే, మధ్యాహ్నం ఒక చోట,రాత్రి మరొక చోట. ఇలా అందరి ఇళ్ళు ఆయనవే. అందరూ తనవారే! ఆయనకు ఆస్తి లేదు, ఇల్లు లేదు. ఆయన బాగోగులు చూసుకునేది ఆయన అన్నగారే! అయితే తన భావజాలానికి వ్యతిరేకమైతే అన్నగారి మాటకూడా విననంటాడు కాళోజీ. ఆయన అన్నగారు కూడా కాళోజీని పసిపిల్లవాడిలానే చూసుకున్నారు. అంటే ఆయన విశ్వమానవ తత్త్వాన్ని పెదకాళోజీగారు పూర్తిగా అర్థంచేసుకొని అందుకు అనుగుణంగా మసులుకున్నారు. అందుకే కాళోజీ తన ప్రజా జీవితం అలా సాగడానికి అన్నగారే కారణమని అనేకసార్లు చెప్పేవాడు.

మాతృభాష మీద ముఖ్యంగా తెలుగు మీద ఆయన అనేక సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలను ఈ రోజు ఆంధ్రా, తెలంగాణ రెండు వేరు వేరు భాషలు అయినట్టుగా భాషావేర్పాటువాదాన్ని కొందరు ప్రకటిస్తున్నారు.

"అన్యభాషలు నేర్చిఆంధ్రంబు రాదనుచు
సకిలించు ఆంధ్రుడాచావవెందుకురా!"

అని మాతృభాషను చిన్న చూపు చూసే వాళ్ళను తీవ్రంగా గర్హిస్తాడు కాళోజీ. ఇందులో ఆయన తెలుగును 'ఆంధ్రము' అనే సంబోధించాడు. ఈ రోజు ఆంధ్రము అంటే మా భాష కాదు అని ప్రచారం చేస్తున్నారు కొందరు. కాళోజీ భాష గురించి చెప్పిన ప్రామాణికమైన వ్యాఖ్యలు పరిశీలిస్తే తెలుగుభాష అంతా ఒకటేనని తెలుస్తుంది.

కొందరు మాండలికాన్ని, యాసను కూడా ప్రత్యేకమైన భాషలుగా ప్రచారం చేస్తున్నారు. దీనిని బట్టి గతంలో ఉన్న ఉమ్మడి రాష్ట్రంలోనే కొన్ని వందల తెలుగులు ఉండాలి. వీరి ప్రకారం రాయలసీమ తెలుగు వేరు, ఉత్తరాంధ్ర తెలుగు వేరు, తెలంగాణ తెలుగు వేరు. అలాగే గుంటూరు, కృష్ణా జిల్లాల తెలుగు వేరు అనుకుంటే మరి వీటన్నిటికీ

అక్షరమాల, వ్యాకరణం, వాక్యనిర్మాణ పద్ధతులు వేరే వేరే వున్నాయేమో!

ఏ విధంగా ఏ రూపంలో ఆధిపత్యం, పెత్తందారీతనం ఉన్నా దాన్ని తీవ్రంగా నిరసించాడు కాళోజీ. ఆయన ఒకసారి వరంగల్ శాసనసభకు ఎన్నికయ్యాడు. అయినప్పటికీ ఆయన ప్రజాకవి, ఉద్యమకారుడు, తెలంగాణ స్వరంగా నిలిచిన పోరాటయోధుడిగానే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడు. కాళోజీ జీవితం అనేది ఒక వ్యక్తి జీవితం మాత్రమే కాదు, ఒక యుగానికి ప్రతిబింబం. ఆయన కవిత్వం, ఆయన గొడవలు, ఆయన భాషా ప్రేమ, ఆయన సామాజికతత్త్వం అన్నీ కలిపి ఒకే సందేశాన్ని ఇస్తాయి :

ప్రజల కోసం బ్రతకడం, వారి పక్షాన నిలబడడం, న్యాయం కోసం గళమెత్తడం.

అందుకే కాళోజీ ఒక "వ్యక్తి" కాదు, ఒక ప్రజాశక్తి. ఆయన గళం తెలంగాణలో పుట్టినా, ఆయన భావజాలం తెలుగునాటా, భారతదేశంలోనూ, విశ్వమంతటా ప్రతిధ్వనిస్తూ వుంటుంది. ✥

పాట

# మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు!

– ప్రజాకవి అందెశ్రీ

మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
యాడ వున్నడో కాని కంటికీ కనరాడు ॥ మాయ ॥

నిలువెత్తు స్వార్థము నీడలాగొస్తుంటే
చెడిపోక ఏమైతడమ్మ - చెడిపోక ఏమైతడమ్మ
ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల
దిగ జారుతున్నడోయమ్మా - దిగ జారుతున్నడోయమ్మా
అవినీతి పెను ఆశ అంధకారంలోనే
అవినీతి పెను ఆశ అంధకారంలోనే
చిక్కిపోయి రోజు శిధిలమౌతున్నడు ॥ మాయ ॥

ఇనుప రెక్కల డేగ విసిరినా పంజాకు
కోడి పిల్లె చిక్కి కొట్టుకుంటున్నాడు
కోడి పిల్లె చిక్కి కొట్టుకుంటున్నాడు
ఉట్టికి స్వర్గానికి అందకుండా తుదకు
అస్థిపంజరమయ్యి అగుపించనున్నాడు
అస్థిపంజరమయ్యి అగుపించనున్నాడు
కదిలే విశ్వము తన కనుసన్నలో నడుమ
కదిలే విశ్వము తన కనుసన్నలో నడుమ
కనుబొమ్మలెగరేసి కాలగమనము లోన ॥ మాయ ॥

కుక్కలా నక్కలా దైవ రూపాలుగా కొలిచి
పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు
పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు
చీమలకు చక్కెర పాములకు పాలోసి
జీవకారుణ్యమే జీవితం అంటాడు
జీవకారుణ్యమే జీవితం అంటాడు
తోడ పుట్టిన వాళ్ళ ఊరవతలకినెట్టి
తోడ పుట్టిన వాళ్ళ ఊరవతలకినెట్టి
కులమంటూ ఇల మీద కలహాల గిరి గీసి ॥ మాయ ॥

ఇరువైదు పైసలగరొత్తులు కాల్చి
అరవైదు కోట్ల వరములడుగుతాడు
అరవైదు కోట్ల వరములడుగుతాడు
దైవాల పేరుతో చందాలకేగంగ
భక్తి ముసుగు తొడిగి భలే పోజు పెడతాడు
యుక్తి పేర నరుడు రక్తిలో రాజై
యుక్తి పేర నరుడు రక్తిలో రాజై
రాకాసి రూపాన రంజిల్లుతున్నాడు ॥ మాయ ॥

అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి
చుట్టు తిరుగుతున్నడమ్మా
చుట్టు తిరుగుతున్నడమ్మా
రూపాయి కొరకు ఏ పాపానికైతేమి
వాడిగట్టే నదిగో చూడమ్మా
కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి
కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి
కోట్లకు పడగెత్తి కోరికలు చెలరేగి

మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు
మానవత్వం వున్నవాడు
మానవత్వం వున్నవాడు (సంక్షిప్తం) ✥

# ప్రజాసాహిత్య, సాంస్కృతికోద్యమంలో ఒక మైలురాయి జనసాహితి వర్క్‌షాప్

**1980 జూన్‌లో పదిరోజులపాటు జనసాహితి సాహిత్య, సాంస్కృతిక వర్క్‌షాపును నిర్వహించింది. ప్రజాసాహిత్యాన్నీ, కళలను, ప్రజాసంస్కృతిని ప్రజల్లో వ్యాపింపచేయటానికి, విస్తృత ప్రజాఉద్యమంగా అభివృద్ధి చేయటానికి జనసాహితి 1978 నుండి నిరంతరాయంగా ప్రజాసమూహాల మధ్య వుంటూ కృషి చేస్తూ వుంది. అడవులను, సహజ వనరులను కొల్లగొడుతూ ఆదివాసులను అడవుల నుండి గెంటివేసే పాలకుల విధానాలపై పోరాడుతున్న ఆదివాసీ ప్రజల పోరాటాలకు, ఆధిపత్య మత, కులదురహంకారులకు వ్యతిరేకంగా దళితులు, తోటి ప్రజారాశులు కలసి సాగించే పోరాటాలకు, దోపిడీ, పీడనలకు పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా సాగే మహిళా ఉద్యమాలకు, ఫాసిస్టు తరహా నిరంకుశ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రజలు సాగించే పోరాటాలకు మద్దతునిచ్చే సాహిత్యాన్ని సృజిస్తూ వుంది. ప్రజాసాహిత్యోద్యమానికి హాని కలిగించే, చెరుపు చేసే అన్ని రకాల తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తూనే వుంది. ఈ కృషిలో భాగంగానే సాహిత్య వర్క్‌షాపులను నిర్వహించింది, నిర్వహిస్తోంది. ఆనాటి జువ్వలపాలెం సాహిత్య వర్క్‌షాపు గురించిన అనుభవాలను అప్పటి జనసాహితి సభ్యులు రాఘవగారు జ్ఞాపకం చేసుకున్న సందర్భంగా, 'ప్రజాసాహితి'లో ఆనాడు వచ్చిన రిపోర్టును కూడా మరొకసారి గుర్తు చేసుకుంటూ ప్రచురిస్తున్నాం. – సం ॥**

ఈ ఏడాది జూన్ 1 నుండి 10 వరకు జువ్వలపాలెం గ్రామంలో జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య సాహిత్య, సాంస్కృతిక శిక్షణ తరగతులు విజయవంతంగా నిర్వహించింది. జువ్వలపాలెం రేపల్లె తాలూకాలో కృష్ణానది ఒడ్డున గల లంక గ్రామాలలో ఒకటి. వర్షం ఏమాత్రం కురిసినా, బస్సులు వూళ్ళోకి రాలేవు. ఈ గ్రామం చుట్టు ప్రక్కల వున్న లంక గ్రామాల భూములన్ని ఒకనాడు చల్లపల్లి జమీందారు అక్రమంగా ఆక్రమించుకున్నవే. ఈ ప్రాంతంలో ప్రచారంలో వున్న "మునిగిన లంకలన్నీ నీటిపాలు, తేలిన లంకలన్నీ కోటపాలు" అన్న సామెత ఆధారంగా చల్లపల్లి జమీందారు అటు కృష్ణ, ఇటు గుంటూరు జిల్లాలలో కృష్ణానదీ తీరంలో వున్న వేలాది ఎకరాల భూమిపై ఆధిపత్యం ఎలా చెలయించాడో అర్థం చేసుకోవచ్చు.

లంక భూములపై జమీందారుకు ఎటువంటి హక్కులేదనీ, ఆ భూములపై అక్రమంగా ఆధిపత్యం చలాయిస్తున్నాడనీ గ్రహించిన ప్రజలు 1946–51 సంవత్సరాలలో అనేక భూపోరాటాలు చేసారు. 1948లో గాజుల్లంక నుండి ఆముదార్లంక (జువ్వలపాలెను ఆనుకొని వున్న మరో గ్రామం) వరకు వున్న లంక భూములన్నీ ప్రజలు ఆక్రమించారు. ప్రభుత్వ నిర్బంధం పరమ కిరాతకంగా సాగింది. ఈ భూ పోరాటాలలో ఎందరో తమ జీవితాలను ఉద్యమాలకు అర్పించారు. ప్రాణాలను త్యాగం చేసారు. రావిలంక, జువ్వలపాలెం, ఒడ్డులంక భూములు తనవేనని చెప్పి, చల్లపల్లి జమీందారు ఆ భూములను భూస్వాములకు ధనిక రైతులకు ఇతరులకు అమ్ముకున్నాడు. అయితే 78 జూన్‌లో ఈ భూములు జమీందారువి కావని కోర్టు తీర్పు ఇచ్చింది. అది తెలుసుకొని జూన్ 21, 22 తేదీలలో ఆ లంకల్లోని 280 ఎకరాల భూములను సుమారు 2000 మంది గ్రామీణ పేదలు ఆక్రమించు కున్నారు. అయితే కోర్టు మరల 'స్టే' ఇవ్వడం వలన, అక్కడవున్న నకిలీ వామపక్షవాదుల విచ్ఛిన్నకర చర్యల వలన, ఆ భూమిని ప్రజలు అనుభవించలేని పరిస్థితి ఈనాడు ఆ గ్రామంలో వుంది.

ఆ విధంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర కల్గిన గ్రామం జువ్వలపాలెం. ఈ లంక గ్రామాలలో ఎటుచూసినా అరటితోటలే. అయితే ఈ వేసవిలో వీచిన ప్రచండమైన వడగాల్పుల వల్ల తోటలన్నీ వడలిపోయి ఎండిపోయాయి. అప్పుడప్పుడు వీచిన పెనుగాలులకు కొన్ని తోటలు పూర్తిగా పడిపోయాయి. ఇటువంటి ఇబ్బందులు వచ్చినా కూడా, జువ్వలపాలెం గ్రామస్తులు పదిరోజుల పాటు జనసాహితి వర్క్‌షాప్‌లో పాల్గొన్న 50 మందికి భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. ఈ శిక్షణా తరగతులు రహస్యమైనవేమీ కాదని, అనుమానం వెలిబుచ్చినవారికి వివరణ ఇవ్వగా గ్రామస్థులు కూడా కొందరు తరగతులకు హాజరయ్యారు. జనసాహితి కార్యక్రమాలతో ఉత్తేజితులైన వీరు విద్యార్థులకు తమ తోటలలోని మామిడిపండ్లనూ,

అరటిగెలలనూ ఉచితంగా ఇచ్చారు. ఒక హోటల్ యజమాని ఒకపూట టీ, అల్పాహారం సరఫరా చేసారు.

జూన్ 1 నుంచీ తొలకరి వానలు ప్రారంభమయ్యాయి. రైతుసోదరులు ఆనందించారు. వర్షం పడటం మూలంగా బస్సురాని కారణంగా వెల్లటూరు నుంచి కాలినడకన కొందరూ, ఒంటెద్దు బండ్లపై మరికొందరూ, గుర్రబ్బండిపై ఇంకా కొందరు విద్యార్థులు, ఉపాధ్యాయులు నాలుగు మైళ్ళు ప్రయాణం చేసి జువ్వలపాలెం చేరారు. పదిరోజుల టైమ్‌టేబిల్‌లోని కార్యక్రమాలలో వున్న ఉపాధ్యాయులు ఎన్ని యిబ్బందులకైనా ఓర్చి వారికి నిర్ణయించిన రోజుకు హాజరయ్యారు.

జనసాహితి గురించీ, వర్క్‌షాప్ గురించీ ప్రజలకు వివరించడానికి జువ్వలపాలెంలో మే 31న ఏర్పాటుచేసిన బహిరంగసభలో ముత్యం, నవీన్, రవిబాబు మాట్లాడారు. 'జీతాల తమాషా' అనే నృత్యగేయ రూపకమూ డప్పు డాన్సూ, జనంపాటలు మొదలగు సాంస్కృతిక ప్రదర్శనలను ఆనాడు హాజరైన 600 మంది ప్రజలు చూచి జనసాహితి గురించి అర్థం చేసుకున్నారు.

తరువాత పదిరోజులపాటు జరిగిన తరగతులలో గతితార్కిక భౌతికవాదం గురించి టి.యల్. నారాయణ; భారతీయ సంస్కృతీ దశలు అనే అంశంపై డా॥ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు; సాహిత్యంపై లెనిన్, క్రిస్టఫర్ కాడ్వెల్ అభిప్రాయాలను నిఖిలేశ్వర్; జనతా ప్రజాతంత్ర విప్లవ దశలో రచయితల కళాకారుల కర్తవ్యాలు – సమస్యలు అనే అంశంపై నవీన్; ప్రజాసాహిత్యం, కళలు, రచయితల, కళాకారుల కర్తవ్యాలు – సమస్యలు అనే అంశంపై రవిబాబు; వివిధ ప్రజా కళారూపాలను మన ఉద్యమానికి అనువుగా మలచుకునే పద్ధతులపై మండవ రామారావు, ముత్యం పాఠాలు చెప్పారు.

మదరాసు నుంచి వచ్చిన కాకరాల నూరేళ్ళ తెలుగు నాటకరంగం అనే అంశాన్ని, ఆధునిక తెలుగు నాటక రచన – జనాదరణ, నూరేళ్ళ పరిణామంలో రచయిత – ప్రయోక్త ప్రేక్షకుల ప్రస్తుత స్థితి, రావాల్సిన మార్పులు అనే విభాగాల క్రింద విశ్లేషిస్తూ ప్రసంగించారు. గ్రీకు నాటక పద్ధతిలో కోరస్‌ను ఒక పాత్రగా వుంచి, ఒక కళారూపాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందని సూచించారు.

అనువాదకుల సమస్యలు కొన్ని అనువాదాలలో లోపాలు ఆలూరి భుజంగరావు వివరించారు. కథ–రూపం–వస్తువు అనే అంశంపై వాకాటి పాండురంగారావు, పి.రామకృష్ణారెడ్డి వివరించారు.

ప్రముఖ ప్రయోక్త ఎ.ఆర్.కృష్ణ చివరి మూడురోజులూ వర్క్‌షాప్‌లో పాల్గొని 'రాభణకాష్టం' అనే సజీవవీధి నాటకాన్ని ఆ మూడురోజుల్లో రూపొందించారు. స్క్రిప్టు, రచన, నటన, వాచకంలలో శిక్షణ ఇచ్చారు. సి. రామలింగశాస్త్రి మేకప్ గురించి వివరించారు.

బుర్రకథలు చెప్పటంలో ప్రముఖులైన నాజర్ వర్క్‌షాప్‌లో రెండు రోజులు పాల్గొని కొన్ని బుర్రకథ వరుసలు నేర్పారు. తమ అనుభవాలను చెప్పారు. హైదరాబాద్ సంగీత కళాశాల అధ్యాపకులు ఆర్. గోపాలరావు నృత్యంలో శిక్షణ యిచ్చారు. దాదయ్య 'గొల్లసుద్దులు'కు సంబంధించిన చిందులు నేర్పారు. కంజీర, డక్కీ, హార్మోనియం, డప్పు వాయిద్యాలు వాయించడంలో కొందరు ప్రాథమికమైన శిక్షణ పొందారు. ఈ శిక్షణా తరగతులకు వివిధ జిల్లాల నుండి 43 మంది ఎన్నిక చేయబడిన సభ్యులు సానుభూతిపరులూ హాజరయ్యారు.

శిక్షణా తరగతులలో శిక్షణ పొందుతూనే, మరోవైపు సాయంత్రం సమయాలలో గ్రామాలలోని ప్రజలతో కలసి, జనసాహితి గురించీ నేడున్న ప్రజావ్యతిరేక సంస్కృతి గురించి వివరించారు. గ్రామ ప్రజల సమస్యలను పరిశీలించారు, పాటలు పాడి వినిపించారు. వస్తురూపంలో, ధనరూపంలో ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరించారు. జువ్వలపాలెం చుట్టూ 4 మైళ్ళ దూరంలో వున్న గ్రామాల ప్రజలలో ఈ సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆదరణా, సంస్థ పట్ల ఆప్యాయత రోజురోజుకీ పెరిగిపోవడాన్ని సహించలేని నకిలీ వామపక్ష రాజకీయ పార్టీలకు సంబంధించినవారు జనసాహితి గురించి తప్పుడు ప్రచారం చేస్తూ 'వీళ్ళు నక్సలైట్లు, పగలు పాటలు పాడుకుంటూ ఇళ్ళు చూచిపోయి, రాత్రిపూట వచ్చి దోచుకుంటారు' అని ప్రజలను భయభ్రాంతులు చేయాలని విఫల ప్రయత్నం చేశారు. కాని ప్రజలు జనసాహితి కార్యక్రమాలను, ఆచరణను సునిశితంగా పరిశీలించి, జనసాహితిపట్ల మరింత ఆదరణచూపి, వారి దుష్ప్రచారాన్ని త్రిప్పికొట్టారు.

నాలుగు మైళ్ళ దూరంలో వున్న వెల్లటూరు గ్రామ ప్రజల కోరికపై ఆ వూరిలో జూన్ 8వ తేదీన బహిరంగసభ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన వేయిమంది ప్రేక్షకులు 'కలసి పోరుదాం', 'గొల్లసుద్దులు', 'డప్పు నృత్యం' జనం పాటలు కార్యక్రమాన్ని చివరివరకూ చూచి, అప్పటికప్పుడు దాదాపు 30 రూపాయల విరాళాన్ని అందచేసారు.

వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా 10వ తేదీ రాత్రి జువ్వలపాలెంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు రెండు వేలమంది ప్రేక్షకులు హాజరయ్యారు. నిఖిలేశ్వర్, రవిబాబు, నవీన్ ఉపన్యసించారు. "కలసి పోరుదాం", "డప్పుడాన్సు", "గొల్లసుద్దులు" జనంపాటలు కార్యక్రమాలను సంస్థ సభ్యులు ప్రదర్శించారు. ఆ పదిరోజుల్లో భోజన విరామ సమయాల్లో పాటలు నృత్యం నేర్చుకోవాలనే అభిలాష చూపిన ఈ గ్రామ బాలబాలికలు శిక్షణ పొంది కొన్ని జనం పాటలకు అభినయాన్ని ప్రదర్శించారు.

శిక్షణా తరగతులను పూర్తిచేసుకొని తిరుగు ప్రయాణంలో వున్న సభ్యులను ఆయా గ్రామాల ప్రజలు మధ్యలో ఆపి, పాటలు పాడించు కొన్నారు. "మళ్ళీ ఎప్పుడు వస్తారు మళ్ళీ వేసవికాలానికే కదా; పదిరోజులపాటు వున్నట్లే లేదు" అంటూ ఆప్యాయతా అనురాగాలని చూపించారు.

ఈ పదిరోజులూ సూర్యోదయంతో పాటే గ్రామమంతా జనంపాటలు పాడుతూ ప్రభాత్ భేరీ నిర్వహించారు.

ప్రజాసాహిత్య సాంస్కృతికరంగాలలో కృషిచేస్తున్న కార్యకర్తలకు ఉద్యమానికి సంబంధించిన సరైన అవగాహననూ, నూతనోత్తేజాన్ని జనసాహితి వర్క్‌షాప్ ఇచ్చింది.

జ్ఞాపకాలు

# పోటొస్తే, నది అయినా వెనక్కి తగ్గక తప్పదు!?

## లంక భూముల్లో సాహితీ సేద్యం

రాఘువ

**జువ్వలపాలెం** సాహిత్య పాఠశాల అనగానే, కళ్ళ ముందు అనేక సంగతులు కదలాడతాయి. అనేక సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక విషయాలు తళుక్కున మెరుస్తాయి. నా మూలాలున్న ప్రాంతంలోని గ్రామీణ జనజీవితాన్ని నాలుగున్నర దశాబ్దాల క్రితం తొలిసారిగా చూసే అవకాశం కలిగిన సందర్భం అది.

కృష్ణానది అనేక పాయలుగా చీలి సముద్రుడిలో సంగమించే ప్రాంతంలోని అనేక పల్లెలను లంక గ్రామాలంటారు. నదికి ఆవల కృష్ణాజిల్లా, ఈవల గుంటూరుజిల్లా. నేనక్కడ నివసించకపోయినా, నా మూలాలున్న జిల్లాలవి. గుంటూరు జిల్లాలో నదికి ఆనుకుని ఉన్న లంక గ్రామాల్లో జువ్వలపాలెం ఒకటి. "జువ్వలపాలెంలో సాహిత్య వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాం, రండి" అన్నారు కొత్తపల్లి రవిబాబు. మానాన్న ఉద్యోగం చేసే పాలిటెక్నిక్‌లో వర్క్‌షాప్‌ను నా చిన్నతనం నుంచీ చూస్తున్నాను. అందులో అనేక సెక్షన్లుండేవి. 'కొలిమిలో ఇనుమును కాల్చి, పెద్ద సుత్తితో కొట్టి సాగదీసినట్టు, సాహిత్య వర్క్‌షాప్‌లో కూడా సాగదీస్తారా! సాన బెడతారా!' అనే ఊహ అప్పుడు నాలో మెదిలింది. వర్క్‌షాప్ అంటే శిక్షణ అనే కదా అర్థం!

జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి రవిబాబు 1980 తొలి రోజుల్లో తిరుపతి వచ్చిన సందర్భం అది. చిత్తూరు జిల్లా నుంచి జనసాహితిలో సభ్యుడిగా ఏ.ఎన్. నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడిగా భూమన్ అప్పటికే ఉన్నారు. రవిబాబు వచ్చిన సందర్భంగా నేను కూడా జనసాహితిలో చేరాను.

గుంటూరు జిల్లా జువ్వలపాలెంలో 1980 జూన్ ఒకటి నుంచి పదవ తేదీవరకు పదిరోజుల పాటు వర్క్ షాప్ జరుగుతుందని చెప్పారు. ఎలా రావాలో వివరించారు. ఆ శిక్షణ తరగతులకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. అప్పుడు నా వయసు పాతికేళ్ళు.

తిరుపతిలో రైలెక్కి తెనాలిలో దిగాను. అక్కడి నుంచి బస్సులో వెల్లటూరుకు బయలు దేరాను. కృష్ణాజిల్లాలో పుట్టినప్పటికీ, నాకు ఊహ తెలిసేనాటికి, మా కుటుంబం మహబూబ్‌నగర్ జిల్లా వచ్చేసింది. అక్కడి నుంచి రాయలసీమ వచ్చి స్థిరపడింది. తెనాలి నుంచి బస్సులో వెళుతుంటే పంట కాలువలు, పచ్చని పొలాలతో పరిసరాలు ఎంత కనువిందు చేస్తున్నాయో! రాయలసీమలో ఇంత పచ్చని చేలను, ఇన్ని నీళ్ళను నేనెప్పుడూ చూడలేదు.

మాకిన్ని కాలువలూ లేవు, ఇన్ని పంటలూ లేవు. ఒక్కసారిగా అన్ని నీళ్ళను చూసేసరికి మనసు ఉప్పొంగింది. రాయలసీమలో తగినన్ని వర్షాలు పడవు. మేం రుతుపవనాలక్కూడా సవతి బిడ్డలం కదా! ఇంత సంపద ఉన్నా, ఇక్కడా పేదరికమే! ఇక్కడా అసమానతలే! బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానులు ఇక్కడి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఈ తీరప్రాంత జిల్లాల్లో అతి వృష్టి, రాయలసీమలో అనావృష్టి.

తెనాలి నుంచి వెల్లటూరు రావడానికి బస్సులో గంట పట్టింది. వెల్లటూరులో దిగిన మాకు జువ్వలపాలెం దారి చూపించడానికి కోటేశ్వరరావు సహా మరి కొందరున్నారు. అక్కడి నుంచి జువ్వలపాలెం వెళ్ళడానికి ఆరోజుల్లో బస్సు లేదు. నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్ళాలి. లేదా ఎద్దుల బండ్లలో వెళ్ళాలి. వచ్చిన మిత్రులతో కబుర్లు చెప్పుకుంటూ నడక మొదలు పెట్టాం.

ఎద్దుల బండ్ల దారిలో నడిచి వెళితే చాలా సేపు పడుతుంది. పంటపొలాలకు అడ్డంగా పడి, చేల గట్ల వెంబడి నడుచుకుంటూ వెళుతున్నాం. వరితో పాటు అరటి తోటలు బాగా ఉన్నాయి. పసుపు కూడా వేశారు. అక్కడక్కడా మామిడి తోటలు ఉన్నాయట కానీ, దారిలో అవి మాకు కనిపించలేదు.

ఇవ్వన్నీ సారవంతమైన లంక భూములు. నది పొంగినప్పుడు కొట్టుకు వచ్చిన ఒండ్రు మట్టితో భూములు సారవంతమవుతాయి. అది ప్రకృతి ప్రసాదించిన వరం. ఈ సారవంతమైన భూముల వెనుక, పచ్చని పంటల వెనుక ఎన్నో విషాదాలున్నాయి. రైతుల జీవన్మరణ పోరాటాల కన్నీళ్ళున్నాయి.

రైతుల భూములను ఆక్రమించుకున్న చల్లపల్లి జమీందార్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలున్నాయి. బ్రిటిష్ పాలన అంతిమ దశలో కొన్ని పోరాటాలు జరిగాయి. స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని పోరాటాలు జరిగాయి. నాటి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన పోరాటాల్లో ఎంతో మంది అన్న దాతల రక్తతర్పణ వల్లనే రైతులకు భూములు దక్కాయి.

నిఖిలేశ్వర్‌ని వెల్లటూరి నుంచి ఎద్దుల బండిలో తీసుకొచ్చి జువ్వలపాలెంలో దించారు. మేం నాలుగు కిలోమీటర్లు నడిచి ఆ గ్రామానికి చేరుకున్నాం. మా కంటే ముందు కొందరు, మా తరువాత మరికొందరు వచ్చారు. అంతా 43 మంది విద్యార్థుల వరకు చేరారు. అది కృష్ణానదికి సమీప గ్రామం. గ్రామమంతా వ్యవసాయ దారులే. కొన్ని పెంకుటిళ్ళు, కొన్ని డాబా ఇళ్ళు, ఎక్కువ భాగం పూరిళ్ళు.

స్కూల్లో మాకు బస ఏర్పాటు చేశారు. దానికి అనుబంధంగా పెద్ద తాటాకుల పాక/కొట్టం కూడా ఉంది. అక్కడ కూడా కొందరు దిగారు. నేలపైన పరచిన జంపఖానా పైనే మా పడక. చేద బావుల దగ్గరే స్నానాలు. పొలాలే మాకు మరుగు దొడ్లు. ఆ గ్రామస్తులే మాకు అన్న దాతలు. కొందరు గ్రామస్తులు తరగతి గదిలోకి వచ్చి కూర్చుని పాఠాలు విన్నారు.

ఈ పాఠశాల అనేక గొప్ప అనుభూతులను, అనుభవాలను మిగిల్చింది. ఎందరో సాహితీవేత్తలు, భాషావేత్తలు, మరెందరో సాంస్కృతికరంగ ప్రముఖులైన కళాకారులను ఒక్కచోటే కలిసే అవకాశం, వారితో సంభాషించే అవకాశం కలిగించింది. మా ఆలూరి భుజంగరావు బాబాయిని తొలిసారిగా కలిసి ముచ్చటించింది ఈ జువ్వలపాలెం సాహిత్య పాఠశాలలోనే. ఆయన మా నాన్నకు పెదనాన్న కొడుకు అయినా, ఆ రోజుల్లో మాకుటుంబాల మధ్య పెద్దగా రాకపోకలు లేవు. గుడివాడలో మా బాబాయి ఇంటికి అప్పుడప్పుడూ మా నాన్న మాత్రం వెళ్ళి వస్తుండేవాడు.

ప్రముఖ నాటకరంగ ప్రయోక్త ఏ.ఆర్. కృష్ణ చివరి మూడు రోజులూ మాతోనే ఉన్నారు. ఒక సజీవ వీధి నాటకాన్ని అక్కడే రూపొందించారు. విద్యార్థులందరినీ కూర్చోబెట్టి మా వివరాలడిగారు. ఈ నాటకంలో 'నువ్వు నటిస్తావా?' అంటూ ఒక్కొక్కరినీ అడుగుతూ వస్తున్నారు. నా వంతు వచ్చింది. "నాకు నాటకాలు చూడడమే తప్ప నటించాలని లేందడి. ఉత్తమ ప్రేక్షకుడిగా ఉండిపోతా" అని అన్నాను. ఆ మాటలకు నవ్వుతూ ఎంత ఆనందపడిపోయారో ఏ.ఆర్. కృష్ణ!

"మనం నాటకాలు వేసేది ప్రేక్షకుల కోసమే కదా! ప్రేక్షకులు లేకపోతే నాటకం ఎవరి కోసం వేస్తాం? నాటకాలకు ఉత్తమ ప్రేక్షకులు చాలా అవసరం. రాఘవ మొదటి ఉత్తమ ప్రేక్షకుడైతే, నేను రెండవ ఉత్తమ ప్రేక్షకుణ్ణి" అనేశారు చాలా సీరియస్‌గా. అంతా నవ్వుకున్నారు. నేను ఏ.ఆర్. కృష్ణను చూట్టం ఇది రెండవసారి. వనపర్తిలో నేను చదువుకుంటున్న రోజులవి. టెన్త్‌క్లాస్ పరీక్షలు రాసి 1971లో 'దసరా బుల్లోడు' సినిమా చూద్దామని, హైదరాబాదులో మా అక్క ఇంటికి వెళ్ళాను. హైదరాబాదు చూడడం అదే తొలిసారి.

మా బాబాయి ధర్మవరపు రాంగోపాల్ రంగస్థల నటుడు. మా నాన్నకు పిన్ని కొడుకు. వనపర్తిలో మా ఇంట్లోనే ఉండి పాలిటెక్నిక్ చదువుకున్నాడు. నాటకాల్లో ఏ.ఆర్. కృష్ణకు శిష్యుడు. 'మా భూమి', 'ఒక ఊరి కథ', 'స్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్', 'పెళ్ళికాని పెళ్ళి' వంటి కళాత్మక, వ్యాపార సినిమాల్లో కూడా నటించాడు. "పబ్లిక్ గార్డెన్స్‌లో 'మాలపల్లి' నాటకం వేస్తున్నాం సాయంత్రం రారా" అని అన్నాడు మా బాబాయి. మా బావ ర్యాలీ సైకిల్ వేసుకుని, సైదాబాద్ నుంచి పబ్లిక్ గార్డెన్స్‌కు ఆ రోజు వెళ్ళాను.

పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' నాటకానికి అర్ధ చంద్రాకారంలో నాలుగైదు స్టేజిలు కడుతున్నారు. మా బాబాయి సహా నటులంతా స్టేజీలు కట్టే పనిలో నిమగ్నమయ్యారు. వారిలో ఏ.ఆర్. కృష్ణ కూడా ఉన్నారు. టెన్త్ పరీక్షలు రాశాను కనుక, అప్పుడే నిక్కర్ల నుంచి ఫ్యాంట్లకు నాకు ప్రమోషన్ వచ్చింది. ఏ.ఆర్. కృష్ణ నన్ను చూసి 'ఇటు రా అబ్బాయ్' అని పిలిచారు. వెళ్ళాను. 'ఎవరబ్బాయివి?' అని అడిగాడు. ఫలానా అని చెప్పాను. "అలా కూర్చుంటే ఎలా? నాతోపాటు స్టేజి కట్టడానికి రా.." అన్నాడు. వెళితే నాచేత కూడా స్టేజి పనులు చేయించాడు. అంటే ప్రేక్షకులను కూడా నాటకం పనిలోకి దింపే స్వభావం ఆయనది.

మరొకసారి విద్యుత్ సౌధలో చో రామస్వామి రాసిన 'తుగ్లక్' నాటకాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు కూడా ఏ.ఆర్. కృష్ణను చూశాను. ఎవరైనా నటులు రాకపోతే, ఆ పాత్రలోకి దూరేస్తారు. అది ఏ పాత్రైనా పరవాలేదు. తాను ఆ పాత్రకు సరిపోతానా లేదా అని కూడా చూడరు. 'తెలుగు నాటక రంగం చేసుకున్న అదృష్టం ఏ.ఆర్. కృష్ణ' అని 'ఉదయం' పత్రికలో ఊరికే రాయలేదు.

జువ్వలపాలెం పాఠశాలలో ఏ.ఆర్. కృష్ణ నాటకం కోసం నటులను ఎంపిక చేస్తున్నప్పుడే వాసిరెడ్డి నవీన్ ఆయన దృష్టిలో పడ్డారు. "తెల్లగా జామ పండులా మిసమిసలాడుతున్నావ్. సినిమాల్లోకి వస్తావా!" అని అడిగారు. నవీన్ ఒక నవ్వు నవ్వేసి ఊరుకున్నారు. జువ్వలపాలెం పాఠశాలలో ఇవన్నీ కొన్ని సరిగమలు.

★ ★ ★

జువ్వలపాలెం సాహిత్య పాఠశాలలో తెల్లవారుజామునే నిద్ర లేచేవాళ్ళం. తెలతెల వారుతుండగా ప్రభాత భేరీ నిర్వహించేవాళ్ళం. పీర్ సాహెబ్ వంటి గాయకులు ఒకరిద్దరు కంజిర కొట్టుకుంటూ పాటలు పాడుతుంటే, మిగతా మేమంత కోరస్‌గా గొంతు కలిపేవాళ్ళం. ఈ ప్రభాత భేరీ ఆగ్రామస్తులకు భౌతికంగానే కాదు, మానసికంగా కూడా మేలుకొలుపులా ఉండేది.

చేదబావి దగ్గర స్నానాలు ముగించుకునేవాళ్ళం. కొందరు కృష్ణానది ఒడ్డుకు వెళ్ళి స్నానాలు చేసేవారు. టిఫిన్లు చేశాక, దాదాపు పదిగంటల సమయంలో క్లాసులు మొదలయ్యేవి. జ్వాలాముఖి, నిర్మలానంద మాత్రం మొదటిరోజు వచ్చి, వారణాసి దగ్గర ప్రేమ్‌చంద్ స్వగ్రామం లంమ్‌హీలో జరిగే ఆయన శతజయంతి సభ కోసం వెళ్ళిపోయారు. మద్రాసు నుంచి వచ్చిన కాకరాల 'నూరేళ్ళ తెలుగు నాటక రంగం– పరిణామం, నాటక రచన, ప్రయోక్త, ప్రేక్షకుల పరిస్థితి, రావలసిన మార్పు'ల గురించి వివరించారు.

భారతీయ సంస్కృతీ దశల గురించి డాక్టర్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, గతితార్కిక భౌతికవాదం గురించి టి.ఎల్. నారాయణ, క్రిస్టఫర్ కాడ్వెల్ గురించి నిఖిలేశ్వర్, జనతా ప్రజాతంత్ర విప్లవ దశలో రచయితలు, కళాకారుల కర్తవ్యాలు అన్న అంశంపై నవీన్ వివరించారు. అనువాద సమస్యల గురించి ఆలూరి భుజంగరావు వివరించారు. కథ, వస్తువు, రూపం అన్న అంశంపై వాకాటి పాండురంగారావు చెప్పారు.

ఆనాటి 'ఆంధ్రజ్యోతి' వార పత్రికలో అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేస్తున్న పి. రామకృష్ణారెడ్డి కథలతో పాటు కవిత్వం గురించి

కూడా వివరంగా చెప్పారు. కవిత్వం పట్ల ఆసక్తి కలిగిన వారు ఈ తరగతుల్లోనే రాసిన కవితలను చూపించమన్నారు. నేను కూడా కవిత రాసి చూపించాను. అయితే 'సముద్రంలో అలలుంటాయి కానీ, ప్రవాహాలుండవు' అని సూచించారు. అలాగే చాలామంది రాసిన కవితల్లో లోపాలను చూపించారు.

కస్తూరి వేణుగోపాల్ గుండ్రంగా, బలంగా ఉండేవాడు. అతను కూడా ఒక కవిత రాసి చూపిస్తే, దానిలో ఉన్న లోపాలను పి. రామకృష్ణా రెడ్డి ఎత్తి చూపించారు. "మీ 'ఆంధ్రజ్యోతి'లో ఇంతకంటే గొప్ప కవితలు వేస్తున్నారా?" అంటూ కాస్త పరుషంగా మాట్లాడాడు కస్తూరి వేణుగోపాల్. పి. రామకృష్ణా రెడ్డి చాలా మర్యాదస్తులు, పెద్ద మనిషి. ఏం సమాధానం చెప్పకుండా మౌనం దాల్చారు.

ఈ లోగా అక్కడే ఉన్న రవిబాబు అనుకుంటా, "ఆ పత్రికలో వచ్చే కవితల మంచి చెడులకు రామకృష్ణా రెడ్డిని బాధ్యులను చేయడం సబబు కాదు. ఆయన అందులో ఉద్యోగి మాత్రమే" అంటూ వివరించడమే కాదు, అలా మాట్లాడకూడదని కస్తూరి వేణుగోపాల్‌ను మందలించారు. ఈ ఒక్క సంఘటన తప్ప పదిరోజుల సాహిత్య పాఠశాలలో ఎలాంటి అపశృతి దొర్లలేదు.

యువకుడైన కస్తూరి వేణుగోపాల్ కాస్త ఆవేశపరుడే తప్ప, చాల మంచివాడు. సాహిత్యకారుడు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు సమతారావుకు సమీప బంధువు. ఒక విషాదం ఏమిటంటే, అంత ఆవేశపరుడు, నిబద్ధత నిజాయితీ గల కస్తూరి వేణుగోపాల్ చిన్న వయసులోనే కన్ను మూశాడు. అతని మరణవార్త నన్ను కలిచివేసింది.

నాజర్ అనగానే బుర్రకథ గుర్తుకు వస్తుంది. బుర్రకథ గురించి నాజర్ చాలా ఉద్వేగంగా చెప్పారు. అప్పటివరకు బుర్రకథ వినడమే తప్ప దానిలోని లోతుపాతులు పెద్దగా తెలిసేవి కావు. తెలంగాణా సాయుధ పోరాట సమయంలో ప్రజలను ఉర్రూతలూగించిన కళారూపం బుర్రకథ. బుర్రకథకు తెలంగాణాలో సుద్దాల హనుమంతు, కోస్తాంధ్రలో నాజర్ ప్రాణం పోశారు.

అంత పెద్ద వయసులో కూడా నాజర్ గంభీరమైన కంఠంతో చాల ఉత్సాహంగా చెప్పడం మమ్మల్నెంతగానో ఉద్వేగానికి గురిచేసింది. అంతకుముందు అసలు నాజర్ వంటి కళాకారులను చూడగలమా అన్న సందేహం ఉండేది నాకు. హైదారబాదులోని సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు ఆర్. గోపాలరావు కొందరికి నృత్యంలో శిక్షణనిచ్చారు. మరికొందరు వాయిద్యాల్లో శిక్షణ ఇచ్చారు.

మధ్యాహ్నమైతే మంచి భోజనం. భోజనంలో పెరుగేసుకున్నాక, అందులో బాగా పండిన బంగినపల్లి మామిడి పళ్ళు కూడా వేసేవారు. అదంతా గ్రామస్తుల ఔదార్యం. భోజనానంతరం మళ్ళీ తరగతులు. సాయంత్రం జువ్వలపాలెం గ్రామస్తులతో కలిసి మాటా మంతి. జనసాహితి గురించి, ప్రజావ్యతిరేక సంస్కృతి గురించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజలకు వివరించేవారు. విద్యార్థుల్లో మహిళలు కూడా ఉన్నారు.

చివరిరోజు, జూన్ 10వ తేదీ సాయంత్రం జువ్వలపాలెంలో రెండు వేల మందితో ఒక పెద్ద బహిరంగసభ జరిగింది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కానీ నేనా కార్యక్రమాలకు లేను. అదేరోజు సాయంత్రం తిరుగుప్రయాణమవ్వాలి. ఆ పది రోజులూ చాలా ఉత్సాహంగా ఉన్నాను. భిన్న సామాజిక పరిస్థితుల నుంచి వచ్చినవారితో అన్ని రోజులు కలిసి ఉండడం, కలిసి భోజనం చేయడం, కలిసి పడుకోవడం, కలిసి కబుర్లు చెప్పుకోవడం నా వరకు నాకు అబ్బుర మనిపించింది. అంతా కొత్త పరిచయాలు, పరిచయమైన కొత్త లోకం అంతా పది రోజుల్లో పాతపడిపోయాయి. అప్పుడే తరగతులైపోయాయా! అనిపించింది. పది రోజుల కాలం మంచులా కరిగిపోయింది. తిరిగి వెళ్ళక తప్పదు కదా!

కృష్ణానదికి ఆవల నడకుదురు. ఈవల జువ్వలపాలెం. నడకుదురు నుంచి మూడు కిలోమీటర్లలో చల్లపల్లి. ఆరెంటి మధ్య నుంచి సముద్రుడిలో సంగమించడానికి సాగుతున్న కృష్ణానది. అప్పుడప్పుడూ ఉదయాన, సాయం సమయాన, కృష్ణానది తీరానికి నడుచుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళేవాళ్ళం. అనేక విషయాలు మా మాటల్లో దొర్లేవి. ముఖ్యంగా లంక భూముల్లో చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా రైతులు చేసిన మహత్తర పోరాటం మా మధ్య చర్చకు వచ్చేది.

బ్రిటిష్ పాలనా కాలంలో రైతుల నుంచి పన్ను వసూలు చేయడానికి 1793లో కారన్ వాలిస్ జమిందారీ విధానాన్ని ప్రవేశపెట్టాడు. భూములన్నీ జమిందారు ఆధీనంలో ఉంటాయి. భూములను సాగుచేసే రైతులకు కౌలు దారులుగా ఎలాంటి యాజమాన్య హక్కులు ఉండేవి కావు. జమిందారీ విధానం వారసత్వంగా సంక్రమించేది. బ్రిటిష్ కాలంలో ఏర్పడిన చల్లపల్లి జమిందారు రైతుల నుంచి వసూలు చేసిన పన్నులలో కొంత మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, మిగతాది సొంతానికి వాడుకునేవాడు.

గుంటూరు జిల్లా పరిధిలో దాదాపు పదిహేను లంక గ్రామాలుండేవి. కృష్ణాజిల్లా పరిధిలో దాదాపు పాతిక లంక గ్రామాలుండేవి. ఈ లంక గ్రామాల్లో వేలాది ఎకరాలు చల్లపల్లి జమిందారు శ్రీమంతు రాజా యర్లగడ్డ శివరామ ప్రసాద్ బహదూర్ ఆధీనంలో ఉండేవి. మహత్తరమైన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం (1946-51) జరుగుతున్న సమయంలో, దానికి సమాంతరంగా ఇక్కడ చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం జరిగింది. నాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఈ పోరాటం సాగింది.

చండ్ర రాజేశ్వరరావు మార్గదర్శకత్వంలో జరిగిన ఈ పోరాటానికి, నాటి కృష్ణాజిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కొండపల్లి సీతారామయ్య, మరో నాయకుడు సనకా బుచ్చికోటయ్య నాయకత్వం వహించారు. తరతరాలుగా తాము సాగుచేస్తున్న భూముల కోసం రైతులు ఉద్యమించారు. ఈ పోరాటంలో గాజుల్లంక నుంచి జువ్వలపాలెంను ఆనుకుని ఉన్న ఆముదార్లంక వరకు ఉన్న భూములను రైతులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో 'ప్రభుత్వ నిర్బంధం మొదలైంది. పళనియప్పన్ నాయకత్వంలోని మలబారు పోలీసులను చల్లపల్లి జమిందారు దించాదు.

పోలీసు తూటాలకు రైతులు ఎదురు నిలిచారు. పోలీసు కాల్పుల్లో అనేక మంది రైతులు నేలకొరిగారు.

ఈ భూపోరాటంలో గుంటూరు జిల్లా పరిధిలో దాదాపు 105 మంది వరకు ప్రాణాలను కోల్పోగా, కృష్ణాజిల్లా పరిధిలో 155 మంది వరకు ప్రాణాలను కోల్పోయారు. ఒక్క కృష్ణాజిల్లా దివితాలూకాలోనే 36 మంది మలబారు పోలీసుల తూటాలకు నేలకొరిగారు. గాజుల్లంక భూముల కోసం పోరాటంలో బావిరెడ్డి వియమ్మ సహా నలుగురు రైతులను పోలీసులు కాల్చి చంపారు. దీనిపైన సాహిత్యం కూడా వచ్చింది. లక్ష్మీకాంత మోహన్ 'రామరాజ్యం' అన్న నవలను రాశారు. అలాగే మండే పిచ్చయ్య రాసిన 'వ్యవసాయ కూలీ' నవల ఆ నాటి నిర్బంధాన్ని చిత్రీకరించింది.

స్వాతంత్ర్యానంతరం భూ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం జమిందారీ వ్యవస్థను రద్దు చేసింది. జమిందారీ వ్యవస్థ రద్దు కావడంతో ఈ భూములన్నీ తనవేనని చల్లపల్లి జమిందారు కొందరు భూస్వాములకు, ధనిక రైతులకు వాటిని అమ్మేశాడు. ఈ భూములు చల్లపల్లి జమిందారువు కావని 1978లో హైకోర్టు తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలతో రెండు వందల మంది రైతులు రెండు వందల ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు.

జువ్వలపాలెంలో పదిరోజుల శిక్షణా తరగతులు పూర్తయ్యాయి. పదవ తేదీ సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాను. తెనాలి నుంచి వెల్లటూరు మీదుగా జువ్వలపాలెంకు వచ్చిన దారిలో కాకుండా, మా బాబాయి ఆలూరు భుజంగరావు కుటుంబం ఉన్న గుడివాడకు వెళ్ళి, అటు నుంచి తిరుపతి వెళ్ళాలనుకున్నా. ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డు వరకు కృష్ణానదిని దాటుకుని ప్రతిరోజూ అనేక మంది ప్రజలు వెళుతూనే ఉండడం పొద్దునపూట గమనించాను. కృష్ణానది దాటితే నడకుదురు గ్రామం వస్తుంది. అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో చల్లపల్లి వస్తుంది. అక్కడి నుంచి గుడివాడకు బస్సులుంటాయి.

వంటరిగా నడుచుకుంటూ కృష్ణానది ఒడ్డుకు వెళ్ళాను. నదిని దాటుకుంటూ ముందుకు సాగుతున్నాను. సముద్రానికి పోటు వచ్చేసింది. ఆ విషయం నాకు తెలియదు. ముందుకు సాగుతున్న కొద్దీ సముద్ర జలాలు పాదాలు దాటి, మోకాటి వరకు వచ్చేశాయి. సూట్ కేసు తలపై పెట్టుకుని మొండిగా ముందుకు సాగుతున్నాను. సముద్రం నుంచి నీళ్ళు వెనక్కి తన్నుకు రావడం వల్ల కృష్ణానదిలో నీళ్ళు నడుం దాకా వచ్చేశాయి. నదిలో దాదాపు సగం దూరం వచ్చేశాను.

దూరంగా నదిని దాటుతున్న ఒక పడవ సరంగు అక్కడే ఆగమని పెద్దగా అరిచాడు. అక్కడే ఆగిపోయాను. పడవ నా దగ్గరకు వచ్చేసింది. "సముద్రం పోటులో ఉంది. మునిగిపోతావుగా" అని మందలింపు ధోరణిలో అరుస్తూ ఆ సరంగు నన్నొక వెర్రిబాగులవాడిలా చూశాడు. సముద్రం పోటులో ఉన్నప్పుడు నదిని ఎవరూ దాటరు. పడవలో నన్ను ఎక్కించుకుని ఆవలి ఒడ్డుకు కదిలాడు. నిజమే సముద్రం నుంచి నదిలోకి నీళ్ళు వెనక్కి తన్నుకు వస్తున్నాయి. సముద్రంలోని ఆటుపోట్ల గురించి నాకు తెలిస్తే కదా!

జువ్వలపాలెం కేసి వెనక్కి చూస్తూ, ఆ అలలపైన పడవలో ముందుకు కదులుతున్నాను. సముద్రం తన్నుకొస్తుంటే నది వెనక్కి వెళ్ళక తప్పదు. సముద్రుడి పోటుకు ఎవరు అడ్డం వచ్చినా ముంచేస్తుంది. రైతుల్లో కూడా పోటు లాగా తిరుగుబాటు వస్తే, జమిందారు కాదు కదా, వాడిని నియమించిన బ్రిటిష్‌వాడు కూడా వెనక్కి వెళ్ళక తప్పలేదు. ఇది చరిత్ర చెప్పిన గుణపాఠం. జువ్వలపాలెం సాహిత్య పాఠశాల నాకు నేర్పిన అనుభవసారం.

**ఎంత పోరాట పటిమ ఉన్న నేల ఇది!**

ఒకపక్క బంగాళాఖాతంలో కలవడానికి పోరాడుతున్న కృష్ణానదీ ప్రవాహ గానంలో, అటు ఆటుపోట్లకు గురయ్యే సముద్ర ఘోషలో రైతాంగ పోరాట చరిత్ర కలిసిపోయి అలా వినిపిస్తోంది. ✣

# యుద్ధం అంటే

– దాసరి రామచంద్రరావు

**నీకు తెలిసిందే కదా! ఇది**
**అందరికీ తెలిసిందే!! యుద్ధం అంటే -**
**ఒక్కడి అసహనానికి మందిని హత్య చేయడం**
**తెగిన తలలకు ఆహారం తినిపించి,**
**జారిన పేగులకు కుట్లు వేయడం...**
**యుద్ధం అంటే -**
**గుండెలు పెకిలించి మలాము పూయడం కూడా**
**గోడౌన్లు కాల్చి ఆహార పొట్లాలు అందించి,**
**పేల్చిన పుర్రెల మధ్య పునరావాస శిబిరాలు వేయడం...**
**యుద్ధం అంటే -**
**తల్లుల మృతదేహాల పక్కన**
**పిల్లలకు ముద్దలు తినిపించడం కూడా...**
**యుద్ధం అంటే విధ్వంసానికి కిరీటం తొడిగి -**
**శిథిలాలను ఎత్తిపోయడమే...**
**యుద్ధం అంటే -**
**హతుల వార్తల్ని అలవోకగా చెప్పడం...**
**ఎగురుతున్న లోహ విహంగాల్ని,**
**కూలుతున్న మానవ శ్రమనిర్మితాలను,**
**నేలమట్టమవుతున్న జాతి జాగృతం లాంటి దృశ్యాల్ని**
**ఆకర్షణీయంగా చూపించడం....**
**మీడియాను ఆపరేట్ చేయడం కూడా యుద్ధ వ్యూహమే....**
**యుద్ధమంటే సున్నితత్వం మరిచిన మానవత్వం....**
**నేడు - యుద్ధమంటే అహంకారం కాదు**
**ఆధిపత్యం అసలే కాదు**
**యుద్ధం అంటే ఆయుధ వ్యాపారం....** ✣

వ్యాసం

# స్వయం గౌరవ ఉద్యమానికి వందేళ్ళు

అరుణ

**వలస** పాలన కాలంలో 18, 19 శతాబ్దాలలో దేశమంతా అనేక సంఘసంస్కరణోద్యమాలు పెల్లుబికాయి. సమాజాన్ని పట్టి పీడిస్తోన్న నిచ్చెనమెట్ల కులవ్యవస్థ దాష్టీకాలు, అణగారిన కులాలపై వివక్ష, స్త్రీ పురుష అసమానత్వం, అవిద్య, మతఛాందస మూఢాచారాలు, అశాస్త్రీయ భావాలు మొదలైన సాంఘిక దురాచారాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. అప్పటికే 7వ శతాబ్దం నుండి ప్రారంభమైన భక్తి ఉద్యమాలు, 8వ శతాబ్దం నుండి ప్రారంభమైన సూఫీ ఉద్యమాలు కులవివక్షను నిరసించాయి. మతంలో సంస్కరణలకు బాటలు వేశాయి. దక్షిణాన ప్రారంభమైన ఈ ఉద్యమాలు 15వ శతాబ్దం నాటికి ఉత్తరానికీ వ్యాపించాయి. భక్తి ఉద్యమకారులైన రామానంద, కబీర్, గురునానక్, మీరాబాయి, తులసీదాసు తదితరులు తత్వాల రూపంలో పాడుకుంటూ గ్రామగ్రామాన తిరుగుతూ మానవత్వమే దేవుడు అంటూ ప్రచారం చేశారు. సూఫీ తత్వాలు – కవిత్వం, సంగీతం, సాహిత్యంపై లోతైన ప్రభావాన్ని చూపాయి. అరబిక్, పర్షియన్, పంజాబీ, ఉర్దూ భాషలలో వచ్చిన ఈ తాత్విక సాహిత్యం ప్రజలను ఆలోచింపచేసింది. ఆ తర్వాత వచ్చిన బ్రహ్మసమాజం, ఆర్యసమాజాలు హిందూ మతంలోని దురాచారాలను, మూఢత్వాన్ని ప్రశ్నించాయి. బాల్య వివాహాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగానూ, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ, అణచబడ్డ కులాలు, స్త్రీలలో విద్యాభివృద్ధి కోసం, తదితర ఆనాటి సామాజిక రుగ్మతలపై రాజారామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం, భాగ్యరెడ్డివర్మ, జ్యోతిరావు, సావిత్రీభాయి పూలే దంపతులు – ఇలా అనేకమంది వ్యక్తులుగానూ, సంస్థలుగానూ సంస్కరణోద్యమాలను నడిపారు.

పెల్లుబుకుతున్న సంఘసంస్కరణోద్యమాలను వలస పాలకులు తమకనుకూలంగా మరల్చుకోవటానికి కొన్ని కొన్ని రుగ్మతలను రూపుమాపుతూ చర్యలు తీసుకున్నారు. బాల్య వివాహాలు రద్దు చట్టం, వితంతు వివాహ చట్టం వంటివి చేశారు. తమకనుకూలమైన విద్యనందించే పాఠశాలలను నిర్మించారు. కులవివక్షనూ, మతాల మధ్య విద్వేషాలను ప్రజలను అనైక్యపర్చటానికి వాడుకున్నారు. 20వ శతాబ్దం నాటికి కులపీడన, మత విద్వేషాలు, మతాధిపత్యాలకు వ్యతిరేకంగా అనేక సాంఘికోద్యమాలు కృషి చేశాయి. అలా యావద్భారత దేశంలో కులవివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన ఉద్యమం వైకోమ్ సత్యాగ్రహం.

వైకోమ్ సత్యాగ్రహం 30 మార్చి 1924న ప్రారంభమై 23 నవంబరు 1925 వరకు కొనసాగింది. కేరళలోని కొట్టాయం జిల్లా వైకోం పట్టణంలోని శ్రీ మహదేవ ఆలయంకు వెళ్ళే నాలుగు దిక్కుల దారుల్లో వెనుకబడిన, అంటరానికులాలవారు నడవకూడదని, ఆలయ ప్రవేశాన్నీ ట్రావెన్‌కోర్ సంస్థానం నిషేధించింది. అంటరానితనాన్ని పాటించే ఈ సంప్రదాయాన్ని రూపుమాపాలని అసెంబ్లీ సభ్యుడిగా వున్న, నారాయణగురు అనుచరుడైన టి.కె. మాధవన్ 'దేశాభిమాని' పత్రికలో 1917లో దీనిపై సంపాదకీయం రాశారు. నారాయణగురు కేరళలో ఒకే కులం, ఒకే మతం, మానవత్వమే దేవుడు అంటూ సామాజిక సమానత్వం కోసం కృషిచేస్తున్న సంఘ సంస్కర్త. నారాయణ గురు బోధనలు కేరళ సమాజాన్ని ప్రభావితం చేస్తున్న రోజులవి. మాధవన్ ఆలయ ప్రవేశం, ఆలయ వీధుల్లో నడవటంపై అనేక రూపాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. సంస్థానాధిపతులకు అసెంబ్లీ సభ్యుల సంతకాలతో వినతి పత్రాన్ని 1918లో అందించారు. అసెంబ్లీలో అనేక సార్లు ఈ సమస్యపై చర్చను లేవనెత్తారు. 1919లో ఆలయ వీధుల్లో నడుద్దామని మాధవన్ పిలుపునిచ్చారు. పోలీసులను, నిషేధాజ్ఞలను లెక్కచేయకుండా 1920లో మాధవన్, కాంగ్రెస్ నాయకులు ఆలయ వీధుల్లోకి ప్రవేశించారు. వారిని అరెస్టు చేశారు.

1921లో తిరునల్వేలిలో మాధవన్ గాంధీజీని కలిసి సమస్యను వివరించారు. 1923లో కాకినాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో అస్పృశ్యతా నిర్మూలన కోసం పార్టీ కృషిచేయాలని మాధవన్ పెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు కూడా. 1924 జనవరిలో కాంగ్రెస్ నాయకుడు కె. కేలప్పన్ అస్పృశ్యతా వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేశారు. మాధవన్ ప్రారంభించిన ఉద్యమానికి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ మద్దతును, ఆర్థిక సహాయాన్ని కేలప్పన్ కూడగట్టారు. మాధవన్, కేలప్పన్, కేశవ మీనన్ మార్చి 30, 1924న ఆలయ వీధుల్లో వేలాదిమందితో కలసి నడవబోయారు. ఈ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. టి.ఆర్. కృష్ణస్వామి అయ్యర్, కె. కుమార్, ఎ.కె. పిళ్ళై, చిట్టేజతు సంకు పిళ్ళై, బారిస్టర్ జార్జి జోసఫ్, పెరియార్ ఇ.వి. రామస్వామి, అయ్య ముత్తు గౌడర్, కె. వేలాయుధా మీనన్ తదితరులు ఈ సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. గాంధీ ట్రావెన్ కోర్ సంస్థానాధిపతులతోనూ, హిందూ మతాధికారులతోనూ చర్చలు జరిపారు. ఆ చర్చలు ఫలించలేదు. పెరియార్ నాయకత్వంలో ముళ్ళ కంచెలను దాటుకుని మరీ ఆ వీధుల్లోకి జనం ప్రవేశించారు. నాయకత్వాన్ని మరలా పోలీసులు అరెస్టు చేశారు. నాయకులు అరెస్టయినప్పటికీ జైలు నుండే కార్యకర్తల సహాయంతో ఉద్యమాన్ని నడిపించారు. పెరియార్ భార్య నాగమ్మై, ఇతర మహిళలతో కలిసి ఈ ఉద్యమంలో భాగమయ్యారు. నాగమ్మైని కూడా అరెస్టు

చేశారు. ఐనా ఆలయ ప్రవేశం, వీధుల్లో నడిచే హక్కు కోసం ఉద్యమం ఆగలేదు.

నాయకత్వం అంతా అరెస్టయినపుడు కాంగ్రెస్ నాయకుడు, క్రిస్టియన్ అయిన జార్జి జోసెఫ్ ఈ ఆందోళనకు నాయకత్వం వహించాడు. దేశవ్యాప్త మద్దతును కూడగట్టుకున్న ఈ ఉద్యమకారులకు ఉచితంగా ఆహారాన్ని అందించటానికి పంజాబు నుండి సిక్కులు వచ్చారు. కానీ గాంధీ ఆ ఆందోళనను రాజీ చెయ్యటం కోసం ఇది హిందువుల సమస్య అని సిక్కులను వెనక్కి తిప్పి పంపారు. జార్జి జోసఫ్‌ను కార్యక్రమం నుండి పక్కన పెట్టారు. ట్రావెన్ కోర్ సంస్థానపు రాజు చనిపోవటం, రాజ్య పరిపాలనా సమస్యలు చుట్టుముట్టడంతో హిందూ మతాధికారులు ఆలయానికి తూర్పు వీధుల్లో బ్రాహ్మణులు నడుస్తారు గనుక ఆ వీధిని తప్పించి పడమర, ఉత్తర, దక్షిణ వీధుల్లో నడిచే అవకాశాన్నిచ్చారు. ఆలయ ప్రవేశం కుదరదన్నారు. గాంధీ ప్రమేయంతో 23 నవంబరు 1925న ఈ సత్యాగ్రహాన్ని పాక్షిక విజయంతో ముగించారు. నారాయణగురు, పెరియార్ దీనిని అవమానంగా భావించారు. తూర్పు రోడ్డులోకి, ఆలయంలోకి ప్రవేశం కొరకు పట్టుబట్టారు. తమ ఆందోళనలను, రచనల ద్వారా, చట్టం ద్వారా, ప్రజల్లో ప్రచారం ద్వారా కొనసాగించారు. ఆఖరికి 12 నవంబరు 1936న ఆలయ ప్రవేశ ప్రకటనను ట్రావెన్ కోర్ సంస్థానం జారీ చేసింది. ఒకవైపు పెరియార్ ఉద్యమ వత్తిడి, మరోవైపు వెనుకబడిన కులాల ప్రజలు క్రిస్టియన్ మతంలోకి చేరిపోతారన్న భయంతోనే ఈ ప్రకటన చేశారని ప్రముఖ చరిత్రకారిణి రొమెల్లా థాపర్ అభిప్రాయపడ్డారు.

వైకోమ్ సత్యాగ్రహం సమయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన బ్రాహ్మణాధిపత్య విధానాలు, వలస పాలకుల విభజించు, పాలించు విధానాలను గమనించిన పెరియార్ కాంగ్రెస్ పార్టీని 1925లో వీడారు. జాతీయోద్యమంలో పాల్గొంటూనే ఆనాటి సామాజిక పరిస్థితుల్లో అగౌరవంగా జీవిస్తూన్న అణగారిన కులాల ప్రజల, స్త్రీల హక్కుల కోసం స్వయం గౌరవ ఉద్యమాన్ని ప్రారంభించారు. స్వయం గౌరవ ఉద్యమం కుల ఆధారిత వివక్షను, బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేస్తూ, ప్రజలందరికీ సమాన హక్కులు, గౌరవాన్ని అందించే హేతుబద్ధ సమాజ స్థాపన లక్ష్యంగా పనిచేసింది. పెరియార్ ఎస్. రామనాథన్‌తో కలసి ప్రారంభించిన ఈ ఉద్యమం లక్ష్యాలలో కొన్ని....

– కులాన్ని పూర్తిగా రూపుమాపి అంటరానితనాన్ని అంతం చేసి అణగారిన వర్గాల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించాలి. ప్రతి వ్యక్తి తన హక్కులు, స్వాభిమానాన్ని తెలుసుకుని భయపడకుండా సమానత్వం కోసం నిలబడాలి. మనుధర్మ శాస్త్రానికి పోటీగా సమధర్మాన్ని ఈ ఉద్యమం ప్రతిపాదించింది.

– స్త్రీలూ పురుషులు సమానమేననీ, స్త్రీలపై అమలవుతోన్న అన్ని రకాల వివక్షలూ అణచివేతలని వ్యతిరేకిస్తూ స్త్రీలు నిలబడాలని వీరు ఆశించారు. స్త్రీలకు వారసత్వ హక్కు కోసం, వరకట్న దురాచారము, బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. పెళ్ళి, పిల్లల్ని కనటంలో నిర్ణయాలు తీసుకోగలిగే స్వేచ్ఛ స్త్రీలకుండాలని, ఆర్మీ వంటి సైనిక రంగాలలో యువతులకు స్థానం కల్పించాలని, బసివిని, దేవదాసీ వ్యవస్థలను రద్దుచేయాలని, ఏ ఆటంకాలు లేకుండా స్త్రీలకు చదువునందించాలని – ఇలా స్త్రీలు ఆత్మగౌరవంతో జీవించటానికి కావల్సిన హక్కులను సాధించుకునే లక్ష్యాన్ని ఈ ఉద్యమం ప్రకటించింది. దీనితోపాటుగా మతాలు, కులాలకు అతీతంగా అంటే కులాంతర, మతాంతర వివాహాలను మూఢాచారాలతో సంబంధం లేకుండా వ్యక్తిత్వాలను గౌరవించే పెళ్ళిళ్ళను ఈ ఉద్యమం ప్రోత్సహించింది. వీటితోపాటుగా స్త్రీలకు విడాకులు తీసుకునే హక్కును కూడా ప్రోత్సహించింది.

– మతాచారాల పేరుతో పెంచి పోషిస్తూన్న మూఢత్వం, అంధ విశ్వాసాలు, అశాస్త్రీయ భావాలను, మతాధికార బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని ఈ ఉద్యమం సవాలు చేసింది. తమ పేర్ల చివర పెట్టుకునే కులం తోకలను తీసివేయించింది. తార్కిక, తాత్త్విక ఆలోచనలను ఈ ఉద్యమం ప్రోత్సహించింది.

– సంస్కృతం, హిందీ భాషల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ ద్రవిడ భాషలను, ద్రవిడ సంస్కృతిని ప్రోత్సహించింది.

పెరియార్ ఈ ఉద్యమాన్ని మూఢత్వపు కూకటివేళ్ళను పెకలించే దిశగా నిర్వహించారు. ఆయన తన బాల్యం నుండీ కులవివక్షనూ మూఢాచారాలను, అహేతుక విషయాలను ప్రశ్నిస్తూ పెరిగారు. సామాజిక రుగ్మతలపై ఒంటరిగానైనాసరే నిరసనలు తెలియచేశారు. 1919లో జాతీయోద్యమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన విదేశీ వస్తువుల బహిష్కరణలో భాగంగా ఖద్దరు ధరించటాన్ని ప్రోత్సహించారు. తన ఇంట్లో ఎంతో విలువైన విదేశీ వస్తువులను తగులబెట్టారు. మద్యం మాన్పించటం కోసం కల్లు దుకాణాల ముందు పికెటింగ్‌లు తదితర కార్యక్రమాల్లో భాగంగా తన పొలంలోని తాడిచెట్లను నరికేయించారు. పెరియార్ భార్య నాగమ్మై నాయకత్వంలో కల్లు మాన్పించే ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. అంటరానితనానికి, కులవివక్షకు వ్యతిరేకంగా సమాజంతోనూ, కాంగ్రెస్ పార్టీతోనూ పోరాడారు. వేలాదిమంది ప్రజలను సమీకరించేవారు. వారందరికీ బానిసత్వానికి కారణం మతం, దేవుడేనని, దేవుడు పేరుతో జరుగుతున్న మోసాలను విప్పి చెప్పారు. దేవుడు లేడని ప్రజలను నమ్మించటం కోసం దేవుళ్ళ విగ్రహాలను చెప్పులతో కొట్టించారు. మనుధర్మశాస్త్రాలను, రామాయణాన్ని నడివీధుల్లో తగులబెట్టించారు. సమాజంలో పాతుకుపోయిన మూఢత్వాన్ని సమూలంగా రూపుమాపటానికి అంతే మొండితనంతో, దృఢంగా, పట్టువిడుపులు లేని కార్యక్రమాలను నిర్వహించారు.

స్వయం గౌరవ ఉద్యమాన్ని ప్రారంభించిన 1925లోనే 'కుడి అరసు' అనే పత్రికను ఆయన స్థాపించారు. ఆ పత్రిక ద్వారా ప్రజలకు సమకాలీన రాజకీయ, సామాజిక విషయాలను అందించారు. ఎస్. రామనాథన్‌తో కలసి కమ్యూనిస్టు ప్రణాళికను దక్షిణాది రాష్ట్రాలలో మొట్టమొదట తమిళంలోకే అనువాదం చేసి 'కుడి అరసు'లో ప్రచురించారు. అంతేగాక 'మతం గురించి లెనిన్' వ్యాసాన్ని ఏంగెల్స్ రాసిన కమ్యూనిజం ప్రాథమిక

సూత్రాలును, 'కారల్‌మార్క్స్ పూర్తి జీవిత చరిత్ర'ను, రష్యా విప్లవంపై వందల ఆర్టికల్స్‌ను 'కుడి అరసు'లో ప్రచురించారు. 'గాంధీ మరియు పెరియార్' వ్యాసాన్ని 1925లో 'కుడి అరసు' పత్రికలోనే ప్రచురించారు. ప్రముఖ రచయిత సుబ్రహ్మణ్య భారతి సంస్కృతం తమిళ భాషకు తల్లి లాంటిదనటాన్ని పత్రికాముఖంగా విమర్శించారు. ఉద్యమ కార్యకర్తలు ప్రతిరోజూ ఒక సమయంలో ప్రజలు సమూహాలుగా వుండే ప్రాంతాలలో బిగ్గరగా పత్రికను చదివి విన్పించేవారు.

తన భావజాల వ్యాప్తిలో భాగంగా పెరియార్ దేశంలోని ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోనూ పర్యటించారు. 1929 నుండి 1932 మధ్యలో యూరోప్ దేశాలను, సోవియట్ యూనియన్‌ను సందర్శించారు. సోవియట్ యూనియన్‌ని సందర్శించిన తర్వాత ఆయన తన ప్రసంగాలను కామ్రేడ్స్ అని సంబోధించటంతో ప్రారంభించారు. సామాజిక, సాంస్కృతిక రుగ్మతలకు, అసమానతలకు మూలం ఆర్థిక అసమానతలని గ్రహించారు. కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావిత మయ్యారు. ఆనాటికే రష్యాలో మార్క్స్, ఏంగెల్స్‌లు ప్రతిపాదించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అమలు చేయటంలో భాగంగా లెనిన్ మహిళల, అణగారిన వర్గాల ప్రజల, జాతుల విముక్తి కోసం ప్రతిపాదించి అమలు చేస్తున్న విధానాలను పెరియారు ఇక్కడ అన్వయిస్తూ స్వయంగౌరవ ఉద్యమాన్ని పటిష్టం చేశారు. సౌత్ ఇండియన్ లిబరేషన్ ఫెడరేషన్ పేరుతో 1916 నుండి వున్న సంస్థను 1938లో జస్టిస్ పార్టీగా నిలబెట్టారు. 1944లో ద్రవిడ కజగం పార్టీని స్థాపించారు. ఆ పార్టీ తమిళనాడు రాజకీయాలలో పీడితుల పక్షాన నిలవాలన్న ప్రభావాన్ని కలిగించింది. వ్యక్తిత్వాలను గౌరవించే పెళ్ళిళ్ళకు చట్టబద్ధత కల్పించింది. విడాకుల హక్కు చట్టాన్ని చేసింది. విద్య, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లను కల్పించింది.

బ్రిటీష్‌వారు స్వాతంత్ర్యాన్ని ప్రకటించటంపై కమ్యూనిస్టులతో పెరియార్‌కు అభిప్రాయ భేదాలు వున్నప్పటికీ 1949లో మద్రాసు ప్రెసిడెన్సీలో నెహ్రూ ప్రభుత్వం కమ్యూనిస్టులపై పెట్టిన నిషేధాన్ని ద్రవిడ కజగం తీవ్రంగా ఖండించింది. 1950 ఫిబ్రవరి 11న సేలం కేంద్రీయ కారాగారంలో తమను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని అడిగినందుకు 22 మంది కమ్యూనిస్టు ఖైదీలను కాల్చి చంపినందుకు నిరసనగా – కమ్యూనిస్టులకు సంఘీభావంగా రాష్ట్రవ్యాప్త సభను నిర్వహించారు. 'Materialism or Pragativad : the Perspective of Nirvana' అనే పుస్తకంలో పెరియార్ తన తాత్త్వికతను పొందుపరిచారు.

స్వయం గౌరవ ఉద్యమం డా॥ అంబేద్కర్‌తో సన్నిహితంగానూ, స్నేహపూర్వకంగానూ వుంది. 'కుడి అరసు' పత్రిక ద్వారా మహర్ సత్యాగ్రహం గురించీ, నాసిక్‌లోని కాలారాం దేవాలయ ప్రవేశ ఉద్యమం (1930) గురించిన వార్తలు ప్రచురించటం ద్వారా తమిళనాడుకు అంబేద్కర్‌ను పరిచయం చేశారు. హిందూమతాన్ని వీడతానన్న అంబేద్కర్ నిర్ణయాన్ని స్వయంగౌరవ ఉద్యమం బలపరిచింది. కాశ్మీరు సమస్యపైనా, అమెరికా పక్షం వహించడంపైనా అంబేద్కర్ భావాలతో పెరియార్ విభేదించారు.

అలుపెరగని కృషి చేసిన పెరియార్ 1879 సెప్టెంబర్ 17న ఈరోడ్, కోయంబత్తూరు జిల్లాలో జన్మించారు. 1973 డిసెంబరు 24న తమిళనాడులోని వెల్లూరులో మరణించారు.

ప్రజల దైనందిన సమస్యలకు పరిష్కారంగా ముక్తి మార్గం, మోక్షమార్గం అంటూ పరలోక భ్రమల్లో వుంచుతూ, దైవభక్తిని వరదలై పారిస్తూ బ్రిటిష్ వలస పాలకులకన్నా ఘోరంగా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల సేవకై సహజ వనరులను, శ్రమ సంపదను మన పరిపాలకులు కొల్లగొడుతున్నారు. కుల వివక్ష, మత విద్వేషాలు క్షణ క్షణ ప్రాణ గండంగా ఉన్నాయి. స్త్రీలపై అణచివేత, వివక్ష, లైంగిక దాడులకు అడ్డూ అదుపూ లేదు. విద్య, ఉపాధి, సేవారంగాలన్నీ ప్రైవేటుపరం అయిపోయాయి. పాలకుల పరాధీన సంస్కృతిని ఛేదిస్తూ ఐక్యంగా స్వయం గౌరవంతో నిలబడాల్సిన ప్రజలు సామ్రాజ్యవాద విషసంస్కృతి వేటుకి అస్తిత్వదారులై ముక్కలు చెక్కలవుతున్నారు. విషసంస్కృతి విసురుతున్న ఉరి వలల్లో చిక్కిన ప్రజలను బ్రతకటం కన్నా చావటమే మేలన్న నైరాశ్యం వైపు నెడుతున్నారు. స్వాభిమానం, స్వయంగౌరవాలకు స్థానమే లేకుండా చేస్తున్న ఈనాటి పరిస్థితుల్లో వందేళ్ళనాటి స్వయం గౌరవ ఉద్యమస్ఫూర్తిని స్వీకరించాలి.

## కృతజ్ఞతలు

ప్రజారచయిత బొల్లిముంత శివరామకృష్ణగారి పేరుతో ఏర్పడిన బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, తెనాలివారు డిసెంబర్ 6, 7 తేదీల్లో తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా 49 సంవత్సరాలుగా నిరంతరాయంగా వెలువడుతున్న 'ప్రజాసాహితి' పత్రికకు రూ. 25,000/- లు పురస్కారాన్ని ప్రకటించారు. దీనిని 6వ తేదీ సాయంత్రం పత్రిక ప్రధాన సంపాదకులు స్వీకరించి, ప్రసంగిస్తారు.

బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్‌కు 'ప్రజాసాహితి' కృతజ్ఞతలు.

## కృతజ్ఞతలు

జనసాహితి ఒకప్పటి కార్యవర్గసభ్యుడు, గాయకుడు
డి. గోవిందరాజులు, ఆయన సహచరి
జనసాహితి సభ్యురాలు డి. ప్రభావతి
ఈ సంచిక ముద్రణ ఖర్చుకై రూ. 20,000/-
ఆర్థిక సహాయం అందించారు.
వారికి 'ప్రజాసాహితి' కృతజ్ఞతలు తెలియచేస్తుంది.

# మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు పోర్న్ సైట్లు, బెట్టింగ్ యాప్‌ల వ్యసన వలయంలోకి విద్యార్థులను, యువతను లాగుతున్న వ్యవస్థీకృత దోపిడీ విధానాలు, విష సాంస్కృతిక విలువలపట్ల అప్రమత్తంగా వుండాలి

**మిత్రులారా!**

స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలు, ఐఐటీలు, మెడికల్ కాలేజీలు, లేబర్ అడ్డాలూ, సినిమా రంగాలు, చివరకు రకరకాల పండుగల కార్యక్రమాల వేదికలు.... స్థలం ఏదైనా, సందర్భం ఏదైనా కావచ్చు.... మత్తు, మాదక ద్రవ్యాల వ్యాపార కత్తివేటుకు బలికాని ప్రదేశమంటూ దేశంలో ఏదీ లేదు. ఈ దాడికి విద్యార్థులు, యువత, మహిళలు, పేదలు, ధనికులు ఎవరి స్థాయిలో వాళ్ళు బలి అవుతూనే వున్నారు. నిరంతర గమనింపు, తల్లిదండ్రుల అజమాయిషీ తక్కువగా వుండే అపరిమిత ధనవంతుల అధునాతన భవనాలు, అత్యంత దారిద్ర్యం తాండవించే శ్రమజీవుల కాలనీలే ఈ దందాకు ప్రధాన టార్గెట్లు. ఎక్కడైనా ఈ మత్తుకి, ఇతర వ్యసనాలకు, ఈ వ్యాపారాలకు యువతనే సులభమైన, బలహీనమైన పావులుగా మార్చుకోగలుగుతున్నారు. ఒకసారి ఈ ఉచ్చులో ఇరుక్కున్న తర్వాత ధనిక వర్గాలు, అధికారంలో వున్న వ్యక్తులు తమ వారిని బయటపడవేయగలుగుతారు. కానీ పేద వర్గాల విద్యార్థులు, యువత ఒకసారి ఈ విషవలయంలోకి జారితే జీవితాంతం తాము నరకయాతన అనుభవిస్తూ, తమ కుటుంబాల్ని దుర్భరంగా మార్చేస్తూ వుంటారు.

ఇటీవలి పరిణామాలను.... ముఖ్యంగా పిల్లలలో పెరుగుతున్న నేరస్థ స్వభావాలను, అలాగే పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను గమనిస్తే మాదకద్రవ్యాల ప్రభావం ఎదిగీ ఎదగని పిల్లలపై ఎంత ఎక్కువగా ఉందో అర్థమవుతుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) ఇటీవలే విడుదల చేసిన నేర గణాంకాల రిపోర్టు ప్రకారం పిల్లలపై 2023వ సంవత్సరంలో 1,77,335 నేరాలు నమోదయ్యాయి. ఇది 2022 సం.తో పోల్చుకున్నప్పుడు 9.2 శాతం ఎక్కువ. అలాగే పిల్లలే చేస్తున్న నేరాలు 31,365 కేసులుగా రిజిస్టరయ్యాయి. ఈ సంఖ్య గత సంవత్సరం కంటే మూడు శాతం పెరిగింది. ఈ విధమైన నేరాలు చేసే బాలల్లో ఎక్కువ సంఖ్యలో 16 నుండి 18 ఏళ్ల వయస్సు వారేనని గణాంకాలు చెబుతున్నాయి.

అలాగే వృద్ధులపై జరుగుతున్న అఘాయిత్యాలు 27,886 కేసులుగా నమోదయ్యాయి. అందులో ఎక్కువభాగం వారి కుటుంబాల్లోని పిల్లలే డబ్బుల కోసమో, లేదా ఇతర అవసరాల కోసమో వృద్ధులైన కుటుంబీకులను పీడిస్తూ జరిపిన హింసాకాండ లేనని సమాచారం. మరోవైపు దేశం మొత్తం మీద 1,71,418 ఆత్మహత్యలు రికార్డు కాగా.. అందులో 13,892 విద్యార్థుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇది మొత్తం ఆత్మహత్యలలో 8.1 శాతంగా వుంది.

2020-2025 సం.ల మధ్య నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (NCB) గణాంకాల ఆధారంగా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ జూలై 22, 2025న ప్రచురించిన ఒక రిపోర్టు ప్రకారం మన దేశంలో 10 నుంచి 17 సం.ల వయస్సున్న బాలలు దాదాపు 88 లక్షల మంది ఈ మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులలో చిక్కుకొని జైలు శిక్షలను అనుభవిస్తున్నవారేనని తెలుస్తున్నది. మనలాంటి దేశాలలో ఈ లక్షలమంది సహజంగా ఏ వర్గాల పిల్లలు జైళ్లలో మగ్గుతూ ఉంటారో వేరే చెప్పక్కరలేదు. అంటే ఉజ్వలమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయవలసిన విద్యార్థులు చదువుల ఒత్తిడితోనో, ఉపాధి లేమితోనో, దురలవాట్లతోనో అర్ధాంతరంగా తమ జీవితాల్ని అంతం చేసుకోవడమో, లేక జైళ్లలోనో గడిపే పరిస్థితులు దాపురించాయి.

NCRB రికార్డుల్లో మనకు దొరకని వివరాలేమిటంటే విజయవాడ అడ్రెస్‌కి చేరడంకోసం అదానీ సొంత పోర్టుకు షిప్‌లో చేరిన వందల టన్నుల మాదకద్రవ్యాల కేసు ఇప్పుడేమయ్యింది? ఆంధ్ర, తెలంగాణ, ఒరిస్సా బోర్డర్‌లో పండే గంజాయి చాక్లెట్ల రూపంలోకి మారి దేశంలోని స్కూళ్ళు, కాలేజీల బయట పాన్ షాపులలో విచ్చలవిడిగా ఎలా అమ్ముడవుతున్నాయి? పాలక, ప్రతిపక్ష నాయకుల, అధికారుల అండదండలు లేకుండానే ఇవన్నీ సజావుగా

సాగుతున్నాయా? అప్పుడప్పుడూ, అక్కడక్కడా డ్రగ్స్ పట్టుబడినట్టు, కొందరు బడాబాబుల పిల్లలు దొరికినట్టు పత్రికల్లో వార్తలొస్తాయి. కానీ ఎవరికైనా శిక్షలు పడ్డట్టు వార్తలెందుకు రావు? ఇలాంటి వివరాలు మనకి ఎక్కడా దొరకవు.

కోట్లాదిమంది నోటి క్యాన్సర్లకు కారణమవుతున్న గుట్కాల ఉత్పత్తిని ఆహారపదార్థం కింద చూపి, తీర్పులిచ్చే దేశంలో, వాటికి యాడ్స్ ఇచ్చే వాళ్ళు హీరోలుగా చలామణి అవుతున్న దేశంలో అంతకన్నా వివరాలు మనకు దొరకవు.

అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా రకరకాల మత్తు పదార్థాల ఉత్పత్తి, రవాణా, అమ్మకం పన్నుల పైన ఆధారపడ్డ దేశాల ఆర్థిక వ్యవస్థలలో ప్రజలకు గౌరవప్రదమైన జీవితాలు, జీవన భద్రతలు ఎక్కువగా ఆశించలేము.

రోజుకు 14 నుంచి 16 గంటలపాటు శారీరక, మానసిక శ్రమలు చేయించుకుని సారా బ్రాందీలతో బాధను మరచిపొమ్మని వారంతపు బార్ కల్చర్‌ని ప్రోత్సహిస్తున్న పెట్టుబడిదారీ లాభాల వ్యవస్థలో ఇవన్నీ మామూలు విషయాలుగా మార్చబడుతున్నాయి. సాఫ్ట్ వేర్ వంటి రంగాల్లో వేలాదిమందిని తొలగిస్తూ, పదిమంది చేసే మేధోశ్రమను ఒక్కరి చేత చేయించుకుంటూ లాభాలు గడించే కార్పొరేట్లు, మానసిక ఒత్తిడిని భరించడానికి ప్రాంతీయ, దేశీయ మత్తు పదార్థాలు సరిపోవనీ, అంతర్జాతీయ మత్తు పదార్థాలైన డ్రగ్స్‌కు దార్లు వేస్తున్నారు.

మెజారిటీ సినిమాల్లో చూపించే హీరోయిజం, విలనిజం మద్యం, మత్తు పదార్థాలతో ముడిపడే వుంటుంది. శ్రమ పట్ల, డబ్బు పట్ల, విశ్రాంతి పట్ల, మానవత్వం పట్ల కొత్త అభిప్రాయలు ఏర్పడేలా తమకనుకూలమైన దోపిడీ సాంస్కృతిక విలువల్ని సమాజంలోకి పాలకవర్గాలు తెస్తున్నాయి. ఐఐటిలు, డీమ్డ్ యూనివర్సిటీలలో ఎంతటి మానసిక ఒత్తిడినైనా తట్టుకొనేలా విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చారు. మనుషుల్ని యంత్రాలుగా భావించే కొన్ని సంస్థల్లో మాదకద్రవ్యాలకు అలవాటుపడాలంటూ పరోక్షంగా ప్రోత్సహిస్తున్న దారుణమైన స్థితి నేడుంది. ఈ పరిస్థితికి కారణమవుతున్న విద్యా విధాన లోపాలను ఆర్థిక, సాంస్కృతిక విధానాలను, వాటిని రూపొందిస్తున్న వారిని అసలు దోషులుగా చూడాల్సి వుంటుంది. లేకుంటే బాధితులే మారాలని కోరుకుంటూ వుంటాం. బాధితులను సంస్కరించడం చుట్టూనే చర్చ తిరుగుతూ వుంటుంది. అసలు దోషులు ఎవరనేది తెలియకుండా మరుగున పడుతుంది.

సమాజంలో నెలకొన్న అనేకానేక క్షీణ సాంస్కృతిక పరిస్థితులు కూడా ఈ దుస్థితికి దారితీస్తున్నాయి. మితిమీరిన హింస, స్త్రీలను లైంగిక వస్తువుగా చూపే సినిమాలు, కుటుంబ సభ్యుల మధ్యనే కుట్రలు కుయుక్తులను చూపించే టీవీ సీరియళ్లు, ఇంకా ద్వంద్వార్థాలతో, బూతులతో వెబ్ సిరీస్‌లు, పోర్న్ సైట్లు, జబర్దస్త్ కార్యక్రమాలు, బిగ్ బాస్ షోలు... ఇవి చాలవన్నట్టు ఐపీఎల్ వంటి ప్రోగ్రాములు, వాటి వేదికగా నడుస్తున్న బెట్టింగులు ... వీటన్నిటికీ తోడు జోరుగా నడుస్తున్న ఫ్రీ ఫైర్‌లు వంటి కృంగదీసే ఆన్లైన్ గేములు, బెట్టింగ్ యాప్‌లు యువత జీవితాలను సర్వనాశనం చేస్తున్నాయి. ప్రపంచీకరణకన్నా ముందే మాదకద్రవ్యాల ప్రపంచీకరణ ఎప్పటినుంచో సాగుతూ ఉంది. 'ఉడ్తా పంజాబ్' సినిమాలో లాగా మన రాష్ట్రాలు కూడా ఉడ్తా తెలంగాణా, ఉడ్తా ఆంధ్రప్రదేశ్‌లుగా మారడానికి ఎంతో సమయం పట్టేలా లేదు.

అమెరికాలోనైనా, ఆఫ్రికాలోనైనా, పంజాబ్‌లోనైనా, గోవాలోనైనా యువత ఖాళీగా ఉండబట్టే చాలా వ్యసనాలకు దగ్గరవుతున్నారని ప్రభుత్వాధికారులే సెలవిస్తుంటారు. కోట్లాది మందికి చేయటానికి తగిన పనులు లేకుండా చేసి ఖాళీగా ఉంచుతూ, వారిచేతికి ఆండ్రాయిడ్ ఫోను వచ్చేలా చేసిందెవరు? డేటాతో వ్యాపారాలు చేస్తూ కోట్లాది మంది యువతను డేటా సెంటర్లకు సెక్యూరిటీ గార్డులుగా మార్చుకో జూస్తున్నదెవరో విద్యార్థులకు, యువతకు స్పష్టత రావాలి. ఇటువంటి వాస్తవాలు పూర్తిస్థాయిలో అర్థంకాకుండా, వారు సంఘటితపడకుండా వుండేందుకే యువతపై మత్తు పదార్థాల దాడి జరుగుతున్నది.

ఈ క్షీణ సాంస్కృతిక విలువలకు, మద్యం, మాదకద్రవ్యాల వంటి మత్తు పదార్థాలకు, బెట్టింగులకు, రకరకాల వ్యసనాలకు యువత బానిసలుగా మారకుండా చైతన్యపరచాల్సిన బాధ్యత మనందరిది. ఆర్థిక సాంస్కృతిక దోపిడీ విధానాలకు, మత్తు పదార్థాలకు మధ్య వున్న విడదీయలేని సంబంధాన్ని వివరించి మన ముందు తరాలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిదీ.

కుటుంబాలకు, సమాజానికి వెన్నెముకగా నిలవాల్సిన యువత మాదకద్రవ్యాల మత్తులో నాశనం కాకూడదు. జరగబోయే పరిణామాలను, నష్టాలను ముందుగా సాహిత్య రూపాలలో చెప్పగల సాహితీ సాంస్కృతిక రంగాల కార్యకర్తలు, ఉపాధ్యాయులు, మేధావులు తమ కలాలు, గళాల ద్వారా చైతన్యం చెయ్యడానికి పూనుకోవాలి. విద్యార్థులను, యువతను చిన్న వయసులోనే పెద్ద లక్ష్యాలు ఏర్పరుచుకునేలా, నిజమైన సమాజపు అభివృద్ధికి ఉపయోగపడేలా చేయాలి. దేశాన్ని ప్రేమించడమంటే కులాలకు, మతాలకు అతీతంగా దేశంలోని మనుషులందర్నీ ప్రేమించడమనీ, శ్రమను గౌరవించడమనీ, అదే నిజమైన దేశభక్తి అని చాటాలి.

**23.11.2025**

**జనసాహితి**
**జంటనగరాల శాఖ**

సినిమా సమీక్ష

# 31వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

బాలాజీ (కోల్‌కతా)

**31వ** కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం నవంబర్ 6 నుండి 13 వరకు జరిగింది. ఈ ఉత్సవం కోసం మొత్తం 1827 సినిమాలు ఎంట్రీలుగా రాగా, 218 సినిమాలు ప్రదర్శన కోసం ఎంపికయ్యాయి. వీటిలో 43 పూర్తి నిడివి సినిమాలూ, 19 లఘుచిత్రాలూ, 10 డాక్యుమెంటరీలూ వివిధ విభాగాల్లో జరిగే అవార్డు పోటీల్లో పాల్గొన్నాయి. మిగతావి సాధారణ ప్రదర్శన కోసం ఎంపికయ్యాయి. నందన్ కాంప్లెక్స్‌తో కలిపి మొత్తం 21 థియేటర్లలో సినిమాల ప్రదర్శన జరిగింది. ఈ ఏడాది పోలెండును ఫోకస్ కంట్రీగా ఎంచుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత సినీ ప్రముఖులు రిత్విక్ ఘటక్, శ్యామ్ పెకిన్‌పా, రాజ్ కోస్లా, రిచర్డ్ బర్టన్, సలీల్ చౌదరీ, సంతోష్ దత్తాలకు శత జయంతి నివాళులర్పించారు. పునరుద్ధరించిన క్లాసిక్స్ విభాగంలో సత్యజిత్ రాయ్ 'అరణ్యేర్ దిన్‌రాత్రి', ప్రేమ్ కపూర్ 'బద్నామ్ బస్తీ', శ్రీలంక దేశపు 'ది గర్ల్స్' (దర్శకుడు సుమిత్రా పెరియాస్) సినిమాలు చూసే అవకాశం సినీ ప్రేమికులకు లభించింది.

ఇటలీ దర్శకుడు అలెగ్జాండ్ర సుకురోవ్ తను బ్రతికున్న కాలపు చరిత్రను రికార్డు చేసిన ఐదు గంటల నిడివి గల 'డైరెక్టర్స్ డైరీ' అనే డాక్యుమెంటరీని ప్రత్యేక ప్రదర్శన విభాగంలో ప్రదర్శించారు. బేదబ్రత పాయిన్ అమెరికా ఖండంలో 10,000 కిలో మీటర్ల యాత్రను జరిపి రైతుల పోరాటాలను చిత్రీకరించిన 'డెజా వూ' సినిమా చూసే అవకాశాన్ని కూడా ఈ విభాగం కల్పించింది. విస్థాపన, వలసలకు సంబంధించిన 'బియాండ్ బార్డర్స్: డిస్‌ప్లేస్‌మెంట్, మైగ్రేషన్' విభాగంలో చాలా మంచి సినిమాలు ప్రదర్శించారు. వీటిలో పాలస్తీనా, గాజాలకు సంబంధించిన మంచి సినిమాలున్నాయి. ఈ విభాగం కోసం తయారుచేసిన థీమ్ వీడియోను కూడా సత్యజిత్ రాయ్ కొటేషన్‌తో పాటు చాలా అర్థవంతంగా రూపొందించారు.

### ఉత్సవంలో అవార్డులు గెల్చుకున్న సినిమాలు :

క్యూబా సినిమా 'టు ది వెస్ట్ ఇన్ జపాటా' అంతర్జాతీయ సినిమాల పోటీ విభాగంలో ఉత్తమ సినిమాగా గోల్డెన్ రాయల్ బెంగాల్ టైగర్ అవార్డును గెలుచుకుంది. ఈ సినిమా దర్శకుడు డావిడ్ బిమ్ ఈ సినిమాను ఎనిమిదేళ్ల పాటు జాపాటాలోని జనావాసాల్లేని చిత్తడినేలలో షూటింగు చేసి నిర్మించాడు. మొసళ్ళూ, దోమలూ, ఇతర పరాన్నజీవులుండే బురదనీటి ప్రాంతమది. ఆ నేలలో మొసళ్లను వేటాడ్డానికి వెళ్తాడు లాండీ అనే పేదవాడు. ప్రాణాంతకమైన ఆ వేటను చిత్రీకరించడానికి అతనితో పాటు దర్శకుడు కూడా అతని వెంటే వుంటాడు. ఆటిజం బాధితుడైన తన కొడుకు పోషణ కోసం దొంగతనంగా మొసళ్ళ చర్మాన్ని అమ్ముకోవడం అతడి వృత్తి. కుమారుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఇంటికి వస్తాడో రాడో తెలియని తన భర్త కోసం ఎదురుచూస్తూ వుంటుంది అతడి భార్య మర్సిడీజ్. మర్సిడీజ్ అన్నది ఖరీదైన కారు పేరు. కానీ ఈ కథలోని మర్సిడీజ్ కటిక పేదరాలు. నలుపు తెలుపుల్లో తీసిన ఈ సినిమా వానాకాలపు ప్రకృతి అందాలనే కాదు, వానాకాలపు కష్టాలనూ చిత్రిస్తుంది. మనుగడ కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి ఒక పేదవాడు చేసే బ్రతుకు పోరును కళ్లకు కడుతుంది. 'రివర్‌స్టోన్' సినిమా కోసం అంతర్జాతీయ విభాగంలో ఉత్తమ దర్శకుడి అవార్డును గెల్చుకున్నాడు శ్రీలంక దర్శకుడు లలిత్ రత్నయాకె. ఇవాన్ జుకా నిర్మించిన 'బ్యూటిఫుల్ ఈవెనింగ్, బ్యూటిఫుల్ డే' సినిమాకు స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది.

భారతీయ సినిమాల విభాగంలో సిక్కిం సినిమా 'ది షేప్ ఆఫ్ మోమో' సినిమాకు ఉత్తమ సినిమా అవార్డు లభించింది. ఈ సినిమా దర్శకురాలు త్రిబేణీ రాయ్ కోల్‌కతాలోని సత్యజిత్ రాయ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లోనే సినీ నిర్మాణం నేర్చుకుంది. ఇదే మహా నగరంలో అవార్డు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆమె తన ఏక్సెప్టెన్స్ స్పీచ్‌లో చెప్పింది. ఈశాన్య భారత కొండల్లో స్త్రీల సామాజిక గుర్తింపు ఏమిటి అన్నది ఈ సినిమా కథాంశం. ఎంత చదివినా, ఉద్యోగానికి పోయినా 'గుండ్రటి మోమో'లు వండగలగటమే స్త్రీ కర్తవ్యం. గృహిణిగానే స్త్రీకి గుర్తింపు అన్న విధంగా సినిమాకు ఆ పేరు పెట్టింది దర్శకురాలు. ఈశాన్య భారతం నుండి వచ్చిన మరో సినిమా 'హా లింగ్కా నెంగ్' దర్శకుడు ప్రదీప్ కుర్బాకు ఉత్తమ దర్శకుడి అవార్డు లభించింది. చంద్రాశీస్ రాయ్ 'ఫోర్సీ' ఉత్తమ బెంగాలీ సినిమాగా, శివరంజని నిర్మించిన మళయాలం సినిమా 'విక్టోరియా' ఉత్తమ నెట్పాక్ ఆసియా సినిమాగా అవార్డులు దక్కించుకున్నాయి. లిటన్ పాల్ 'న్యింగ్మా – థ్రూ హెర్ ఐస్' ఉత్తమ లఘుచిత్రంగా ఎంపికైంది. రవికుమార్ 'సాంగ్స్

ఆఫ్ ది మిస్ట్', సిదిప్తా బరాయ్ 'అపర్థిబా' లఘుచిత్రాలకు స్పెషల్ జ్యూరీ అవార్డులు దొరికాయి. నటి బిజయ్‌లక్ష్మీ బర్మన్ జీవితంపై జొయ్‌దీప్ బెనర్జీ నిర్మించిన 'ది సాగా ఆఫ్ ఎ గ్లోరియస్ లైఫ్: బిజయ్‌లక్ష్మీ బర్మన్' సినిమాకు ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు లభించింది. ఈ విభాగంలో దేబలీనా మజుమ్దార్ 'జిలిపిబాలార్ బొంధురా', ప్రణబ్ జ్యోతి డెకా 'మై లాస్ట్ ఫేస్: కుంగ్‌బారా' డాక్యుమెంటరీలకు స్పెషల్ మెన్షన్ అవార్డులు అందాయి.

ఈ చలన చిత్రోత్సవంలో చూపిన కొన్ని మంచి సినిమాల గురించి కొంచెం వివరంగా చూద్దాం.

**ఆయిషా కాంట్ ఫ్లై ఎవే (ఆయిషా ఎగిరిపోలేదు)/దర్శకుడు : మొరాద్ ముస్తఫా/2025/ఈజిప్ట్/123 ని.:**

పంజరంలో బంధించిన పక్షి ఎగరలేదు. తనకు బయట విశాల ప్రపంచం కనిపిస్తూ వుంటుంది. రెక్కలు చాచి ఎగరాలనిపిస్తుంటుంది. కానీ పరిస్థితులు దాన్ని ఆ పంజరానికి కట్టిపడేసి వుంటాయి. సుడాన్ నుంచి ఈజిప్టుకు దొంగతనంగా వలసవచ్చిన పరిచారిక ఆయిషా. యూరప్‌లోని స్వేచ్ఛా వాతావరణంలోకి చేరే క్రమంలో ఆఫ్రికన్ వలసదారులకు మొదటి మజిలీ ఈజిప్టు దేశం. ప్రాణాలకు తెగించి దొంగదారిన ఈజిప్టు చేరిన వారికి అక్కడో అగ్ని పరీక్ష. భయంకరమైన పరిస్థితులతో ఆమె పోరాటం చేస్తూ వుంటుంది. ఒంటరి మగాళ్లకూ, ముసలివారికీ సేవచేసేటప్పుడు అవతలి వారికి అన్ని రకాలా సేవ చేయాలి. అధిక సందర్భాల్లో లైంగిక సేవలు కూడా అందించాల్సిన దుస్థితి. తన మనుగడ కోసం ఆమె ఒక ఈజిప్టు గ్యాంగ్ లీడర్‌తో ఒక ఒప్పందంలో ఉంటుంది. ఆమె తన ధనిక క్లయింట్ల ఇళ్ల నకిలీ తాళం చెవుల్ని అతడికి అందిస్తూ ఉండాలి. దానికి బదులుగా ఆమెకు ఒక ఒంటరి గదిలో ఉచితంగా ఉండనిస్తాడు అతడు. అవసర సమయాల్లో రక్షణ కల్పిస్తాడు. ఆయిషా ఒక ఈజిప్టు వంటవాడితో చనువుగా వుంటుంది. కానీ పెళ్లి వరకూ దారితీసే సంబంధం కాదది. అక్కడ అక్రమ వలసదారుల మీద నిత్యం కత్తి వేళాడుతూనే వుంటుంది. ఆయిషా కథను హృద్యంగా చెప్పడానికి దర్శకుడు మాత్రిక వాస్తవికతను సాధనంగా ఎంచుకున్నాడు. ఆయిషాకు వేళకాని వేళ ఒక నిప్పుకోడి తారసపడుతూ ఉంటుంది. ఆయిషా ఒంటరి వేళల్లో తన శరీరంలో వస్తున్న మార్పుల్ని గమనిస్తూ వుంటుంది. ఆమె శరీరంలో రెక్కలు మొలుచుకొచ్చే దశ మొదలౌతుంది. ఆమె తనకు తాను నిప్పుకోడిగా మారుతోందా? నిప్పుకోడి వడిగా దౌడు తీయగలదు కానీ ఎక్కడికైనా ఎగిరి వెళ్ళిపోలేదు. సరిగ్గా ఆయిషా పరిస్థితీ అదే. ఈ చిత్రోత్సవంలో ఎన్నో గొప్ప సినిమాలు చూసినప్పటికీ ఆయిషా విషాద గాథ మాత్రం ఎన్ని రోజులైనా మనసును వీడిపోవడం లేదు. బులియానా సైమోన్ ఆయిషా పాత్రలో లీనమైపోయింది. ఈ సినిమా కాన్ ఫెస్టివల్ అన్ సెర్టెన్ విభాగంలో ప్రదర్శితమై, కెమెరా డియోర్ కోసం నామినేట్ అయింది.

**మౌంటెన్స్ ఆఫ్ ఫైర్ (మండే కొండలు)/దర్శకుడు : జైరో బస్టమంటే/2025/గ్వాటెమాల/94 ని.:**

గ్వాటెమాల అగ్ని పర్వత ప్రాంతానికి సంబంధించిన కథ ఇది. లేక్ అటిట్లాన్ దగ్గర మాయన్ కమ్యూనిటీలో తన బాల్యాన్ని గడిపిన బస్టామంటే తన మూలవాసుల కోసం తపించి నిర్మించిన సినిమా ఇది. గ్వాటెమాలలో వ్యవస్థీకృత సినీ పరిశ్రమ లేదు. అందుకని 2012లో ఫిల్మ్ స్కూలును నిర్మించి 1,500 మంది స్థానికులకు నటనలో శిక్షణనిచ్చాడు ఈ దర్శకుడు. అలా వంద శాతం స్థానికులతో వారి మేలుని కాంక్షిస్తూ తీసిన సినిమా ఇది. మొదట్లో ఇది ఒక సామాజిక అవగాహనా ప్రాజెక్ట్‌గా మొదలై తర్వాత చలనచిత్రంగా రూపుదాల్చింది. కథ విషయానికి వస్తే మరియా, టటియానా అనే ఇద్దరు అగ్నిపర్వత శాస్త్రవేత్తలు పేలడానికి సిద్ధమౌతున్న అగ్నిపర్వతం గురించి స్థానికులకు ముందుగా హెచ్చరించి వారిని ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ ప్రభుత్వంలోని అవినీతిపరులూ, ప్రైవేటు పెట్టుబడిదారులూ కుమ్మక్కై తమ స్వార్థం మేరకు వ్యతిరేక ప్రచారం చేస్తుంటారు. ఫలితంగా మూలవాసులు సంశయంలో పడి ముంచుకు వచ్చిన పెను ప్రమాదంలో చిక్కుకుని చాలామంది సమిధలౌతారు. వాస్తవ చరిత్రను చూస్తే 2019లో గ్వాటెమాలాలో అగ్నిపర్వతం పేలినప్పుడు మూడు స్థానిక తెగలవారు లావా కింద ఖననమయ్యారు. ప్రమాదకర స్థలాల్లోని స్థానికుల భూముల్ని శాశ్వతంగా కొల్లగొట్టడం, వారిని నిర్వాసితుల్ని చేయడం, అగ్ని పర్వాతాల పేర టూరిజంని నడపడం ప్రైవేటు పెట్టుబడిదారుల వ్యూహాల్లో కొన్ని మాత్రమే. ఈ విషయాల్ని ఎండగట్టే సినిమా ఇది. ఈ సినిమాలో చూపిన అగ్ని పర్వతాల దృశ్యాల్లో 20 శాతం మాత్రమే కంప్యూటర్ ద్వారా సృష్టించినవనీ, మిగతావన్నీ గత 15 సంవత్సరాల్లో రికార్డు చేసిన వాస్తవ దృశ్యాలే అనీ దర్శకుడు ప్రెస్ మీట్‌లో చెప్పాడు.

**ఆఫ్రికా బ్లాంకా/దర్శకుడు : అజ్లారాబే అలౌయి/2025/ మొరాకో/100 ని. :**

బ్లాంకా అంటే తెలుపు. ఆఫ్రికా సమాజాల్లో నల్లని వారి మధ్య తెల్లని చర్మంతో పుట్టడం అరిష్టంగా భావిస్తారు. అలా పుట్టిన వారిని అల్బినోలంటారు. అల్బినో రక్తం తాగితే వ్యాధులు నయమవుతాయని స్థానిక మాంత్రికులూ, కొంతమంది సాధారణ ప్రజలూ నమ్ముతారు. ఎవరి ఇంట్లోనైనా అటువంటి బిడ్డ పుడితే రహస్యంగా ఉంచాల్సిందే. ఎప్పటికైనా ప్రమాదం పొంచి వుంటుంది. సెనెగల్ దేశపు ఓ గ్రామంలోని యువ అల్బినో ఊస్మానే. అతని తల్లి ఐచాటా అతడ్ని జాగ్రత్తగా కాపాడుకుంటోంది. ఓ రోజు ఊస్మానే రహస్యంగా జాతర చూడటానికి వెళ్లి ఇతరుల కంట పడిపోతాడు. దాంతో కష్టాలు మొదలౌతాయి. ఒక రోజు రాత్రి అతడ్ని తీసుకుపోడానికి స్థానిక మాంత్రికులు వారి ఇంటిపై పడతారు. 'తెల్లని సీతాకోకచిలుక' అని ముద్దుగా పిలుచుకునే తన బిడ్డ కోసం ఆ మాతృమూర్తి తన మాతృభూమిని విడిచి దొంగదారిన

యూరప్ ఖండానికి వెళ్లడానికి సిద్ధపడుతుంది. భయంకర ఎడారి ప్రయాణం, దారిదోపిడీ దొంగలు, ముళ్ళకంచెల్ని దాటడాలూ ...! మూడేళ్ల క్రితం 'మీ కెప్టెన్' అనే సినిమా ('అమేజాన్ ప్రైమ్'లో వుంది) ఇటువంటి ప్రయాణాన్నే చూపింది. సాటి మనుషుల్లోని విశాల హృదయాలనే కాక, క్రూరమైన ఉదాసీనతను కూడా చిత్రిస్తుంది ఈ సినిమా. కేవలం అల్బినిజం గురించే కాదు, మెరుగైన బ్రతుకు కోసం మానవులు వలసపోవడాన్ని కూడా తన సినిమా చర్చిస్తుందని దర్శకుడు ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. ఈ సినిమాలో నటింపజేయడానికి నిజమైన అల్బినోను ఎంపికచేసుకోవడం దర్శకుడికి చాలా కష్టమైంది. 'ఎక్కడికో తీసుకెళ్ళి అమ్మేస్తానని అల్బినోలు నన్ను అనుమానంగా చూశార'ని దర్శకుడు విలేకరుల సమావేశంలో చెప్పాడు.

**స్కేర్‌క్రో (దిష్టిబొమ్మ)/దర్శకులు : హౌచాంగ్ అల్లాహ్యారి, బాబాక్ బెహ్దాద్/2025/ఆస్ట్రియా/83 ని. :**

మంచి మనసున్న మసూద్ ఒక వీధి గాయకుడు. తన మిత్రుల బ్యాండ్‌తో కలిసి ఒక కచేరీ కోసం బయల్దేరాడు. ఓ రోజు వారు బస చేసిన గ్రామానికి దగ్గర్లోని వరి పొలంలో దిష్టిబొమ్మగా నిలబడి వున్న ఒక అమ్మాయిని చూస్తాడు. ఏమా కథ అంటూ ఆరా తీయడానికి పూనుకుంటాడు. ఆమె పేరు లిడా అనీ, ఆమె ఒక నర్తకి అనీ, ఆమె ఆర్మేనియా మూలానికి చెందినదనీ, ఆమె తండ్రి ఆమె నృత్యంపై ఆంక్షలు విధించడంతో ఆమె పట్టణంలోని తన ఇళ్ళు విడిచి పారిపోయిందనీ, అక్కడి గ్రామంలోని ఓ ముసలామె ఆమెను చేరదీసిందనీ వాకబు చేసి ఆ యువకుడు తెలుసుకుంటాడు. నర్తకిని నాట్యం చేయొద్దని అంటే దిష్టిబొమ్మగా మిగిలిపొమ్మని చెప్పడమే! అందుకే ఆమె ఆ విషాదాన్ని అధిగమించడానికి పొలంలో దిష్టిబొమ్మగా మారి పక్షుల్ని పారదోలడమే పనిగా పెట్టుకుంది. ఎవరు వారించినా వినదు. ఆరోగ్యం పాడుచేసుకుంటుంది. అసలు ఎగిరే పక్షుల రెక్కల కదలికలో కూడా ఆమెకు నాట్యం కనిపిస్తోంది. మసూద్ ఆమెను సైకియాట్రిస్టు దగ్గరికి తీసుకుపోయి నయం చేయించాలనుకుంటాడు. తరచూ లిడా స్మశానంలోని ఓ సమాధి దగ్గర కూర్చుని వుంటుంది. అక్కడ ఉన్న చాలా సమాధులు ఆర్మేనియా మూలాల వారివే. దర్శకుడు ఇరాన్, టర్కీ ఆర్మేనియా ప్రజల చరిత్రలోకి వెళ్తాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో 1915-23 మధ్య కాలంలో టర్కీ ఒట్టోమన్ సామ్రాజ్యం అర్మేనియన్ ప్రజలపై ఘోర మారణహోమం సాగించింది. ఆ సమయంలో చాలా మంది ఆర్మేనియన్లు ఇరాన్‌కు వలస వచ్చారు. అలా వచ్చిన వారు బ్యాలే నృత్యంతో సహా వివిధ రకాల కళలను ఇరాన్‌కు తీసుకొచ్చారు. లిడా అటువంటి కుటుంబంలోని మూడో తరానికి చెందిన యువతి. లిడా అమ్మమ్మ కాలంలో నాట్యంపై ఆంక్షలు ఉండేవి కావు. కానీ ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత నాట్యాన్ని నిషేధించారు. అదే లిడా విషాదానికి కారణమైంది. దర్శకుడు హౌచాంగ్ అల్లాహ్యారి తను స్వయంగా సైకియాట్రిస్టు కావడం వలన తన దగ్గరికి వచ్చే రోగుల కథల ఆధారంగా సినిమాలు నిర్మిస్తుంటాడు.

**ఇవాక్యుయేషన్ (తరలింపు)/దర్శకుడు : ఫర్ఖాత్ షరిపోవ్/2025/కజకిస్తాన్/80 ని. :**

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతోంది. నాజీ దాడుల నుండి కాపాడ్డానికి సోవియట్ సేనలు ప్రజలను తూర్పు ప్రాంతాల వైపు తరలిస్తున్నారు. అలా తరలించిన వారి సంఖ్య అక్షరాలా 15 లక్షలు. వారిలో చాలా మంది ఇప్పటికీ కజకిస్తాన్‌లోనే ఉన్నారు. తరలిస్తున్న వారిలో నటాలియా, ఆమె కుమార్తె గాల్యా కూడా ఉన్నారు. ఒక రైల్వే స్టేషన్లలో జరిగిన గందరగోళంలో నటాలియా తన కుమార్తెను కోల్పోతుంది. కుమార్తె కోసం ఆ మాతృమూర్తి ఆవేదన, అన్వేషణే మిగతా కథ. యుద్ధం సాధారణ మానవుల జీవితాలను ఎలా అస్తవ్యస్తం చేస్తుందో తెలిపే హృద్యమైన కథ. కజకిస్తాన్, రష్యా దేశాల్లో ఆరేళ్ల పాటు ఈ సినిమాను చిత్రీకరించారు.

**ప్రామిస్డ్ స్కై (వాగ్దానం చేసిన విశాలాకాశం) / దర్శకుడు : ఎరిగే సెహిరి/2025/ఫ్రాన్స్/92 ని. :**

మాజీ జర్నలిస్ట్, ఐవోరియన్ పాస్టరైన మేరీ తన ట్యునీషియా ఇంటిని వలసవచ్చిన వారికి ఆనందాశ్రమంగా మార్చింది. మెరుగైన జీవితం కోసం కలలు కంటూ తన బిడ్డతో పాటు వచ్చిన నానీ, గంపెడాశలు పెట్టుకున్న తన కుటుంబం కోసం చదువు కొనసాగిస్తున్న విద్యార్థిని జోలీ ఆ ఇంట్లో ఉంటారు. తన ఇంటి యజమానిని కూడా మభ్యపెడుతూ శరణార్థులను ఆదుకోడానికి ప్రయత్నిస్తుంటుంది మేరీ. వారి మధ్యలోకి 4 ఏళ్ల అనాథ కెంజా చేరుతుంది. మధ్యధరా సముద్రంలో శరణార్థుల ఓడ మునిగిపోగా ప్రాణాలతో బయటపడింది ఆ పాప. ఆ పాపను ఆ ఇంట్లోని అందరూ ఆత్మీయంగా చూసుకుంటారు. ట్యునీషియా అధికారులకు విషయం తెలిసి ఆ పాపను శరణార్థి శిబిరానికి పంపిస్తారు. ఆ ఇంట్లోని ముగ్గురూ ఆ పాపను తమ దగ్గరికి తెచ్చుకుందామని పరితపిస్తారు. చట్టపరమైన పత్రాలు లేకుండానే ప్రయత్నాలు జరిపి మొదటికే మోసం తెచ్చుకుంటారు. సబ్-సహారా వలసదారుల బ్రతుకుపోరును చిత్రించే ఈ సినిమాను కాన్ అన్ సెర్టైన్ రిగార్డ్స్ విభాగంలో ప్రదర్శించారు.

**మదర్ (దర్శకత్వం : టియోనా స్ట్రుగర్ మిటేవ్స్కా/2025/బెల్జియం/77 ని.) :**

మదర్ థెరిసా జీవితంలోని నిర్ణాయక ఘట్టానికి సంబంధించిన కథ. 1948, కలకత్తా ఎంటలీలోని లోరెటో సిస్టర్స్ కాన్వెంట్‌లో మదర్ సుపీరియర్‌గా కొనసాగుతోంది మదర్ థెరిసా. తన వారసురాలు కావాల్సిన ఒక సన్యాసిని గర్భవతి అయిందనీ, గర్భస్రావాన్ని కోరుకుంటోందనీ తెలిసి చలించిపోతుంది. మత విశ్వాసానికీ, మాతృత్వాన్ని కోల్పోతున్న సాటి స్త్రీ ఆవేదనకూ మధ్య నలిగిపోయిన మదర్ యాతనను నటి నూమి రాపేస్ చాలా అద్భుతంగా కనపరిచింది. ఈ మనోవేదన తరువాత మదర్ ఆ మొనాస్టరీని విడిచి, తనదైన

మిషనరీస్ ఆఫ్ ఛారిటీని స్థాపించి, వేలాది మంది కుష్టురోగులకూ, అభాగ్యులకూ 'అమ్మ'గా మారింది.

**చోపిన్, ఎ సొనాటా ఇన్ పారిస్ (దర్శకత్వం: మిచల్ క్విసిన్స్కి/2025/పోలాండ్/133 ని.)**

పియానో పోయెట్‌గా పేరుగాంచిన ప్రసిద్ధ సంగీతకారుడి జీవితంపై వచ్చిన సినిమా. పారిస్‌లోని సంపన్నులకూ, ఫ్రెంచి రాజుకూ ప్రీతిపాత్రుడైన చోపిన్ టీబీ కారణంగా ఆరోగ్యం క్షీణిస్తున్నా దాన్ని దాచిపెట్టుకుని అరుదైన బాణీలను రూపొందించిన వైనాన్ని చూపిన దృశ్య కావ్యం ఈ సినిమా.

పోలండుకు చెందిన మరో ముఖ్యమైన సినిమా **'ఫ్రాంజ్' (దర్శకత్వం : అగ్నిస్కా హాలండ్).** 'మెటామార్ఫసిస్' వంటి రచనలతో ప్రపంచ ప్రఖ్యాత నవలాకారుడిగా నిలిచిన ఫ్రాంజ్ కాఫ్కా జీవిత చిత్రణ ఈ సినిమా. తన కొడుకు ఇన్సూరెన్సు కంపెనీలో రాణించాలని చండశాసనుడైన అతని తండ్రి కోరుకుంటున్నాడు. తనకు మాత్రం రచయితగా ఎదగాలని ఉంది. తన మిత్రుడు, ప్రచురణకర్త మాక్స్ బ్రాడ్ సహకారంతో కాఫ్కా ప్రపంచ ప్రసిద్ధ రచయితగా ఎలా ఎదిగాడో ఈ సినిమా చూపుతుంది. ఇతడు కూడా టీబీ కారణంగా 40 ఏళ్ల ప్రాయంలోనే కన్నుమూశాడు.

**'అన్‌మోల్' (దర్శకత్వం: ప్రియాంక ఎస్ సాహా/2025/99 ని.)**

కొత్త జంట పిల్లల కోసం ఎన్నో కలలు కంటారు. కానీ పుట్టిన బిడ్డ థర్డ్ జెండర్‌కు చెందితేనో! ఈ విషయాన్ని చర్చించే హృద్యమైన హిందీ సినిమా ఇది. ఇవే కాకుండా ఒక జానపద సంగీత పరిశోధకుడిపై వచ్చిన **'ఓజే'**, ఇటలీ దేశ అధ్యక్షుడి చివరి రోజుల్ని వర్ణించిన **'లా గ్రాజియా'**, **'87 రూపాయల ఇంకు పెన్ను'** అన్న మరాఠీ సినిమా, పాలస్తీనా, గాజా, లెబనాన్ దేశాల సమకాలీన చరిత్రను రికార్డు చేసిన **'పాలస్తీనా 36'**, **'అల్ అవ్దా'**, **'పాసింగ్ డ్రీమ్స్'**, **'టేల్స్ ఆఫ్ ది వూండెడ్ ల్యాండ్'** వంటి ఎన్నో ముఖ్యమైన సినిమాలను చూసే అవకాశం కల్పించింది 31వ అంతర్జాతీయ కోల్‌కతా చిత్రోత్సవం. ✣

కవిత

# గుంతల రహదారులు - వంచనల వీధులు

– పసిడిమొగ్గ మోహనరావు

రోడ్లు గుంతలతో నిండాయి -
అవి నేతల ఆలోచనల్లో నిండిన అవినీతి ఆనవాళ్లు!!!

ప్రతీ గుంత ఒక అవినీతి కుంభకోణం!!
ప్రతీ అవినీతి -
పీడితుడి రక్త సాక్ష్యం.

గుంతల్లో పడిపోయింది కేవలం వాహనం కాదు,
ప్రజాస్వామ్య ప్రగతి చక్రం!

పశువులు వీధుల్లో విచ్చలవిడి వీరంగాలు!!
మన ఏలికల
విజయ ప్రకోప విహారాల్లా!!

ప్రజల రక్తంతో కట్టిన వీధులివి!!
ప్రమాదాల పుట్టిళ్లు!!

వీధుల్లో గ్రామసింహాలు!!
నగర జీవన నిశ్శబ్దాన్ని కండలుగా చీల్చుతున్నాయి!!

అధికారుల నిర్లక్ష్యం -
ప్రజల ప్రాణాలకు రాబీస్!!

వేల మొరల వెనుక
పురపాలక జీవకారుణ్య మౌన భవనం!!

ఆత్మరహిత శవాల కుళ్లిపోతున్న వ్యవస్థ!!
క్యాపిటలిజం మురుగు వాసన అది!!

నాలుగు రోడ్ల కూడళ్ళు -
పాలక వర్గాల చతుర్ముఖాలు!
రెడ్ లైట్ కేవలం రంగు కాదు
న్యాయం ఆగిపోయిన సూచిక!

వ్యవస్థే దారితప్పి
ధర్మం దిక్కు తప్పి
న్యాయం చలానాల్లో
మూడు పువ్వులూ - ఆరు కాయలు!!

గుంతల రహదారులు
నయ వంచక గాథల సంకలనాలు!
సివిక్ స్లేవుల త్రిశంకు నరకాలు!!

పరిష్కారం
గుంతలు పూడ్చడంలో కాదు!
వ్యవస్థల పునర్నిర్మాణంలో ఉంది. ✣

# జనసాహితి కార్యవర్గ తీర్మానాలు

## విజయవాడ 'ప్రజాసాహితి' పత్రికా కార్యాలయంలో 16-11-2025న సమావేశమైన కార్యవర్గం చేసిన తీర్మానాలు

### పౌర గ్రంథాలయాలను పరిరక్షించుకుందాం!

కారు చీకటిలో కాంతి రేఖలా, విషసంస్కృతి, సంప్రదాయాల ఊబి నుండి యువతను, దేశాన్ని బయటపడవేసే సామాజిక సాధనంగా ఉండాల్సిన గ్రంథాలయాలు నేడు అనేక అవస్థలతో కునారిల్లుతున్నాయి. చాలాచోట్ల గ్రంథాలయాధికారులు రెండు మూడు గ్రామాల తాలూకా గ్రంథాలయాలను పర్యవేక్షిస్తున్న పరిస్థితి చాలా కాలం నుంచి కొనసాగుతోంది. ఇక గ్రంథాలయాలు చాలా మటుకు శిథిలావస్థలో ఉండి, తిరిగి ముద్రణకు నోచుకోక అమూల్య గ్రంథాలు చెదల పాలవుతున్నా కాపాడుకోలేని నిస్సహాయ స్థితిలో గ్రంథాలయాలున్నాయి. ఇటువంటి పరిస్థితులలో ఎటువంటి జ్ఞానము లేక, చదివిన చదువులో సారం లేక, చేసేందుకు పని లేక– పేదరికపు జీవిత వాస్తవాల మధ్య బాలలు, యువత నలిగిపోతున్నారు. ఈ దిక్కుతోచని స్థితిలో మాదకద్రవ్యాల, మత్తు పానీయాల వెంబడి కొట్టుకుపోతున్నారనేది ఒక చేదు వాస్తవంగా ఉంది. జాతికి జవజీవాలనందించే గ్రంథాలయాలను కాపాడుకోవాలని, వాటికి తగిన నిధులను సమకూర్చి, ఉన్న గ్రంథాలయాలను కాపాడుకోవడంతో పాటుగా, ప్రజలకు అవసరమైనన్ని గ్రంథాలయాలను అందుబాటులోకి తేవాల్సిందిగా ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను జనసాహితి డిమాండ్ చేస్తున్నది.

### ఉపాధినివ్వని, పర్యావరణహితంగాని డేటా సెంటర్లను తిప్పికొడదాం

వేలాది సంవత్సరాల మానవజాతి ఆలోచనల మధనతో, శ్రమ క్రమంలో ఆవిష్కృతమైన ఇంటర్నెట్, వారి శ్రమను తగ్గించి, సంతోషకరమైన జీవితాన్ని గ్యారంటీ చేయాల్సి ఉంది. కానీ బహుళజాతి కంపెనీల కబంధ హస్తాలలో సాంకేతికతను బంధించి, అర్ధఫ్యూడల్ అంధ విశ్వాసాలను ఒకవైపు, సామ్రాజ్యవాద పోర్న్ విషసంస్కృతి – వస్తు వ్యామోహ సంస్కృతులను మరోవైపు వ్యాప్తి చేయడానికి ఇంటర్నెట్ ను వినియోగిస్తున్న పాలకవర్గాల కుట్రలను ఖండిస్తున్నాం. ఈ వేలం వెర్రిని ప్రోత్సహించడమేకాక, ఉపాధి కల్పన అనే అబద్ధం చాటున బహుళజాతి కంపెనీల ఈ వ్యాపారం కోసం, ఇప్పటికే కొరతగా ఉన్న విద్యుత్తునూ, నీటినీ ఈ దేశ ప్రజలకు మరింత దూరంచేసి బడా కార్పొరేట్ కంపెనీల డేటా సెంటర్లకు కేటాయించడమే కాక, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని రాయితీలుగా ఇచ్చి డేటా సెంటర్లను ప్రోత్సహించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. కేవలం కొన్ని వందల ఉద్యోగాలు మాత్రమే కల్పించగల ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఉద్యోగాలు వస్తాయని పాలకులు చేస్తున్న మోసపూరిత ప్రచారాన్ని త్రిప్పికొట్టాలనీ, ఈ దేశపు నిరుద్యోగ సమస్య నిజంగా పరిష్కారం కావాలంటే శ్రమ సాంద్ర వ్యవసాయధార పరిశ్రమల కోసం డిమాండ్ చేయాలనీ యువతకు పిలుపునిస్తున్నాం.

### పిపిపి పద్ధతి ద్వారా వైద్య విద్యను ప్రైవేటీకరిస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకిద్దాం!

విద్యను వ్యాపారంగా కాక సామాజిక బాధ్యతగా భావించి మొత్తం విద్యారంగానికి సంపూర్ణ బాధ్యత వహించాల్సిన పాలకులు 1980లలో ప్రాథమిక విద్యతో మొదలుపెట్టి క్రమంగా తమ బాధ్యత నుంచి వైదొలగుతూ ఉన్నారు. ఇందులో భాగంగానే గతంలో ఉన్నత విద్యలో ప్రైవేటు సంస్థలు పెట్టుబడి పెట్టి లాభాల వేట సాగించడాన్ని ఫీజు రీ ఏంబర్స్ మెంట్ పేరుతో ప్రోత్సహించారు. ఇప్పుడు వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (PPP) పేరిట ప్రభుత్వ వనరులనే వినియోగించుకుని ప్రైవేటు సంస్థలు లాభాలు గడించే పద్ధతిని ముందుకు తెస్తున్నారు. దేశంలో శ్రామిక కుటుంబాలు అప్పులపాలు కావడంలో, ఆత్మహత్యలకు గురికావడంలో వ్యవసాయం, చేనేత లాంటి ఉపాధి రంగాల వైఫల్యంతో పాటు విద్య, వైద్యం మీద పెడుతున్న ఖర్చులే సింహభాగం ఉంటున్నాయి. ఈ PPP పద్ధతి వల్ల చదువుల ధరల భారం పెరగడమే కాక. ఇలా కోట్లు ఖర్చు పెట్టి చదివిన డాక్టర్లు భవిష్యత్తులో వైద్య వ్యాపారులుగా తయారై సామాన్యుడికి అందని ద్రాక్షగా వైద్యాన్ని మార్చే ప్రమాదాన్ని గుర్తించాలనీ, విద్య వైద్య రంగాలలో ఇలాంటి వ్యాపార దోరణులను తిరస్కరిస్తూ, ఈ రెండురంగాలనూ పూర్తిగా

ప్రభుత్వ రంగంలో నిర్వహించేలా పాలకులపై ఒత్తిడి తీసుకురావలనీ ప్రజలకు, ప్రజాతంత్రవాదులకు పిలుపునిస్తున్నాం.

## పాలస్తీనా శాంతి ఒప్పందం ఒక బూటకం

ట్రంప్ గోబెల్ కీర్తి కండూతిని సంతృప్తిపరచడానికి తప్ప, నిజంగా శాంతిని సాధించే ఉద్దేశ్యం లేని ఒక ఒప్పందాన్ని పాలస్తీనా ప్రజలపై రుద్దడం జరిగినది. ఈ ఒప్పంద షరతుల్లో భాగంగా పీకలదాకా సాయుధమై వున్న ఇజ్రాయిల్ నెతన్యాహు ప్రభుత్వాన్ని విడిచిపెట్టి హమాస్ దగ్గర ఆయుధాలు ఉండరాదనే షరతు, నిబంధన అర్ధరహిత మైనది. ప్రపంచ గూండాకి ఎడమ చేయి లాంటి ఇజ్రాయెల్ పొరుగున ఉంటున్న పాలస్తీనా ప్రజలని నిరాయుధం చేయడమంటే, అరబ్ జాతి నిర్మూలనకి దారులు వేయడమే. మాతృభూమిలోనే కాందిశీకులుగా బ్రతుకుతున్న పాలస్తీనీయులని రాజకీయంగా, సైనికంగా ఇజ్రాయెల్ లాంటి క్రూర పాలకుల దయా దాక్షిణ్యాలకు వదిలివేసే ఒప్పందాన్ని పునఃసమీక్షించి, పాలస్తీనీయులు ఆత్మగౌరవంతో బ్రతికే, స్వతంత్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఇచ్చే పరిష్కారం కోసం అంతర్జాతీయ సమాజం కృషి చేయాలనీ, అందుకోసం అన్ని దేశాల ప్రజలూ తమతమ పాలకులపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది, అలాంటి సంఘీభావ ఉద్యమంలో భారత ప్రజలు భుజం కలపాలని జనసాహితి కోరుతుంది.

## పాలకవర్గాల వంచనా శిల్పమే భక్తి పరిశ్రమ

ఇటీవల ఆంధ్రరాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను స్వయంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ఒక ప్రభుత్వ రాజపత్రాన్ని విడుదల చేసింది. మతపరమైన కుంభమేళాలు, పుష్కరాలు, వీటికి సంబంధించిన కార్యక్రమాలలోనూ; బాబాలు, స్వాములు, అమ్మలు, అఘోరాలు – వీళ్లకు సంబంధించిన కార్యక్రమాలలోనూ ప్రభుత్వాలు భాగస్వాములు కావడం, స్వయంగా నిర్వహించడం, రాజ్యాంగ బద్ధమైన లౌకిక సూత్రాన్ని రద్దు చేయడంగానే భావించాలి. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మరీ ఆ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రశ్నార్థకం చేస్తున్న పరిపాలన సాగుతున్నది. ప్రజలు భక్తి కారణంగా చనిపోవడం “దైవ చర్యగా” ప్రచారం చేయడం, ఘోరమైనటువంటి వంచనా శిల్పం. తమ జీవన సమస్యలకు దిక్కులేనివాళ్లకు దేవుడే దిక్కు అన్నట్టుగా దేవాలయాలకు, పుణ్య తీర్థాలకు, హజ్ యాత్రలకు, హరిద్వార్ యాత్రలకు, కేదార్నాథ్ యాత్రలకు వెళ్తూ సామాన్య ప్రజానీకం పిట్టల్లా దారి పొడుగునా రాలిపోతున్న సంఘటనలు ఇటీవల చాలా ఎక్కువయి పోయాయి. భక్తిమత్తులో ప్రజల్ని ఎల్లకాలం ఉంచలేరు అన్న సత్యాన్ని, చరిత్ర పొడవునా చెలరేగుతున్న ప్రపంచ ప్రజా ప్రతిఘటన పోరాట ఉద్యమాలు నిరూపిస్తూనే ఉన్నాయి. ప్రజల ఈతిబాధలకు, ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలని జనసాహితి డిమాండ్ చేస్తోంది.

## ప్రజాజీవితాన్ని ప్రమాదమయం చేస్తున్న ప్రభుత్వ విధానాలు

ఈ మధ్య కాలంలో సహజంగా వృద్ధాప్యం వల్ల చనిపోయిన వారికంటే, ప్రమాదాల వల్ల చనిపోతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. రోడ్లను సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల వచ్చే ప్రమాదాలు. కాలం చెల్లిన బస్సుల వల్ల ప్రమాదాలు. రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, ఏదో ఒక ప్రమాదం గురించి రోజూ వింటున్నాం. ప్రజల అమాయకత్వం వల్ల, గుడుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల అతి దుర్మార్గంగా ప్రజల మృత్యుపాలవుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదు. ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమే. ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సహేతుకమైన, శాస్త్రీయ పద్ధతిలో ప్రజా జీవితాలు ప్రమాదాలు పాలు కాకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను జనసాహితి డిమాండ్ చేస్తుంది.

## ఎన్నికలను ప్రహసనంగాను, ఓటును కొనుగోలు సరుకుగాను మార్చిన భారత కేంద్ర–రాష్ట్ర పాలకవర్గాలు!

78 ఏళ్ల స్వతంత్ర దేశంగా 75 ఏళ్ల సర్వసత్తాక ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా చెప్పుకుంటున్న భారతదేశంలో ఎన్నికల వ్యవస్థ ఒక ప్రహసనంగా (farce) మారింది. స్వతంత్రంగా ఎన్నికలను నిర్వహించవలసిన ఎన్నికల సంఘం ఏలికల జేబు సంస్థగా మారిపోయింది. తనపై వచ్చే ఆరోపణలకు సమాధానం చెప్పే బాధ్యత కూడా వదిలేసుకుంది. ఓటర్ల జాబితాలను అనుమానాస్పదంగా మార్చివేశారు. ఓటర్లు జాబితాలో కన్నా ఎక్కువ ఓట్లు పోయినట్లు, దొంగ ఓట్లు నమోదయినట్లు, నిజమైన ఓటర్లను జాబితాల నుండి తొలగిస్తున్నట్లు స్పష్టంగా రుజువుపరిచి ప్రశ్నించినా జవాబుదారి కనపడటం లేదు. స్వతంత్ర కేంద్ర పాలక వ్యవస్థలుగా చెప్పుకునే సంస్థలు అధికార పార్టీ ఆదేశాలతో పని చేసేవిగా రూపొందాయి.

ఇది ఇలా ఉండగా ఎన్నికల ముందు పనిగట్టుకుని మత విద్వేషాలు, ఉన్మాదాలు సృష్టించటం ఒక అలవాటుగా తయారయింది. అందుకు టెర్రరిస్టు చర్యలను కూడా వాడుకుంటున్నారు.

కాలం చెల్లిన ఫ్యూడల్ వ్యవస్థకు పుట్టిన ‘కులం’ ఆధునిక ప్రజాస్వామ్య ప్రక్రియగా చెప్పుకునే ఎన్నికలకు తప్పనిసరైన ఆలంబనగా మారింది. ఒక్క బీహారే కాదు దాదాపు దేశం దేశమంతా ముందు వెనకగా అలాగే తయారవుతోంది. నోట్లు పంచి ఓట్లు పొందే ప్రక్రియ ఎప్పుడో మొదలైనా, ఈ శతాబ్దంలో చట్టబద్ధంగా అధికార పార్టీలు ఓట్లు కొనే ప్రక్రియను చేపట్టాయి. వాటికి ఉచితాలు, పథకాలు అని పేరు పెడుతున్నారు. బీహార్‌లో ఒకనాటి సోషలిస్టుగా పేరు ప్రతిష్టలు పొందిన నితీష్ కుమార్ ప్రభుత్వం, ఎన్నికలకు ముందు లక్షల కుటుంబాల మహిళలకు పదివేల రూపాయల చొప్పున సహాయం

పేరిట బ్యాంకు ఎకౌంట్లో ఉచితంగా డబ్బులు పడేటట్లు చేసింది. ఎన్నికలలో నేరస్తులకు సీట్ల పంపిణీ చేయడం, మద్యం వినియోగం, మత్తు పదార్థాల (డ్రగ్స్)వాడకం విపరీతమైంది. ఎన్నికల ద్వారా సామాజిక న్యాయం అంటే ఆయా కులాలలో వివిధ చౌకబారు పద్ధతులలో సంపన్నులుగా ఎదిగిన పై శ్రేణి నడుమ వాటాల పంపకంగా మార్చేశారు. మైనారిటీలను ఎన్నికల పావుల్ని బలి పశువుల్ని చేసి ఆడుకుంటున్నారు. ఫాసిస్ట్ తరహా పరిపాలన నడుమ ఎన్నికలను ప్రహసనంగా మార్చారు. వీరి తరహా ఎన్నికల విధానం మీద ప్రజలకు నమ్మకాలు పోతున్నాయి. సామాజిక ఉద్యమాల ద్వారా తప్ప తమ హక్కులను సాధించుకోలేని స్థితికి ప్రజలను నెడుతున్నారు. కుహనా ప్రజాస్వామిక ప్రక్రియగా ఎన్నికలను దిగజార్చిన పాలకులే ప్రజలకు పోరాట మార్గం తప్ప మరో దిక్కులేని పరిస్థితిని కల్పిస్తున్నారు. ఈ పర్యవసానాలను అర్థం చేసుకొని రచయితలు కళాకారులు ప్రజలకు వారి ఉద్యమాలకు అండదండలుగా నిలవాలి పాలకవర్గాల పార్టీల బూటకపు ఎన్నికల ప్రక్రియను ఎండగట్టాలి. స్వేచ్ఛగా ప్రజలు ఎన్నికలలో పాల్గొనగలిగే వాతావరణనికై డిమాండ్ చేయాలి.

## టెర్రరిజాన్ని పెంచి పోషిస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకిద్దాం!

సామ్రాజ్యవాదం యుద్ధాలను ప్రోత్సహిస్తూ తమ ఆయుధాల వ్యాపారం చేసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లే, టెర్రరిజాన్ని కూడా పెంచి పోషిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చిన్న ఆర్థిక వ్యవస్థలు గల బలహీన దేశాలను దోచుకోవడానికి, ఆ ప్రజల మధ్య అనైక్యతను సృష్టించటానికి మతతత్త్వ ఆధారిత టెర్రరిజాన్ని పెంచి పోషిస్తుంది. తమ అణిచివేతకు, వెనుకబాటుతనానికి, నిరుద్యోగానికి అన్యమతస్తులు ముఖ్యంగా మైనారిటీలు కారణంగా చూపుతున్నారు. ఈ టెర్రరిజం బారినపడిన ప్రజలు ప్రధానంగా మహిళలు, యువత, చిన్నారులు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా నాశనమవుతున్నారు. పాలకుల సామ్రాజ్యవాద అనుకూల విధానాల వల్ల సామాన్య ప్రజల మధ్య మత విద్వేషాలు, మతోన్మాదం రగులుతున్నాయి. ఇది మత మూఢత్వానికి కూడా దారితీసి శతాబ్దాలుగా నిర్మించుకుంటున్న లౌకిక నాగరికత విధ్వంసానికి కారణం అవుతుంది. మనుష్యులను ఉన్మాదులుగా, మూర్ఖులుగా, అనాగరీకులుగా మారుస్తున్న ఈ ఉన్మాదాన్ని, దాన్ని పెంచి పోషిస్తున్న పాలకుల విధానాలను జనసాహితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఖండిస్తున్నది.

## నూతన లేబర్ కోడ్ల అమలును తక్షణమే వెనక్కి తీసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం 2025 నవంబర్ 21వ తారీకు నుండి 4 నూతన లేబర్ కోడ్‌లను అమలు చేయాలని భావిస్తోంది. 2020 నవంబర్ 20వ తారీఖున తీవ్ర వ్యతిరేకత, గందరగోళాల మధ్య నాలుగు నూతన లేబర్ కోడ్లను రూపొందించి, కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. అసలే అరకొరగా ఉన్న కార్మిక రంగపు భద్రతా పరిస్థితులను ఈ నాలుగు కోడ్ల పేరిట తెచ్చిన చట్టాలు మరింతగా దిగజార్చుతూ ఉన్నాయని దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

1. వేతనాల కోడ్
2. పారిశ్రామిక సంబంధాల కోడ్
3. సామాజిక భద్రత కోడ్
4. ఉద్యోగ భద్రత ఆరోగ్యము మరియు పని పరిస్థితుల కోడ్..

అనే పేర అంతకు ముందు ఉన్న 29 కార్మిక చట్టాలను కుదించి కేంద్ర ప్రభుత్వం ఈ నూతన చట్టాలను దేశ కార్మిక రంగంపై రుద్దబోతున్నది.

ఈ చట్టాలు కాకులను కొట్టి గ్రద్దలకు వేసే చందంగా.. కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయి. యాజమాన్యాలు చేసే తప్పులకు జైలుశిక్షల నుండి మినహాయిస్తూ జరిమానాలతోనే సరిపెట్టడం. 300 మంది వరకు సిబ్బంది ఉన్న కంపెనీల నుండి ఉద్యోగులను తొలగించడం లేదా కంపెనీని మూసి వేయడానికి ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి అవసరం లేదనీ.. అంతకు పైబడిన పరిశ్రమల్లో కూడా ఉద్యోగులను తొలగించడం లేదా కంపెనీని మూసి వేయడానికి ముందస్తు అనుమతి కోరినా ప్రభుత్వం లేక అధికారుల నుంచి స్పందనకు సమయం పట్టేట్టయితే అందుకు అనుమతి లభించినట్లేననే నిబంధనలు పూర్తి అప్రజాస్వామిక మైనవి. దేశవ్యాప్తంగా కనీస వేతనం ఏ రంగంలోని కార్మికుల కైనా నెలసరి 26 వేల రూపాయలు ఉండాలని డిమాండ్ వినిపిస్తుండగా అసలు కనీస వేతనం మాటే ఎత్తలేదు. రూ. 18,000/- వేతనం పొందే సూపర్‌వైజర్ వర్కర్ కాడట! ఉద్యోగంట! ESI, EPF, Gratuity వంటి, కార్మికులు పోరాడి సాధించుకున్న అంశాలపై కూడా స్పష్టత లేదు. యాజమాన్యాల ఏకపక్ష పీడనను అడ్డుకొనే సామూహిక సెలవు వంటి నిరసనలను కూడా శిక్షార్హమైనవిగా నిర్ణయించారు. ఘోరమైన విషయం ఏమంటే కార్మికులు సమ్మె చేయదలుచుకుంటే యాజమాన్యానికి 14 రోజులు ముందుగానే నోటీసు ఇవ్వాలనే గత నిబంధనను ఇపుడు రెండు నెలలు చేశారు. కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యానికి ఈ మాత్రం సమయం అవసరమనే నిర్ణయానికి ప్రభుత్వమే రావడమంటే అది కార్మిక హక్కుల పీక నొక్కడమే తప్ప మరొకటి కాదు.

కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాచి, వారి శ్రమను దోపిడీ చేసే విధానాలను సులభతరం చేస్తున్న నూతన లేబర్ కోడ్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని జనసాహితీ డిమాండ్ చేస్తున్నది.

# చైతన్యవాహిని

**20 నవంబర్ 2025, చోడవరం :**

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామంలో శాఖా గ్రంథాలయం వారు ఏర్పాటు చేసిన 'జాషువా రచనలు మరియు గ్రంథాలయాల ఆవశ్యకత 'అను అంశంపై జనసాహితి సభ్యుడు గౌరీశంకర్ మాట్లాడుతూ పుట్టుక కారణంగా జాషువా అనేక అవమానాలకు గురయ్యాడని, అయినా సాహిత్యంలో తనదైన ముద్ర వేశాడని, జీవితాంతం ఆయన దుర్భర దారిద్ర్యం మరియు కుల, మత వివక్షత గురించి తీవ్రమైన పోరాటం చేశాడని, కనుక ఆయనను ఆదర్శంగా తీసుకుని సభకు హాజరైన పిల్లలు, పెద్దలు కుల, మతాలకు అతీతమైన సమాజాన్ని నెలకొల్పే దిశగా పాటుపడాలని అన్నారు. అలా పాటుపడాలి అంటే తగిన జ్ఞానం అవసరం అన్నారు. నేటి యువత అనేక రకాల మత్తులకు బానిసలైపోయి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారు తమ దృష్టిని గ్రంథాలయాల వైపు సారించి ఉత్తమ రచనలను చదవడం ద్వారా ఉత్తమ పౌరులుగా రూపొందాలని అన్నారు.

**14 నవంబర్ 2025, విజయవాడ :**

విజయవాడ లెనిన్‌పార్క్‌లో నిర్వహించిన ప్రజాకవి అందెశ్రీ సంస్మరణ సభను ఆయన రచించిన "మాయమైపోతున్నడమ్మా!" పాటతో ప్రారంభించారు. అందెశ్రీ చిత్రపటాన్ని జనసాహితి అధ్యక్షుడు దివికుమార్, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ పూలమాలతో జోహార్లు పలుకుతూ అలంకరించారు.

ఆ తర్వాత మాట్లాడిన దివికుమార్ ప్రజల నాలుకల మీద జీవిస్తున్న మన కాలపు ప్రజాకవి అందెశ్రీ అన్నారు.

"సుమారు 90 ఏళ్ల క్రితం...

కవీ! ఓ కళాకారుడా! కవయిత్రీ ఓ కళాకారిణీ!!

అటా ఇటా నువ్వెటువైపు? ప్రజల వైపా ప్రభుత వైపా?

అని ప్రపంచ రచయితలను మాక్సిం గోర్కీ ప్రశ్నించాడన్నారు. అందెశ్రీ తాను ఎప్పుడూ ప్రజల పక్షమే అని విస్పష్టంగా ప్రకటించుకున్నాడని, ప్రజాకవిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది తెలుగు వారి హృదయాలలో నిలిచిపోయాడన్నారు. ఆయన రచించిన 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే పాట మరణం లేనిది. అంటూ ఆ పాటలోని సారాన్ని వివరించారు.

గుర్రం జాషువా కళావేదిక గుండు నారాయణ, అభ్యుదయ రచయితల సంఘం పరుచూరి అజయ్, సాహితీ స్రవంతి వొరప్రసాద్, నగర సిపిఐ కార్యదర్శి దోనేపూడి శంకర్‌లు మాట్లాడి అందెశ్రీకి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి చంద్ర నాయక్ సభను నిర్వహించారు. ఇంకా అనీల్, నజీర్, శర్మ, పిచ్చయ్య అరుణోదయ శ్రీనివాస్ తదితరులు తమ పాటల ద్వారా అందెశ్రీకి శ్రద్ధాంజలి ఘటించారు. చంద్ర నాయక్ ప్రసంగంతో సభ ముగిసింది. సభకు వివిధ ప్రజాసాహితీసాంస్కృతికోద్యమ సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజాఉద్యమకారులు, అభిమానులు హాజరయ్యారు. ✣

## మానవతా పతాకం!

– సహచరి

ఆయనన్నాడు కదా..
మనిషిని మనిషిగా చూడమన్నోడు
మనుషుల్ని గౌరవించమన్నోడు
అతనో మానవతా పతాకం.!
చెమ్మగిల్లిన కన్నుల కమ్మలు ఎన్నో చదివినోడు
చరిత్ర నెరిగిన శాస్త్రజ్ఞుడు
ప్రజల భాషలో
ప్రజల హృదయము ఉందన్నోడు
ఎవరి భాషలవాడు ఎవని యాసల వాడు
మాట్లాడాలన్న భాషా కోవిదుడు
అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించినోణ్ణి చావమన్నోడు
బడి పలుకుల భాష కాదు,
పలుకుబడుల భాష కావాలన్నోడు..
తెలంగాణ భాషా దినోత్సవానికి
మార్గదర్శిగా మారినోడు
అన్యాయాన్నెదిరించినోడేనా కారాద్యుడు
అన్యాయం అంతరిస్తేనా గొడవకుముక్తిప్రాప్తి అన్నోడు
మనిషిపుట్టుకే ఓ పోరాటమని
అదోహక్కుల ప్రకటనన్నోడు
అవనిపై జరిగేటి అవకతవకలు చూసి
పరుల కష్టము చూసి కరిగిపోయిన వాడు
హెచ్చుతగ్గులున్నచోట సచ్చిపోవు సమ భావం
సమ భావం లేని చోట సామ్యవాది అయినోడు..
అన్నపురాశులు ఒకచోట,
ఆకలి మంటలు ఇంకో చోటా? అని నిగ్గదీసినోడు
సౌజన్యాలకు రక్ష, సామరస్యాల రక్ష
సహజీవనానికి రక్షే ప్రజాస్వామ్యమన్నోడు
అతనే ఖలేజాన్నోడు
అతనే హార్టిస్టు కాళోజి.. ✣




**దయాశ్లోకం : (దీర్ఘ కవిత్వం)** – రచన డాక్టర్ మాటూరు శ్రీనివాస్; యుద్ధ ....దమ్మ ....సద్దమ్మ యాత్రలో, బౌద్ధ ధర్మ అభిమానాన్ని, అందులో ఉన్న ప్రగతిశీలతని మనసుకు అంకించుకొని, ఒక హేతువాదిగా శ్రీనివాస్ రచించిన దీర్ఘ కవిత ఇది. చండ అశోకుడు – దమ్మ అశోకుడుగా పరిణామం చెందిన క్రమాన్ని అవగాహన చేసుకున్న మేరకు రచించిన కావ్యం ఇది. 1879లో సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ రాసిన – 'లైట్ ఆఫ్ ఆసియా' దీర్ఘ కవిత శ్రీనివాస్‌కి స్ఫూర్తిగా నిలిచింది. 'లలిత విస్తార' అనే గ్రంథం ఆధారంగా రాసిన దీర్ఘ కవిత ఇది. ఈ కావ్యంలో శ్రీనివాస్ విభజించిన అధ్యాయాల తాత్త్వికత వాటి శీర్షికలలో స్పష్టంగా కనిపిస్తుంది. మానవ భావోద్వేగాలకు సమాజం ఏ విధంగా కారణం అవుతుందో – వాటిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే భావజాలాన్ని స్పష్టం చేసిన కవితాత్మక మహాకావ్యం ఇది. గురజాడ అంటాడు బౌద్ధాన్ని ధ్వంసం చేసుకున్న భారత సమాజం ఆత్మహత్య చేసుకుంది అని. ఐరోపా ఖండానికి ప్రశ్నించడం నేర్పిన తాత్త్వికుడు సోక్రటీస్, ఆసియా ఖండానికి భౌతికవాద, హేతువాద ఆలోచనక్రమాన్ని పరిచయం చేసింది బుద్ధుడనే నేపథ్యంలోంచి ఈ కావ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

1/8 డెమ్మీ – 144 పుటలు., వెల : రూ.150. మొదటి ముద్రణ : నవంబర్ 2022. ప్రచురణ : భూమి బుక్ ట్రస్ట్.

ప్రతులకు : నవ తెలంగాణ బుక్‌హౌస్ బ్రాంచీలు.

**విస్తృత కళింగ ఆంధ్ర సాహితీ ప్రభ : సంపాదకుడు – గార రంగనాథం** : కళింగాంధ్ర సాహిత్య కృషిని విశదీకరించిన సంకలనం ఇది. 30 మంది రచయితలు రాసిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. ఉత్తరాంధ్ర ప్రాచీన సాహిత్యం గురించి మొదలుపెట్టి బరంపురం తెలుగు సాహిత్యం వరకు ఇక్కడ ఈ నేల సారాన్ని పట్టి ఇచ్చిన రచనలు ఈ గ్రంథంలో ఉన్నాయి. నన్నయ సమకాలికమైన సీస పద్యం ఉన్న దీర్ఘాసి శాసనం నుండి తొలి తెలుగు రచనగా చెప్పుకోబడుతున్న కృష్ణమాచార్యుల రచించిన సింహగిరి వచనాలు ఇక్కడవే అని చెబుతూ సమగ్ర కళింగాంధ్ర సాహిత్య చరిత్రను రాయవలసిన స్ఫూర్తిని ఈ పుస్తకం కలిగించాలని సంపాదకుడిగా గార రంగనాథం కోరుతున్నారు.

1/8 డెమ్మీ 320 పుటలు. వెల : రూ.300/– మొదటి ముద్రణ : 19 ఫిబ్రవరి 2023. ప్రచురణ : రాజాం రచయితల వేదిక

ప్రతుల కోసం : గార రంగనాథం, రాజాం – 532127, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్, సంచారవాణి : 98857 58123. email : ranganadhamga@gmail.com

**నీటి గింజల పంట & గీసి చెరిపే బొమ్మ** – కవి : ఈ రెండు కవితా సంపుటాలను కవి భుజంగరావు వరుసగా 2023 లోనూ, మే 2025 లోనూ ప్రచురించారు. ఈ రెండు పుస్తకాల కవితలు కంచరాన భుజంగరావు కలంకృషిని తెలియచేస్తున్నాయి. ఎదుగుతున్న కవిగా – కవిత్వానికి అంకితమై, చెదిరిపోని ఏకాగ్రతతో ముందుకు సాగుతున్న కృషి అతనిది. "నీవు స్వేచ్ఛ విహంగానివి, మబ్బులు ఎన్ని ముసిరి దాచినా, నీ రెక్కల కింది ఆకాశం నీదే" అంటూ "ఉన్నతమైన ఆకాశ విహారానికి ఆనందపడుతూనే, అలసటైనప్పుడల్లా, ఓ కాలు మడిచి, మరో కాళ్లు మోపడానికి, నాన్న భుజం లాంటి కొమ్మలున్న, ఒక చెట్టును ఎంచుకో" అనే తాత్త్వికత అతని కవిత్వంలో కనిపిస్తుంది. "రెప్ప మూయడం మరచిన దేహాల మీద నెత్తి నోరు మొత్తుకుని రోదించే లేచివుళ్ళు, పండుటాకుల భీతి గుండెల శ్లోకాన్ని అచ్చంగా కొలిచే తూనిక రాళ్లే దొరకని యుద్ధ రక్కసి శతాబ్దంలో ఉన్నా"మనే అక్షరాల ఆర్ద్రత ఈ కవిత్వంలో మన స్పర్శకు అందుతుంది. భావచిత్రాల పళ్ళతోటలా విరగ కాసిన ఈ రెండు కవితా సంపుటాలూ, 59 కవితలతో "నీటి గింజల పంట", 54 కవితలతో "గీసి చెరిపే బొమ్మ" – తీరని కవిత్వ దాహానికి రెండు చలివేంద్రాలు.

1/8 డెమ్మీ – 'నీటి గింజల పంట' 160 పుటలు, 'గీసి చెరిపే బొమ్మ' 152 పుటలు; రెండు పుస్తకాల వెల (ఒక్కొక్కటి) : రూ.150. ప్రచురణ : సిక్కోలు బుక్స్.

ప్రతుల కోసం : కంచరాన భుజంగరావు, సంచారవాణి : 94415 89602.

**టీటీ పిట్ట :** కవితా సంపుటి – రచన : ఎల్ ఎన్ కొల్లి, ఆంగ్ల సాహిత్యంలో అభివృద్ధి కలిగిన కవి ఇతను. వాయనాడు విధ్వంసం మీద ఎంత అనుకంపతో ఇతని కలం స్పందిస్తుందో – ఒంటరితనపు లోయ అంచున కూడా – జ్ఞాపకాల నుంచి కూడా – ప్రకృతిలో తనను తాను వెతుక్కుంటూ చెప్పిన కవిత్వం వరకు – అస్థిరమైన నేలపై – గుర్తింపు సంకటంలో చిక్కుకుంది ప్రపంచం అంటూ ఒకానొక జీవన తాత్త్వికతా అభివ్యక్తి కూడా ఈ కవిత్వంలో మనం చూడవచ్చు. ఈ సంపుటిలో 55 కవితలు ఉన్నాయి. ఆంగ్ల సాహిత్యం పైన, ఆంగ్ల వ్యాకరణం పైన, ఆంగ్లంలో పిల్లల కథల పైన ఇలా ఒక 13 పుస్తకాలు ఇప్పటికే ప్రచురించి ఉన్నారు ఈ కవి.

1/8 డెమ్మీలో 108 పుటలు. వెల : రూ. 120/– తొలి ముద్రణ : మే 2025; చీకటి ప్రచురణలు – వెలుగు కోసం.

**ముంజూరు :** కళింగాంధ్ర కవిత వార్షిక 2024 – సంకలనం : దుప్పల రవికుమార్; కవితా వార్షికల సంస్కృతి మొదలై చాలాకాలమైంది. అందులో భాగంగానే ఈ సంకల్పం మొదటిగా కళింగ ఆంధ్ర కవిత వార్షికగా సాహిత్య ప్రయాణం మొదలుపెట్టింది. ఇందులో ప్రాచీన కాలం నుండి విస్మయకరమైన కళింగాంధ్ర ప్రాంత జీవన వైచిత్రిని ఇందులోని కవితలు చూపిస్తాయి. ఈ సంకలనంలో ఉన్న 130 కవితలు 72 మంది కవులు రచించినవి.

1/8 డెమ్మీలో 263 పుటలు – వెల : రూ.250/– తొలి ముద్రణ : 2025 ప్రచురణ : సిక్కోలు బుక్స్.

ప్రతులకు : సిక్కోలు బుక్స్. సంచారవాణి : 99892 65444.

**(ఇంకా వున్నాయి)**

# మన తరం వాగ్గేయకారుడు అందెశ్రీ మరణం



**లోకకవి,** గాయకుడు అందెశ్రీ (అందె ఎల్లయ్య) తన 64వ యేట అనారోగ్యంతో 2025 నవంబరు 10న హైదరాబాదులో మరణించారు. ఆయన 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా (పూర్వపు వరంగల్ జిల్లా)లోని రేపర్తి గ్రామంలో జన్మించారు. తన బాల్యంలోనే తలితండ్రులు ఎల్లవ్వ, బొడ్డయ్యలను కోల్పోయి, అనాధగా పెరిగారు.

ఆయన ఏ పాఠశాలలోనూ చదవలేదు. మిత్రులవద్ద అక్షరాలు నేర్చుకున్నాడు. తన జీవనోపాధికోసం గొర్రెల కాపరిగా, రోజుకూలీగా, తాపీ కార్మికునిగా వివిధ ప్రాంతాలలో పని చేశారు. అలా పనిచేస్తూనే ఆశువుగా కైతలు కట్టి పాడుకునేవారు. ఆధ్యాత్మిక దృష్టి వున్న ఆయన నిజామాబాద్‌లోని శృంగేరి మఠంకు చెందిన స్వామి శంకర మహరాజ్‌తో పరిచయంకాగా, వీరి కవితాశక్తిని గమనించి 'అందె శ్రీ' అని పిలవడం ప్రారంభించారు.

అందెశ్రీ సంప్రదాయ సాహిత్యాన్ని, జానపద సాహిత్యాన్ని జగ్గిరెడ్డి మల్లారెడ్డి దగ్గర నేర్చుకున్నారు, ఆచార్య బిరుదురాజు రామరాజు అందెశ్రీని ప్రోత్సహించారు. తన జీవితానుభవాలతో ప్రకృతిలో లీనమై ఆయన పాటలను అల్లారు. 1994లో ఆయన రాసిన లలిత గీతాల సంపుటి 'పాటల పూదోట' వెలువడింది. కొన్ని పాటలను 1994 లో 'అందెల సందరి'గా ప్రచురించారు. తెలంగాణాకు సంబంధించిన పాటలు, కవితల సేకరించి 'నిప్పుల వాగు' అనే వేయి పుటల సంకలనాన్ని 2022లో ప్రచురించారు.

ప్రజాస్వామ్య తెలంగాణా సాధన లక్ష్యంగా ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన ప్రత్యేక తెలంగాణా ఉద్యమ కాలంలో రాసిన 'జయ జయహే తెలంగాణ!' గేయాన్ని తెలంగాణా ప్రభుత్వం రాష్ట్రగేయంగా స్వీకరించి ఆర్థికంగా ఆయనకు కోటి రూపాయలు ఇచ్చి గౌరవించింది. వీరు రాసిన మరో అద్భుత గేయం 'మాయమై పోతున్నడమ్మా' రెండు తెలుగు రాష్ట్రాలలోనూ గొప్ప ప్రాచుర్యం పొందింది. జానపద బాణీలలో వుండే ఆయన పాటలలో లోతైన సామాజిక, మానసిక, తాత్త్విక అంశాలు, ఉత్తేజం, ఆవేదన, నిరసన, ప్రతిఘటన ఇమిడి వుంటాయి.

2007లో విడుదలైన 'గంగ' సినిమాలో వీరు రాసిన పాట 'వెళ్ళి పోతున్నావా'కు నంది అవార్డు వచ్చింది. ఎన్నో అభ్యుదయ సినిమాలకు వీరు పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది. అకాడెమీ ఆఫ్ యునివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డి.సి. వారు గౌరవ డాక్టరేట్‌తో పాటు 'లోక కవి' అనే బిరుదు ఇచ్చి 2014లో సత్కరించారు. ఇంకా ఎన్నో పురస్కారాలు అందుకున్న అందెశ్రీ ప్రపంచంలోని నదులపుట్టుక చూడాలనే తపనతో దేశంలోనూ, విదేశాలలోనూ ఎన్నో నదులను చూసి పరవశించారు.

హైదరాబాదులో జనసాహితి జంటనగరాల శాఖ నిర్వహించిన 'ప్రజాసాహితి' ప్రజాకళారూపాల ప్రత్యేక సంచిక రెండవ ముద్రణ ఆవిష్కరణ సభలో ఆయన వక్తగా పాల్గొన్నారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట కాలంలో ఆశువుగా పాటలు అల్లిన యాదగిరిని తలపించిన మన కాలపు ప్రజాకవి, వాగ్గేయకారుడు, లోకకవి అందెశ్రీ మరణానికి జనసాహితి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తోంది.

# ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య హత్యను ఖండిస్తున్నాం



**నెల్లూరు** ప్రజానాట్యమండలి రూరల్ డివిజన్ అధ్యక్షుడు పెంచలయ్య (38)ను 28-11-25న అతని పిల్లలముందే గంజాయి ముఠా మారణాయుధాలతో వెంబడిస్తూ హత్య చేయడాన్ని జనసాహితి ఖండిస్తోంది. పెంచలయ్య ప్రజానాట్యమండలి కళాకారుడుగా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి వీధి నాటకాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్ని చైతన్యపరుస్తున్నారు. పెంచలయ్యను గంజాయి ముఠానే హత్య చేయడం సమాజంలో పెరిగిపోతూన్న మద్యం, మాదకద్రవ్యాల ప్రమాదాన్ని తెలియచేస్తుంది. మాదకద్రవ్యాలను సేవించిన తర్వాత విచక్షణారహితంగా, నేరపూరితంగా, హింసాయుతంగా ప్రవర్తిస్తారనడానికి ఇది ఒక పరాకాష్ట. మన తెలుగు రాష్ట్రాలలో మద్యం, మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకు పెరిగిపోతున్నా మన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వుండటాన్ని జనసాహితి ఖండిస్తోంది. ప్రజాకళాకారుడు పెంచలయ్యకు జోహార్లు చెబుతోంది.

కవిత

# పద్మవ్యూహం

– పి.ఎస్. నాగరాజు

నేలతల్లి శ్రమ చలనంలో
అడుగడుగునా ఉదయమే!!

పట్ట పగలు చీకట్లను
చిమ్ముతున్న వే పడగలు!!

చీకటితో కలబడుతున్న
కన్నీటి నెత్తుటి పిడికిళ్ళు ఇంకెన్నెన్నో!!

ఏది తూర్పు? ఏది పడమర?
నెత్తుటి పాదముద్రలకు!!

ఏది ఉత్తర? ఏది దక్షిణ?
పాలపుంతల పోరుబాటల కాంతి జాడలకు!!

ఏది గతం? ఏ దవగతం?
ధిక్కారం ఉరుముల పిడుగులకు!!

ముక్కోటి ఏకాశిని
మృత్యు కోరలు చేసింది
ఫ్యూడో - కార్పో భక్తి పరిశ్రమ!!

దక్కన్ దళారీ కోటి దీపోత్సవం
మైకంలా కమ్మేసింది!!

చేసిన "కష్టం" - కన్నీరై పోతోంది!!
కన్నీరిక్కడ నీటిపుట్టలై కరకట్లు
తెగుతున్నాయి!!

శ్రమ సంపదలు "మాయాబజార్ల"కు!!
శ్రమ శక్తులు "పుణ్యతీర్థాల"కు!!

ఈతి బాధల బడుగు మూలాల్ని
కప్పి పెడుతున్న ఏలిక పాము లెక్కడివో!!

రాతి బొమ్మల గుట్టుమట్టుల్ని
కాపు కాసుకొస్తున్న
బదనికల పాలనా వంచనా శిల్పం
ఏ పుణ్యాత్ముల పవిత్ర కార్యమో!!

గ్రహాంతర శతాబ్దంలో
గుహాంతర సాంస్కృతిక పతన వీరంగాలు!!

ఏడు సంద్రా లవతలి
యుద్ధ బేహారి కుతంత్రం
పతాక సన్నివేశాన్ని చేరుకుంది!!

★ ★ ★ ★

రహదారులు అనకొండలు
పెత్తందారులు రక్తపింజేరులు!!

అనుదిన పయనా లిక్కడ
అంతిమయాత్రలు!!

వస్తు సేవల గారడీలు!!
దారిదోపిడి అడ్డగోలు కేంద్రాలు!!
మాయ లేడులు - మహామాయ మీడియాలు!!

ఇంకెన్నో - ఎన్నెన్నో
రహస్య భస్మహస్తాలు
అంతులేని సుంకాలు!!

బతుకు పంటకు సోకిన
ఈ సుంకు తెగులే
అభివృద్ధి బింకాలు!!

నిత్య కృత్యమైపోతున్న
మరణ యాతన ఎవ్వరివో!!

శవాల మీద డబ్బు లేరుకునే
అకృత్య ఎన్నికల పదవీ వ్యాపారాల
ఆగడా లెవ్వరివో!!

ఎన్నాళ్ళు?? ఇంకెన్నాళ్ళు??

అక్షరంలో అగ్గి కొలిమి నిగ్గుదేలి వుంది!!
అక్షయంగా ఆయుధాల్ని అందించే
తీరుతుంది!!

నిషేధాల - నిర్బంధాల
పొగమంచుల - ముళ్ళకంచెల
ఈ నివు రెక్కడిదైతేనం!!

అంతర్జ్వాలను
ఆర్పేయాలనుకునే అంతర్'జాలాల
ప్రపంచీ బజారుల - జారుల, తీరుల
కలుష విష కషాయాల మేళా లెప్పటివి!?

అగంతక హంతకు పిరికితనం ఎవరిదైతేనే!!

పల్లె పల్లే - బాణాకర్రల కణకణాలు!!
పట్టణాల సుడి బతుకుల వడగాడ్పులు!!
కడలి బిడ్డ కన్నీటి సునామీలు!!
అడవి బిడ్డ బడబాగ్ని కీలలు!!
ఆడబిడ్డ అగ్నిగర్భ విస్ఫోటనాలు!!
బడి బిడ్డ గుండె గుబులు ఆక్రోశాలు!!
కాలేజీ యువ బిడ్డ హతాశల ఖలేజాలు!!

ఇవిగో!! ఇల్లివిగో!!

మట్టి బిడ్డ మడిచెక్క ప్రకంపనల తెగింపుతో
మరబిడ్డ గురితప్పని సంఘటిత పెను
పిడికిలి బిగింపుతో!!

ఖండాలను అధిగమించి,
ప్రాంతాలను ప్రాణంగా గుండెలకు
హత్తుకొని

సౌర సంలీన విశ్వజ్వాలా దృశ్యమదిగో!!
వసుధ సమైక్య పోరాట ప్రజాగ్రహాల
కవాతులివిగో!!

డాలర్ పద్మవ్యూహాల్ని ఛేదించే
సూర్యకిరణానంత వాక్యమే
ఇదిగో!! ఇదిగిదిగో!! ఇల్లిదిఇదిగో!!

అమరత్వం జయిస్తుంది!!
జనతత్వం ఫలిస్తుంది!!
అనునిత్యం ధ్వనిస్తుంది!!
ఈ సత్యం నిలుస్తుంది!!

PRAJA SAAHITI December 2025 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా....



ప్రజలందరికీ సమాన గౌరవం దక్కాలి....

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI